అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 19-2-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 359 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



మనోళ్లు బంగారం
• మహిళా బ్యాడ్మింటన్ జట్టుకు పసిడి పతకం • ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్
వివరాలు ఆటలుల్లో..

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వాళ్లకేనా..?
ఇతర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారి సంగతేంటి అంటూ ప్రశ్న
• కేంద్రానికి మధ్యప్రదేశ్ హైకోర్టు నోటీసులు



భోపాల్: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లపై మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆర్థికంగా వెనుకబడిన జనరల్ కేటగిరీ కులాల వారికి మాత్రమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు వర్తిస్తాయా..? అని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇతర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు వర్తించడం లేదని 'అడ్వకేట్స్ యూనియన్ ఫర్ డెమోక్రసీ అండ్ సోషల్ జస్టిస్' సంస్థ మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కేవలం జనరల్ కేటగిరీ అభ్యర్థులకే వర్తిస్తాయా..? లేదంటే ఇతర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి కూడా వర్తిస్తాయా..? అనే విషయంలో స్పష్టత ఇవ్వాలంటూ చీఫ్ జస్టిస్ రవి విజయ మలిమత్, జస్టిస్ విశాల్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఆరు వారాల్లో స్పందనను తెలియజేయాలని ఆదేశించింది. కాగా, ఇతర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వర్తించడం లేదని, పేదలపై కులం పేరుతో ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని, ఈ రిజర్వేషన్‌లను రాజ్యాంగ విరుద్ధంగా భావించి కొట్టి వేయాలని పిటిషనర్‌లు కోర్టును కోరారు.

ఔటర్ సమీపంలో పారిశ్రామిక సిటీ
25వేల ఎకరాల్లో నిర్మాణం : సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో 25 వేల ఎకరాల్లో కాలుష్య రహిత పారిశ్రామిక సిటీని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిలో హెల్త్, స్పోర్ట్స్‌కు సంబంధించిన పరిశ్రమలు ఉంటాయన్నారు. నానక్‌రామ్‌గూడలో తెలంగాణ స్టేట్ ఫైర్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ బిల్డింగ్‌ను ఆదివారంనాడాయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలు సక్రమంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయన్నారు. పెట్టుబడులకు హైదరాబాద్ నగరం అనువైన ప్రాంతమనీ, ఇక్కడ రాజకీయాలు ఎలా ఉన్నా నగరాభివృద్ధి కొనసాగిందని చెప్పారు. ఇక్కడ గత ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను కొనసాగిస్తూనే, మరింత ఉన్నతంగా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి త్వరలో మెగా మాస్టర్ ప్లాన్-2050 తీసుకొస్తామనీ, అర్బన్, సెమీ అర్బన్, రూరల్ పేరుతో మూడు భాగాలుగా విభజించి, ఎక్కడికక్కడ స్థానిక పరిశ్రమల్ని నెలకొల్పి అభివృద్ధిని సాధిస్తామని ...11లో



నాణ్యమైన విద్య అందట్లే!
నిరుద్యోగానికి అదీ ఓ కారణమే : ఏఎస్ఈఆర్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలో నాణ్యమైన విద్య లభించడం లేదని యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (ఏఎస్ఈఆర్) ఆందోళన వ్యక్తం చేసింది. గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు ఎంత మంది విద్యను అభ్యసిస్తున్నారు, వారి విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయి అనే విషయాలపై ఏఎస్ఈఆర్ 2005లో అధ్యయనం ప్రారంభించింది. ఇప్పటి వరకూ మూడు నివేదికలు వెలువడ్డాయి. తాజాగా గత సంవత్సరం విడుదలైన నివేదిక పాఠశాల విద్యపై పెదవి విరిచింది. 14-18 సంవత్సరాల మధ్య వయసున్న విద్యార్థుల్లో విద్యకు సంబంధించిన పునాది ఇప్పటికీ బలహీనంగానే ఉన్నదని తేల్చింది. ఉద్యోగాలలో చేరే సమయంలో కూడా వీరికి ప్రాథమిక అవగాహన కొరవడిందని తెలిపింది.

తాజా నివేదిక ప్రకారం...14-18 సంవత్సరాల మధ్య వయసున్న వారిలో కేవలం 73.6% మంది మాత్రమే స్టాండర్డ్-2 స్థాయి పుస్తకాన్ని చదవగలుగుతున్నారు. గణితంలో కేవలం 45% మందికే ప్రాథమిక నైపుణ్యం ఉంది. మిగిలిన వారి పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నదని నివేదిక వివరించింది. బలమైన పునాది లేకపోవడంతో యువత సరైన ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. మానవాభివృద్ధిలో విద్యకు ఉన్న ప్రాధాన్యత గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజలు తమ సామాజిక, ఆర్థిక హోదాను మెరుగుపరచుకోవాలంటే తప్పనిసరిగా విద్యావంతులై ఉండాలి. పేదరికాన్ని నిర్మూలించడంలో విద్య సహాయకారిగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు విద్యకు తగినంత ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే క్షేత్ర స్థాయిలో అలా జరగడం లేదు. 2022లో విడుదలైన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం నిరక్షరాస్యుల్లో, ప్రాథమిక స్థాయి వరకూ చదువుకున్న వారిలో ...3లో

ఉద్యోగాల కల్పనలో స్తబ్దత
• చేతులెత్తేసిన మోడీ ప్రభుత్వం
• తైవాన్, ఇజ్రాయిల్‌తో ఒప్పందాలు
• కార్మికులను తరలించేందుకు ప్రయత్నాలు : లక్నో ఐఐఎం వెల్లడి
వివరాలు 3లో

జార్ఖండ్‌లోనూ కులగణన
• సీఎం చంపయి సోరేన్ గ్రీన్‌సిగ్నల్



రాంచీ : బీహార్ తరహాలో జార్ఖండ్‌లో కూడా కులగణన నిర్వహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంపయి సోరేన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సర్వేకు సంబంధించి ముసాయిదాను రూపొందించాలని, దానిని ఆమోదం నిమిత్తం క్యాబినెట్ ముందు ఉంచాలని ఆయన ఆదివారం నాడు సిబ్బంది శాఖను ఆదేశించారు. అంతా ఓ ప్రణాళిక ప్రకారమే జరుగుతుందని, లోక్‌సభ ఎన్నికల తర్వాత కులగణన ప్రారంభమవుతుందని ...11లో

21న నల్లజెండాలతో నిరసన
రైతన్నకు అన్యాయంపై నిలదీత
• బీజేపీ, ఎన్డీఏ ఎంపీల ఇండ్ల ముందు ఆందోళన : సంయుక్త కిసాన్ మోర్చా

నవతెలంగాణ న్యూఢిల్లీ బ్యూరో
2021 డిసెంబర్ 9న ఎస్కేఎంతో ఒప్పందాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో పాటుగా ఎంఎస్పీ సి2+50 శాతం హామీతో కూడిన సేకరణ, సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 21న బీజేపీ, ఎన్డీఏ పార్లమెంట్ సభ్యులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నల్లజెండాలు ప్రదర్శించాలని దేశ వ్యాప్తంగా రైతులకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) పిలుపునిచ్చింది. "కరెంటు ప్రయివేటీకరణ ఆపాలి. లఖింపూర్ ఖేరీలో రైతుల మారణకాండకు ప్రధాన సూత్రధారి కేంద్ర హోం సహాయ మంత్రి అజయ్ మిశ్రా టెనిని తొలగించి, విచారించాలి. పంజాబ్ సరిహద్దులో రైతుల అణచివేతను అరికట్టాలి" అని డిమాండ్ చేసింది. రైతు వ్యతిరేక,



ప్రజాస్వామ్య వ్యతిరేక, అణచివేత, నియంతృత్వ వైఖరిని బహిర్గతం చేయాలని విజ్ఞప్తి చేసింది.

పంజాబ్‌లో మూడు రోజుల పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, బీజేపీ జిల్లా అధ్యక్షుల ఇండ్ల ముందు రాత్రి పగలు భారీ నిరసనలు చేపట్టాలని ఎస్కేఎం నిర్ణయించింది. 20 ఉదయం ...11లో



బంద్, సమ్మెలో 20 కోట్ల మంది
• ఎస్‌కేఎం, కేంద్రకార్మికసంఘాల వెల్లడి
వివరాలు 11లో

ఇకపై వడ్డీ లేని డ్వాక్రా రుణాలు
సీఐటీయూ వినతిపై స్పందించిన భట్టి
• స్కీం వర్కర్లకు ప్రతినెలా జీతాలు చెల్లిస్తామని హామీ : మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



నవతెలంగాణ-భద్రాచలం రూరల్
భద్రాచలం ఐటీడీఏ పాలకమండలి సమావేశానికి విచ్చేసిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇచ్చిన వినతి పత్రం పట్ల స్పందించారు. సీఐటీయూ ...11లో



గిరిజనంలో వెలుగులు నింపుతాం 11లో

సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తాం
• ఎన్నికల బాండ్లపై సీఈసీ



న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన తర్వాత ఎన్నికల సంఘం ...11లో

ప్రమాదంలో రిజర్వేషన్లు
• దళిత వర్గాలకు అన్యాయం :డీవైఎఫ్ఐ యువ దళిత సదస్సులో యూజీసీ మాజీ చైర్మెన్ సుఖదేవ్ థోరాట్



వివరాలు 2లో

రైతులపై దమనకాండ సరికాదు
కేంద్రానికి లొంగిపోయిన జాతీయ మీడియా
• ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసిన వారికి వేధింపులు
• రాజ్యాంగం అమలుకు పెరుగుతున్న సవాళ్లు : నార్ల వెంకటేశ్వరరావు పురస్కార ప్రదాన సభలో పాలగుమ్మి సాయినాథ్



గుంటూరు : కనీస మద్దతు ధర చట్టం కోసం రైతులు చేస్తోన్న ఆందోళనలపై ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం పాశవికమైన దమనకాండకు పాల్పడుతోందని ప్రముఖ జర్నలిస్టు, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ అన్నారు. గుంటూరులోని కొరటాల భవన్‌లో అంబేద్కర్, జాషువా, ఫూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ జర్నలిస్టు నార్ల వెంకటేశ్వరరావు పురస్కారాన్ని ఆదివారం రాత్రి పాలగుమ్మి సాయినాథ్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఫౌండేషన్ అధ్యక్షులు బి.విల్సన్ అధ్యక్షత వహించారు. సాయినాథ్ మాట్లాడుతూ హర్యానా, పంజాబ్ ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల వ్యవహరిస్తోన్న తీరు సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం డ్రోన్ల ద్వారా మూకుమ్మడిగా భాష్పవాయువు గోళాలు ప్రయోగిస్తుంటే రైతుల పిల్లలు వీటిని తెలివిగా గాలిపటాల ద్వారా అడ్డుకున్నారని వివరించారు. ఢిల్లీ సరిహద్దులో జరుగుతున్న రైతుల ఉద్యమంపై జాతీయ మీడియా ఫోకస్ చేయడం లేదని, ఒక్క పత్రికలో కూడా కనీసం ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఒక్క ఎడిటోరియల్ కూడా రాలేదని అన్నారు. రైతులపై కేంద్ర బలగాలు కనీవినీ ఎరుగని రీతిలో దాడులకు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. అన్నదాతలపై ప్రభుత్వం డ్రోన్లు, వైమానిక దాడులు చేయడం అత్యంత పాశవికమని తెలిపారు. ఇతర దేశాల టెర్రరిస్టులపై ప్రయోగించాల్సిన డ్రోన్లు, వైమానిక దాడులు మన దేశ రైతులపై ప్రయోగించడం శోచనీయమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి జాతీయ మీడియా, కార్పొరేట్ మీడియా దాసోహం అనడం వల్ల ప్రజా సమస్యలు వెలుగులోకి రావడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత కేంద్ర పాలకులు సమాజాన్ని మత, కుల పరంగా విభజిస్తున్నారని విమర్శించారు. దేశంలోని ...2లో

కేసీఆర్ ఇలాకపై నజర్
మెదక్ ఎంపీ సీటు గెలుపు కోసం కాంగ్రెస్ కసరత్తు
• సిద్దిపేటలో మకాం వేసిన మైనంపల్లి హనుమంతరావు
• బలమైన అభ్యర్థిని బరిలోకి దించే వ్యూహం
• కాంగ్రెస్ వైపు నీలం మధు, ఇతర నాయకులు
• మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నియోజక వర్గాలపై స్పెషల్ ఫోకస్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి
కేసీఆర్ ఇలాకాపై హస్తం నేతల కన్ను పడింది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్‌ఎస్‌ను ఢీ కొట్టి గెలిచి తీరాలనే పట్టుదలతో మెదక్ నియోజకవర్గంపై దృష్టి సారించారు. మరో పక్క తన ఇలాకాలో మరొకరికి చోటివ్వకుండా తమ పట్టు నిలుపుకోవాలన్న పట్టుదలతో గులాబీ బాస్ కేసీఆర్, ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు మాత్రం ఎలాగైనా బీఆర్ఎస్ కంచుకోటను బద్దలు కొట్టాలనే లక్ష్యంతో చాపకింద నీరులా పార్టీని విస్తరింప చేస్తున్నారు. ఆరుగురు ఎమ్మెల్యేలు గెలిచి రెండు లక్షల ఓట్ల మెజార్టీ ఉన్నప్పటికీ బలమైన అభ్యర్థి పోటీలో లేకపోతే ఫలితం అటు ఇటు అవ్వొచ్చనే లెక్కలేస్తున్న గులాబీ బాస్.. గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున మెదక్ ఎంపీ సీటు గెలిచి తీరాలనే పట్టుదలతో బలమైన అభ్యర్థిని బరిలో దించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇలా ఇరు పార్టీలు వ్యూహ ప్రతి వ్యూహాలతో ఎవరు పై చేయి సాధిస్తారో చూడాలి. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం చుట్టూ ...11లో



రేషన్ బస్తాలపై మోడీ చిత్రం కోసం కోట్లు వ్యయం

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఆహారధాన్యాల పంపిణీకి ఉపయోగించే బస్తాలపై నరేంద్ర మోడీ చిత్రం ముద్రించేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మోడీ చిత్రంతో కూడిన ప్రత్యేక సంచులను ముద్రించాలని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ యూనిట్లను ఆదేశించింది. రాజస్థాన్‌లోనే 13.29 కోట్ల సింథటిక్ బ్యాగులను ఆర్డర్ చేశారు. మోడీ చిత్రాన్ని ముద్రించేందుకు ఒక్కో బ్యాగ్‌కు అదనంగా రూ.12.37 కాగా.. నాగాలాండ్ ఒక్కో బ్యాగ్‌కు రూ.9.30 చొప్పున కాంట్రాక్ట్ ఇచ్చింది. తమిళనాడులో 1.14 కోట్ల బస్తాలకు టెండర్ పిలిచారు. రేషన్ షాపుల్లో ప్రధాని నరేంద్ర మోడీ కటౌట్‌తో కూడిన సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కేరళ తిరస్కరించింది. కోవిడ్-వ్యాక్సినేషన్ సర్టిఫికెట్‌పై ప్రధాని ఫోటోను ముద్రించడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే.

డ్రోన్‌ల లక్ష్యం

రైతుల నిరసన మాత్రమే కాదు

- టియర్ గ్యాస్ షెల్‌ల వినియోగం కూడా
- అన్నదాతల నిరసనల్లో భద్రతా దళాల తీరు



న్యూఢిల్లీ : మంగళవారం నాడు అంబాలాలోని శంభు సరిహద్దులో వేలాది మంది రైతులు తమ డిమాండ్‌ల కోసం ఢిల్లీకి మార్చ్‌కు తరలి వచ్చారు. నిరసనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు టియర్ గ్యాస్ షెల్‌లను వదలటానికి డ్రోన్‌లను ఉపయోగించాయి. "డ్రోన్ల నుంచి షెల్స్ జారిపోతున్నాయని మేము మొదట అర్థం చేసుకోలేకపోయాం. చాలా శబ్దం ఉన్నది కాబట్టి మేము డ్రోన్ శబ్దాన్ని కూడా వినలేకపోయాము. కానీ అప్పుడు ఎవరో గుండ్లు మాపై నుంచి విసిరివేస్తున్నారు. ముందు నుంచి కాదు" అని సైట్లో ఉన్న రైతు తేజ్వీర్ సింగ్ చెప్పారు.టియర్ గ్యాస్ షెల్స్‌ను వదలటానికి పోలీసులు డ్రోన్‌లను ఉపయోగించిన భారతదేశంలో మొదటి సంఘటనగా ఇది నివేదించబడింది. అయితే, ఇటీవలి సంవత్సరాలలో భారత్‌లో భద్రతా దళాల ద్వారా డ్రోన్ల వినియోగం పెరిగింది. ఇది పౌరుల గోప్యత గురించి ఆందోళన కలిగిస్తుందని నిపుణులు అంటున్నారు.

డ్రోన్‌ల విస్తృత వినియోగం

శంభు సరిహద్దులో రైతులు డ్రోన్‌లను గుర్తించినప్పుడు, నిరసనకారులను గుర్తించటానికి వాటిని ఏరియల్ కెమెరాలుగా ఉపయోగిస్తున్నారని రైతు నిరసనకారులు తెలిపారు. ప్రభుత్వం డ్రోన్ ఇమేజింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ ఆఫ్ హర్యానా లిమిటెడ్ లేదా 2021లో ప్రారంభించబడిన పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ ద్వారా తయారు చేయబడిన డ్రోన్‌లను ఉపయోగించిందని హర్యానా పోలీసు అధికారి ఒకరు చెప్పారు. ఈ డ్రోన్‌లు సాధారణంగా ప్రయోజనం కోసం ఉపయోగించే తుపాకుల కంటే ఎక్కువ శ్రేణి టియర్ గ్యాస్ షెల్‌లను కాల్చే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని హర్యానా పోలీసు అధికారి ఒకరు తెలిపారు.2019లో, పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా నిరసనకారులను గుర్తించటానికి ఢిల్లీ పోలీసులు డ్రోన్‌లపై అమర్చిన కెమెరాలను ఉపయోగించారు. ఫిబ్రవరి 2020లో ఢిల్లీలో జరిగిన హింసాకాండలో డ్రోన్‌లను కూడా ఉపయోగించారు. హింస సమయంలో పోలీసింగ్ కోసం డ్రోన్‌లను ఉపయోగించడంపై సమాచార హక్కు అభ్యర్థనకు ప్రతిస్పందనగా.. ఢిల్లీ పోలీసులు మార్గదర్శకాలు, నియమాలు లేదా ప్రామాణిక కార్యాచరణ విధానాలు ఉన్నాయా అనే దానిపై స్పందించకపోవటం గమనార్హం.

'రామరాజ్యం' అమలు భేష్

- ప్రధాని మోడీని అభినందిస్తూ బీజేపీ తీర్మానం

న్యూఢిల్లీ : గత 10 సంవత్సరాలుగా భారత్‌లో 'రామరాజ్యం' అనే ఆదర్శ వంతమైన పాలనను సమర్థవంతంగా అమలు చేసినందుకు ప్రధాని మోడీని బీజేపీ అభినందించింది. ఈ మేరకు శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. "వికసిత్ భారత్ - మోడీ గ్యారంటీ" పేరుతో రూపొందించిన తీర్మానం.. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రెండు సార్లు ఉన్న సమయంలో భారత ఆర్థిక పురోగతి విషయంలో మోడీని ప్రశంసిం చింది. దేశరాజధాని న్యూఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఈ తీర్మానాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బలపరిచారు. యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ కూడా తీర్మానానికి మద్దతుగా మాట్లాడారు. మోడీ నాయకత్వంలో, శ్రీరాముని ఆలయాన్ని నిర్మించటమే కాకుండా, అతను గత 10 సంవత్సరాలలో రామ రాజ్య భావనను కూడా సమర్థవంతంగా అమలు చేసాడని తీర్మానం పేర్కొనటం గమనార్హం.

పనులు వేగవంతం చేయాలి

- డాక్టర్ మల్లు రవి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పనులు వేగంగా పూర్తి చేయాలని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఢిల్లీలో ఆయన అధికారులతో సమావేశమై శాఖల వారీగా చర్చించారు. పెండింగ్ పనుల పూర్తిపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నీటిపారుదల, మున్సిపల్, పట్టణాభివృద్ధి తదితర శాఖలతో సమీక్షించిన మల్లు రవి, పెండింగ్ అనుమతులు, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, క్లియరెన్స్‌లపై ఆరా తీశారు. తగిన సమాచారాన్ని సిద్ధం చేసుకుని కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అనుమతులను వెంటనే సాధించాలని సూచించారు.

ఇమామ్‌పేట గురుకులంలో..

- మరో విద్యార్థిని ఆత్మహత్య



నవతెలంగాణ-మోతె

సూర్యాపేట మండలం ఇమాంపేట గురుకుల పాఠశాలలో ఐదు రోజుల కింద ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే అదే గురుకులంకు చెందిన మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మోతె మండలం బురకచర్ల గ్రామానికి చెందిన ఇరుగు ఆనంద్, జ్యోతిల కుమార్తె హస్మిత(15) ఇమాంపేట గురుకులంలో పదవ తరగతి చదువుతోంది. కాగా, తన తండ్రి మరణించడంతో బతుకుతెరువు కోసం ఆమె తల్లి జ్యోతి హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవిస్తోంది. కాగా, ఇమాంపేట గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కళాశాలలో ఫేర్వెల్ పార్టీ రోజు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దాంతో విద్యార్థులు భయపడకుండా స్కూల్‌కి కొన్ని రోజులు సెలవులు ప్రకటించడంతో హైదరాబాద్‌లోని తన తల్లి దగ్గరికి అస్మిత వచ్చింది. అస్మిత ఇంటికి వచ్చినప్పటి నుంచి పాఠశాలకు వెళ్లాలంటే భయం వేస్తోందని, వెళ్లనని తల్లితో చెబుతూ వస్తోంది. కాగా, శనివారం తల్లి జ్యోతి పనికి వెళ్లిన సమయంలో అస్మిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పని నుంచి తిరిగి వచ్చిన జ్యోతి ఇంట్లోకెళ్లి చూడగా.. అస్మిత విగతజీవిగా పడి ఉండటంతో కన్నీరుమున్నీరయింది. సెలవులు ముగియడంతో పాఠశాలకు వెళ్లాల్సిన అస్మిత.. ఇలా ఆత్మహత్య చేసుకోవడం గురుకుల విద్యార్థులను విషాదంతో ముంచింది. కాగా, శనివారం మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి బుర్కచర్ల గ్రామానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియాస్పత్రికి తరలించారు.

పుస్తక జాతరకు భారీ స్పందన

- నేటితో ముగియనున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్
- 7 లక్షల మంది పుస్తక, సాహితీ ప్రియులు, విద్యార్థుల సందర్శన
- యువతీయువకులతో కళకళలాడుతున్న స్టాల్స్
- నేడు మరో లక్షన్నర మంది సందర్శించే అవకాశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో పుస్తక జాతరకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సాంకేతిక రంగం వేగంగా విస్తరిస్తున్న ఈ సమయంలోనూ.. పుస్తకప్రియులకు కొదవ లేదనేది కండ్లకు కట్టినట్టు కనబడుతున్న సత్యం. ఇంటర్నెట్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి ఇతర సామాజిక మాధ్యమాల్లో కావాల్సిన సమాచారం క్షణాల్లో దొరుకుతున్న ఈ తరుణంలో పుస్తకాల కోసం పుస్తక, సాహితీ ప్రియులు, యువతీయువకులు, విద్యార్థులు, ఇతర అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో బుక్ ఫెయిర్‌ను సందర్శంచడం ఆకట్టుకుంటోంది. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 9న ప్రారంభమైన 36వ జాతీయ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన నేటితో ముగియనుంది. ఈ పదిరోజుల్లో సుమారు 7లక్షల మంది సందర్శకులు బుక్ ఫెయిర్‌కు తరలివచ్చారు. వారిలో 2లక్షలకుపైగా చిన్నారులు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర ప్రముఖులు ఉన్నారు. వీరందరికి ఉచిత ప్రవేశం కల్పించారు. ఇక పదో రోజు ఆదివారం సెలవు దినం కావడంతో పండుగ వాతావరణం కనిపించింది

'యువత' జోరు

బుక్‌ఫెయిర్‌లో ప్రధానంగా విద్యార్థులు, యువకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇక్కడ ఏర్పాటు చేసిన దాదాపు 369 గ్రంథ విక్రయ కేంద్రాలను కలియతిరుగుతూ ఆద్యంతం సేదతీరారు. టెక్నాలజీ యుగంలో ఏదో తెలియని ఒత్తిడికి గురవుతున్న వారు ఇక్కడి రావడంతో మరో కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినంత ఆనందంలో మునిగిపోయారు. చాలా మంది తల్లిదండ్రులు వారి పిల్లలకు కావాల్సిన పుస్తకాలను కొనిచ్చారు. ప్రధానంగా పోటీపరీక్షల పుస్తక స్టాళ్లన్నీ యువతతో రద్దీగా కనపడుతున్నాయి. అలాగే కెరీర్, అకడమిక్, వ్యక్తిత్వవికాస పుస్తకాలతోపాటు ఫిక్షన్, నాన్‌ఫిక్షన్ పుస్తకాల కొనుగోలుకు మక్కువ చూపిస్తున్నారు. వీటితో పాటు ఇతర విక్రయ కేంద్రాల్లోని పలు పుస్తకాలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇందులో నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ స్టాల్‌లో ఉంచిన పుస్తకాల్లో చరిత్ర, అలిశెట్టి ప్రభాకర్, అమ్మ, ఇంగ్లీష్ టీచర్ వంటి పుస్తకాలకు మంచి ఆదరణ లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఇతర పుస్తక ప్రచురణ సంస్థలు విభిన్న అంశాలపై వెలువరించిన పుస్తకాలకు గిరాకీ ఉందని చెబుతున్నారు. అలాగే పుస్తక ప్రదర్శన జరగుతున్న తీరు పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసిన నిర్వాహకులను అభినందించారు.

మౌలిక సదుపాయల కల్పనలో లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేశాం

కె. బాల్ రెడ్డి, ఎం. సూరి బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్, హైదరాబాద్ బుక్ ఫెయిర్



హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఈ ఏడాది మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎప్పటికప్పుడు పకడ్బందీగా చర్యలు తీసుకుంటూ వచ్చాం. గతంలో కంటే ఈసారి 7 మరుగుదొడ్లు, 12 మూత్రశాలలు ఏర్పాటు చేశాం. స్టాల్స్‌కు స్టాల్స్ మధ్యలో గ్యాప్ 30 ఫీట్ల నుంచి 40 ఫీట్లకు పెంచాం. సందర్శకులు అన్ని స్టాల్స్ తిరిగేలా బారికేడ్లు ఏర్పాటు చేశాం. ఎండల తీవ్రత నేపథ్యంలో అందరికి చల్లటి నీరు అందిస్తున్నాం. రోజూ సాయంత్రం స్టాల్స్ నిర్వహకులకు స్నాక్స్ ఇస్తున్నాం. బుక్ ఫెయిర్‌లో మౌలిక సౌకర్యాలు, నిర్వహణకు సంబంధించి షాప్ హోల్డర్స్ దగ్గర నుంచి సందర్శకుల వరకు సంతోషం వ్యక్తం చేశారు. నూతన కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో బుక్ ఫెయిర్ అద్భుతంగా సాగుతోంది.

పారదర్శకంగా ప్రవేశ రసుము టికెట్ల జారీ :

బి.శోభన్ బాబు, జాయింట్ సెక్రటరీ, హైదరాబాద్ బుక్ ఫెయిర్



బుక్ ఫెయిర్ ప్రవేశ టికెట్ల విషయంలో పారదర్శకంగా ఉండేలా ఎలక్ట్రానిక్ మెషిన్స్ ఉపయోగించాం. మూడు కౌంటర్లు ఏర్పాటు చేసి ఎలక్ట్రానిక్ పద్ధతిలో టికెట్లు జారీ చేశాం. క్యూ లైన్‌లో నిల్చుని టికెట్లు తీసుకునే వారికోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. టికెట్ల అమ్మకాలు బాగున్నాయి. పదేండ్ల లోపు పిల్లలకు, స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులకు ఎలాంటి రుసుము తీసుకోకుండా ఉచిత ప్రవేశం కల్పించాం. పెద్దసంఖ్యలో ఉచిత పాస్‌లు పంపిణీ చేశాం.

షెడ్యూల్ ప్రకారమే అన్ని కార్యక్రమాలు :

పి.నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు, హైదరాబాద్ బుక్ ఫెయిర్



హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్‌లో రవ్వా శ్రీహరి వేదిక ఎంతో కీలకం. ఈ వేదికపై 11 రోజుల పాటు ప్రతిరోజూ జరిగే నూతన పుస్తకావిష్కరణలు, సాహిత్య, సంస్కృత, బాల వికాస్ కార్యక్రమాలు, రచయితల చర్చా గోష్టి, ఇతర కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సి ఉంటుంది. అందరితో సమన్వయం చేసుకుంటూ ప్రోగ్రామ్స్ చేయాలి. ఈ వేదికపై ప్రతిరోజూ ఎనిమిది కార్యక్రమాలు జరుగుతున్నాయి. గెస్ట్‌లకు శాలువాలు, మెమొంట్‌లతో బుక్ ఫెయిర్ తరపున సన్మానిస్తాం.

ప్రమాదంలో రిజర్వేషన్లు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రిజర్వేషన్లు ప్రమాదంలో పడ్డాయని, దళిత వర్గాలకు అన్యాయం యూజీసీ మాజీ చైర్మెన్ సుఖదేవ్ థోరాట్ విమర్శించారు. డీవైఎఫ్ఐ అఖిల భారత కమిటీ ఆధ్వర్యంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం పంజాబ్‌లోని చండీగఢ్ లో బాబా సోహన్ సింగ్ భక్న భవన్ లో జరిగిన దళిత యువ జాతీయ సదస్సులో సుఖదేవ్ థోరాట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో దళిత వర్గాలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. రిజర్వేషన్లు ప్రమాదంలో పడ్డాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఇటీవలి యూజీసీ ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ పోస్టులు భర్తీకాకపోతే, వాటిని జనరల్ కేటగిరీలో కలిపివేయాలని నిర్ణయం తీసుకుందని విమర్శించారు. దీనిపై ప్రతిఘటన రావడంతో వెనక్కి తగ్గిందని పేర్కొన్నారు. మోడీ అనుసరిస్తూ మనువాద చర్యలు దళిత వర్గాలకు నష్టం చేస్తాయని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం వంటి విధానాలతో దళిత విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, దీన్ని తిప్పికొట్టాలని పిలుపు ఇచ్చారు. ఉపాధి రంగంలో కూడా దళితులకు ఆశించిన అవకాశాలు లేవని అన్నారు. వీటన్నింటి డీవైఎఫ్ఐ తిప్పికొట్టాలని పిలుపు ఇచ్చారు. డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ ఎ రహీం, హిమెగ్నా రాజ్ భట్టాచార్య, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సహయ కార్యదర్శి విక్రమ్ సింగ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. మోడీ పాలనలో దళిత యువకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిందని, దళిత యువతలో అది మరింత పెరిగిందని అన్నారు. ఇప్పటికి అనేక రూపాల్లో దళితుల పట్ల వివక్షత చూపుతున్నారని అన్నారు. అనేక రాష్ట్రాల్లో భౌతిక దాడులు చేసి హత్యలు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ప్రతి 18 నిమిషాలకు ఒక దాడి జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి వారానికి ఆరుగురు హత్యకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజూ ముగ్గురు దళిత మహిళలు హత్యాచారానికి గురవుతున్నారని అన్నారు. రోజుకు 27 చోట్ల దళితులపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. దళిత యువతకు డీవైఎఫ్ఐ అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి రాష్ట్రంలో టీం ఏర్పాటుచేయాలని, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి చర్చల్లో పాల్గొన్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ దేశంలో మోడీ అధికారంలోకి వచ్చాక, మనువాద గుండాలు పెట్రేగి పోతున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వాన్ని దళిత యువత ఓడించడంతోపాటు దళితుల పట్ల వివక్ష వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేయాలని తీర్మానాన్ని డీవైఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు జాక్ సీ థామస్ పెట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రతినిధులు తిరుపతి,కృష్ణ వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ,ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు రమణ, బాబు, పిచ్చయ్య, పాల్గొన్నారు.

రైతులపై దమనకాండ సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

అన్ని స్వతంత్ర ప్రభుత్వ వ్యవస్థలనూ భ్రష్టు పట్టించారని వివరించారు. దేశంలో పత్రికా వ్యవస్థ అంబానీ గుప్పెట్లోకి వెళ్లి పోయిందన్నారు. పంజాబ్ మొత్తం జీడీపీ కన్నా అంబానీ సంపద ఎక్కువని, హర్యానా జీడీపీ కన్నా అదానీ ఆస్తులే ఎక్కువని వివరించారు. సుప్రీంకోర్టులో చాలాకాలం తరువాత మంచి తీర్పు వచ్చిందంటూ ఎలక్టోరల్ బాండ్ల రద్దు తీర్పును ప్రస్తావించారు. అయితే, తీర్పులో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. ప్రతిపక్షాలకు ఎవరి నుంచీ విరాళాలు అందకుండా కట్టడి చేయడంలో భాగంగానే ఎలక్టోరల్ బాండ్లను మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. గత ఐదేండ్లలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల్లో కేంద్రానికి అనుకూలంగా ఉన్నవే ఎక్కువగా వస్తున్నాయని, దీంతో, వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఏర్పడిందని పేర్కొన్నారు. కరోనా సమయంలో కేంద్రం కోర్టులో అనేక తప్పుడు అఫిడవిట్‌లు దాఖలు చేసిందన్నారు. 2020 మార్చి 31న వలసదారులు ఎవ్వరూ రోడ్లపై నడిచి వెళ్లడంలేదని తప్పుడు సమాచారం ఇచ్చిందని తెలిపారు.

లక్షలాది మంది రోడ్లపై వెళ్తున్నా చాలా తక్కువగా చూపే ప్రయత్నం కేంద్రం చేసిందన్నారు. కరోనా వల్ల 2022 మార్చి నాటికి 5.22 లక్షల మంది మాత్రమే చనిపోయారని ప్రధాని మోడీ ప్రకటించగా, ఇంతకంటే పది రెట్లు ఎక్కువగా మరణాలు సంభవించారని అంతర్జాతీయ జర్నల్స్, డబ్ల్యూహెచ్‌ఓ వెల్లడించాయని గుర్తు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాశీ, సరయూ నదుల్లో వేలాది మంది మృతదేహాలు కొట్టుకొచ్చినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. దైనిక్ భాస్కర్ పత్రిక వాస్తవాలు ప్రచురిస్తే, వెంటనే ఆ పత్రికపై ఈడీ, సీబీఐ, ఇన్‌కంట్యాక్సు దాడులు జరిగాయని తెలిపారు. అనంతరం సుప్రసిద్ధ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు పురస్కారాన్ని పి.సాయినాథ్‌కు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, బీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు జయసుధ, ఎండి అక్బర్‌బాబు, ప్రముఖ గాంధేయవాది అనిల్ నౌరియా తదితరులు పాల్గొన్నారు.

మానవత్వమే ఆయన ఇజం

- ప్రకృతిని అర్థం చేసుకున్న వ్యక్తి : నలుగురికి విజ్ఞానాన్ని అందించేందుకు కృషి
- జేవీవీకి ఆయనో గుండెకాయ
- ఆ వేదిక కాగడా పట్టుకుని పనిచేశారు
- ప్రొఫెసర్ ఆదినారాయణ సంస్మరణ సభలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జనవిజ్ఞాన వేదిక నాయకులు ప్రొఫెసర్ ఆదినారాయణ మానవత్వమే ఇజంగా చివరికంటూ బతికారని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదినారాయణ సంస్మరణ సభను జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) అధ్యక్షులు కోయ వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహిం చారు. సభలో ఆయన కుమారుడు అశోక్, వారి కుటుంబ సభ్యులు, జేవీవీ గౌరవా ధ్యక్షులు డాక్టర్ దాసరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ తిర్మల్‌రావు, వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ జయప్రకాశ్, శాస్త్రవేత్త రాధ, జేవీవీ రాష్ట్ర నాయకులు బీఎస్‌రెడ్డి, వరప్రసాద్, రాజా, జితేంద్ర, హైదరాబాద్ నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రావు, ఎస్వీ లింగస్వామి తదితరులు సభలో పాల్గొన్నారు.

ఆదినారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆశయాలను కొనసాగి స్తామంటూ ప్రతినబూనారు. అనంతరం కోయ వెంకటే శ్వరరావు మాట్లాడుతూ ఆయనో సముద్రంలాంటి వాడైతే..మనం ఒక నీటిబొట్టులాంటోళ్లమేనని ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

అనంతమైన వ్యక్తిత్వం ఆయన సొంత మన్నారు. సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి ఆధునిక ఆలోచనల విస్తరణకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయనకు ఏ ఇజమూ లేదనీ, హ్యూ మనిజమే శ్వాసగా జీవించారని స్మరించుకున్నారు. ప్రకృతిని పూర్తిగా అర్థం చేసుకున్నారన్నారు. జీవ పరిణామాన్ని, రసాయనక చర్యల పర్యవసనాన్ని తెలుసుకోవటమే కాక, శాస్త్రీయత విశిష్టతను విస్తృత పరిచారన్నారు. సమాజంలో సరైన ఆలోచనా విధానాన్ని పెంపొందించే లక్ష్యంతో వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వటంలో ఆయన ముందు వరసలో ఉన్నారని తెలిపారు.

ప్రొఫెసర్ రామచంద్రయ్య మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదికకు ప్రొఫెసర్ ఆదినారాయణ మోడల్ అన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని చెప్పారు. 'మా నాన్న చనిపోయినప్పుడు ఏడ్చానో లేదో తెల్వదు కానీ..ఆదినారాయణ చనిపోయినప్పుడు కన్నీళ్లు తన్నుకొచ్చాయని' గుర్తు చేసుకున్నారు. సైన్సు ద్వారా వాస్తవాలు ప్రజలకు చేరవేసేందుకు ఆయన చేసి కృషి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. జేవీవీ కాగడా పట్టుకుని పనిచేశారని చెప్పారు. ఆదినారాయణ జీవితం వ్యక్తిగతమైంది కాదనీ, సంస్థాగతమైందని వివరించారు.నిమ్స్ మాజీ డైరెక్టర్ దాసరి ప్రసాదరావు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఒక ప్రజా శాస్త్రవేత్తను కోల్పోయిందని చెప్పారు. సైన్సు ఫలాలు అట్టడుగు వర్గాలకు, పేద పిల్లలకు అందాలని జీవితాంతం పనిచేశారన్నారు. ఆయన నిగర్వీ, ఆజాతశత్రువుని కొనియాడారు. శ్రీనాథ్ మాట్లాడుతూ మూడు తరాలకు పైగా క్లిష్టతర మనుకునే రసాయన శాస్త్రాన్ని యూనివర్సిటీలో బోధించిన ప్రొఫెసర్ ఆదినారాయణ లేడనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాన్ని కొనసాగించటమే ఆయనకిచ్చే నివాళి అని చెప్పారు.

డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మంటే

- నిరుద్యోగులకు రెండింతల కష్టాలు : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ఆదివారం బిజెపిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మంటే 'నిరుద్యోగులకు రెండింత కష్టాలు' అని అర్థమని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం తన సోషల్ మీడియాలో హిందీలో ఒక పోస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ప్రతీ మూడో యువకుడు 'నిరుద్యోగం అనే వ్యాధి'తో బాధపడుతున్నారని రాహుల్ తెలిపారు. 'ఉత్తరప్రదేశ్‌లో 1.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్న భర్తీ చేయడం లేదు. దీంతో కనీస విద్యార్హతతో భర్తీ చేసే పోస్టులకు కూడా గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, పిహెచ్‌డి హోల్డర్లు లైన్‌లో నిలబడి ఉన్నారు' అని రాహుల్ తన పోస్టులో తెలిపారు. 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వమంటే నిరుద్యోగులకు రెండింతల కష్టాలు' అని విమర్శించారు. 'రిక్రూట్‌మెంట్ ప్రకటనలకోసం నిరుద్యోగులు వేచి చూడ్డం మొదటది. రెండోది రిక్రూట్‌మెంట్ ప్రకటన వచ్చి పరీక్ష జరిగినా ఆ పేపర్ లీకవుతుంది. దీంతో ఆ పరీక్షల ఫలితాలు విడుదల కావు' అని రాహుల్ వివరించారు. ఒకవేళ ఫలితం వచ్చినా సుదీర్ఘకాలం వేచి వుండాలని. జాయినింగ్‌లపై భరోసా కోసం కోర్టులకు తరుచూ వెళుతూ ఉండాలని రాహుల్ తెలిపారు.

ఆర్మీ నుంచి రైల్వే వరకూ.. ఉపాధ్యాయ పోస్టుల నుంచి పోలీసు రిక్రూట్‌మెంట్లు కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తూ లక్షలాది మంది నిరుద్యోగులు వయోపరిమితి దాటిపోయారని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి నిరాశలతో విద్యార్థులు డిప్రెషన్‌కు గురై కుంగిపోతున్నారని, తమ డిమాండ్లతో వీధుల్లోకి వస్తే పోలీసుల చేత లాఠీ దెబ్బలు ఎదుర్కొంటున్నారని రాహుల్ తెలిపారు. ఒక విద్యార్థికి ఉద్యోగం అంటే కేవలం ఒక ఆదాయ వనరు మాత్రమే కాదని, అతని కుటుంబ జీవితాన్ని మార్చే కలని, ఉత్తరప్రదేశ్‌లో ఈ కలలు చెదిరిపోతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ విధానాలు మాత్రమే యువత కలలకు న్యాయం చేస్తాయని, యువకుల తపస్సును వృథా కానివ్వమని రాహుల్ తన పోస్టులో తెలిపారు.

నాజర్ ఆస్పత్రిలో స్థంభించిన సేవలు



జెరూసలేం : గాజా స్ట్రిప్‌లో రెండో అతిపెద్ద ఆస్పత్రిగా పేరు గాంచిన నాజర్ ఆస్పత్రి లో సేవలు పూర్తిగా స్థంభించాయని అధికారులు వెల్లడించారు. గాజాలోని ఖాన్ యూనిస్ పట్టణంలో ఉన్న ఈ ఆస్పత్రి నెల రోజుల నుంచి ఇజ్రాయిల్ సైన్యం ఆధీనంలోనే ఉంది. ఈ ఆస్పత్రి లో సుమారు 200 రోగుల ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల వెల్లడించింది. ఉగ్రవాదులు ఉన్నారనే అనుమానంతో ఈ ఆస్పత్రిని ఇజ్రాయిల్ సైన్యం స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి కూడా ఇక్కడ వైద్య సేవలు క్షీణిస్తూ వచ్చాయి. తాజాగా ఆస్పత్రి లో సేవలు పూర్తిగా స్థంభించిపోయినట్లు గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది.

కాల్పుల విరమణలో పురోగతి లేదు : ఖతార్ ప్రధాని

గాజాలో కాల్పుల విరమణ అమలు దిశగా ఏ విధమైన పురోగతి లేదని కతార్ ప్రధానమంత్రి షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రహ్మాన్ బిన్ జాసిమ్ అల్ థానీ తెలిపారు. విదేశాంగ మంత్రి కూడా అయిన అల్ థాని శనివారం విలేకరులతో మాట్లాడుతూ గాజాలో కాల్పుల విరమణ అమల్లోకి రావాలని ఖతార్ కోరుకుంటుందని చెప్పారు. కాల్పుల విరమణ అమలులోకి వస్తే గాజాకు చెందిన ప్రజలు తిరిగి తమ ఇండ్లకు వెళ్లడానికి అవకాశం కలుగుతుందని అన్నారు.

రఫా వద్ద బఫర్ జోన్ నిర్మిస్తున్న ఈజిప్టు

గాజా సరిహద్దుల్లో ఉన్న రఫా పట్టణానికి సమీపంలో భారీ సిమెంట్ కంచెను నిర్మిస్తున్నట్లు ఈజిప్టు వెల్లడించింది. ఇది గాజాకు మరింత సహాయాన్ని అందించడానికి ఏర్పాటు చేస్తున్న 'బఫర్ జోన్'గా పేర్కొంది. ఇక్కడ ట్రక్కుల కోసం పార్కింగ్ ప్రాంతాలు, గిడ్డంగులు, అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాలు, డ్రైవర్లకు వసతి కోసం గృహాలు నిర్మిస్తున్నట్లు తెలిపింది. ఇజ్రాయిల్ దాడుల భయంతో వలస వచ్చే పాలస్తీనీయుల కోసం వసతి గృహాలను నిర్మిస్తున్నామని, గాజా సరిహద్దు వెంబడి కంచె నిర్మిస్తున్నామని వస్తున్న వార్తలు పూర్తిగా ఊహాజనితమని ఈజిప్టు మరోసారి స్పష్టం చేసింది. పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించడానికి జరుగుతున్న చర్యలను ఇజ్రాయిల్ వ్యతిరేకించింది. ఇలాంటి 'ఏకపక్ష గుర్తింపు'ను ఖండిస్తున్నామంటూ ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం ఒక ప్రకటన విడుదల చేసింది.

డీహెచ్ రవీందర్ నాయక్ పై తప్పుడు ఆరోపణలు ఆపాలి

- బానోత్ నెహ్రూ చంద్ నాయక్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్‌పై తప్పుడు ఆరోపణలు ఆపాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. ఈ మేరకు ఆదివారం ఆ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ నెహ్రూ చంద్ నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ఆరోపణలు నిరాధారమైనవనీ, బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీనియర్ అయిన రవీందర్ నాయక్‌కు డీహెచ్ పోస్ట్ ఏడేండ్ల క్రితమే రావాల్సి ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ ప్రభుత్వం జూనియర్‌ను నియమించిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీనియర్ అయిన డాక్టర్ బానోత్ రవీందర్ నాయక్‌ను నియమించిందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో డీహెచ్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ గడల శ్రీనివాసరావు సమయంలో వక్రమార్గంలో సంపదకు అలవాటు పడిన కొంత మంది అధికారుల ఆటలకు ప్రస్తుతం అడ్డుకట్ట పడిందని చెప్పారు. దీంతో అలాంటి వారు నీతి, నిజాయితీతో పని చేస్తున్న రవీందర్ నాయక్‌ను అప్రతిష్టపాలు చేసి బదిలీ చేయించే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఆరోపణలను ఇప్పటికైనా ఆపకపోతే ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లతో కలిసి వారి కుట్రలను తేటతెల్లం చెస్తామని హెచ్చరించారు.

క్విడ్‌ప్రోకో నిజమే...!

• కార్పొరేట్ కంపెనీలకు పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు • ఎగవేతదారులకు రుణమాఫీలు
• ప్రతిఫలంగా పాలక పక్షానికి భారీగా ఎన్నికల విరాళాలు • బినామీలు, షెల్ కంపెనీల ద్వారా కూడా...

న్యూఢిల్లీ : 'పగటి వెలుగు ఎంత ప్రకాశవంతంగా ఉంటుందో కంపెనీలు రాజకీయ విరాళాలు ఇవ్వడానికి కారణం కూడా అలాగే ఉంటుంది. క్విడ్‌ప్రోకో ద్వారా సానుకూలత పొందేందుకు కార్పొరేట్ విరాళాలు ఉపయోగపడతాయన్న విషయాన్ని విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ కూడా తోసి పుచ్చలేదు'.... ఎన్నికల బాండ్లపై ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య ఇది. ఎన్నికల బాండ్లు చట్టానికి, రాజ్యాంగానికి విరుద్ధమంటూ అత్యున్నత న్యాయస్థానం సుస్పష్టంగా, నిర్ద్వంద్వంగా ప్రకటించింది. కంపెనీలు అందించే అపరిమిత, రహస్య విరాళాలు క్విడ్‌ప్రోకోకు దారి తీస్తాయని కూడా తెలిపింది. ఈ నేపథ్యంలో...2017లో ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత క్విడ్‌ప్రోకో ఏ విధంగా జరిగిందో పరిశీలించాల్సిన అవసరం ఉంది.



కార్పొరేట్ పన్ను రేట్లను తగ్గించి...

పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ విధింపు తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైపోయింది. ఆ వెంటనే అదను చూసుకొని మోడీ ప్రభుత్వం ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రారంభించింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ విధింపు ఫలితంగా సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమ కుదేలైంది. అదే సమయంలో బడా కార్పొరేట్ సంస్థలు మరింత బలోపేతం అయ్యాయి. చిన్న తరహా పరిశ్రమల రంగాన్ని దెబ్బతీసి అవి తమ మార్కెట్ వాటాను పెంచుకున్నాయి. 2018లో కూడా ఈ ధోరణి కొనసాగింది. 2019 సెప్టెంబరులో ప్రధాని మోడీ కార్పొరేట్ రంగానికి అసాధారణ ప్రయోజనం కలిగించారు. మనుగడలో ఉన్న కంపెనీల బేస్ కార్పొరేట్ పన్ను రేటును 30శాతం నుంచి 22శాతానికి తగ్గించారు. తాజాగా మూలధన పెట్టుబడుల ప్రాజెక్టులు ప్రారంభించిన కొత్త కంపెనీల పన్ను రేటును కూడా 25శాతం నుండి 15శాతానికి తగ్గించారు. కంపెనీలకు రాయితీలు అందించడం ద్వారా ఆర్థిక మంత్రిత్వ శాఖ రూ.1,45,000 కోట్ల ప్రజా ధనాన్ని 'త్యాగం' చేసింది. బడా కంపెనీల నుండి కొత్తగా మూలధనపు పెట్టుబడులు రాకపోవడంతో ఆర్థిక మంత్రిత్వ శాఖ పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందించింది.

లాభాలు మూటకట్టుకున్న కంపెనీలు

స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ అయిన 50-100 బడా కంపెనీల లాభాలు 2019 తర్వాత ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. 2019కి ముందు అనేక సంవత్సరాల పాటు నిఫ్టీలో లిస్ట్ అయిన యాభై కంపెనీల ఉమ్మడి లాభం ఏటా ఐదు శాతం కంటే తక్కువే పెరిగింది. కానీ 2019 తర్వాత వాటి లాభం ఏటా 15% పెరగడం మొదలైంది. నిఫ్టీలో లిస్ట్ అయిన టాప్ పది కంపెనీల లాభం 2022-23 నాటికి మూడు లక్షల కోట్ల రూపాయలు దాటింది. కార్పొరేట్ పన్నుల్లో భారీగా విధించిన కోతల కారణంగానే ఇది సాధ్యపడింది. నిఫ్టీలో లిస్ట్ అయిన 50 కంపెనీలు 2019 తర్వాత స్టాక్ మార్కెట్‌లో కూడా ఓ వెలుగు వెలగడం ప్రారంభించాయి.

రాయితీలకు ప్రతిఫలంగా...

ఆ తర్వాత జరిగిన పరిణామం అత్యంత ఆసక్తిని కలిగించింది. తమకు ప్రభుత్వం అందించిన పన్ను ప్రోత్సాహకాలను ఉపయోగించుకొని భారీ పెట్టుబడులు పెట్టి, ఉద్యోగావకాశాలు కల్పించాల్సిన కార్పొరేట్ ప్రపంచం ఆ పని చేయలేదు. దానికి బదులుగా ఆ కంపెనీలు కార్పొరేట్ పన్ను కోతలతో లాభాలు మూటకట్టుకున్నాయి. కంపెనీల సామర్థ్యాన్ని విస్తరించేందుకు అవి ఎలాంటి పెట్టుబడులు పెట్టలేదు. ఆ తర్వాత నాలుగు సంవత్సరాల్లో కార్పొరేట్ సంస్థలు పన్ను కోతల నుంచి సుమారు ఆరు లక్షల కోట్ల రూపాయల ప్రయోజనం పొందాయి. తమకు పన్ను రాయితీలు కల్పించిన సర్కారుకు ప్రతిఫలం అందించాలి కదా? అందుకోసం ఎన్నికల బాండ్లు ఉపయోగపడ్డాయి. వాటిలో అధిక భాగం పాలక పక్షమే సొంతం చేసుకున్నదన్న విషయాన్ని వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

'కోవిడ్' రాయితీలతో మరింత ఎదిగి...

కోవిడ్ కష్టకాలంలో అటు ప్రభుత్వం, ఇటు ఆర్‌బీఐ రాయితీల వరద పారించాయి. వడ్డీ రేట్లను భారీగా తగ్గించాయి. ఈ చర్య కారణంగా భారీ కంపెనీలు మరోసారి ప్రయోజనం పొందాయి. చౌకగా లభించిన ప్రత్యామ్నాయాలతో రుణభారాన్ని తగ్గించుకొని లాభాలు పెంచుకున్నాయి. ఆ కాలంలో బడా కంపెనీల వాటాల విలువలు పెరిగినప్పటికీ రుణం-ఈక్విటీ నిష్పత్తి బాగా తగ్గింది.

బినామీలు, షెల్ కంపెనీల ద్వారా...

దారుణమైన విషయమేమంటే ఈ కంపెనీలు ఎన్నికల బాండ్లను నేరుగా కొనుగోలు చేయలేదు. బినామీల ద్వారా, షెల్ కంపెనీల ద్వారా కొనుగోలు చేశాయి. వాదనల సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ దీనిపై వ్యాఖ్యానిస్తూ 'నష్టాలు మూటకట్టుకుంటున్న కంపెనీలు ఎన్నికల బాండ్లను కొనుగోలు చేయడం లేదని మనం ఎలా తెలుసుకుంటాం?' అని ప్రశ్నించారు. అనేక షెల్ కంపెనీలను లాభాల కోసం ఏర్పాటు చేయలేదు. మనీ లాండరింగ్ కోసం వాటిని ఉపయోగించుకుంటున్నారు. ఎన్నికల బాండ్లను కొనుగోలు చేయడానికి ఈ కంపెనీలను వాడుకోలేదని ఎలా తెలుస్తుంది? బ్యాంకు రుణాలు ఎగవేసిన అనేక మంది కంపెనీ ప్రమోటర్లు మోడీ పాలనలో రుణమాఫీల ద్వారా రూ.14 లక్షల కోట్ల ప్రయోజనం పొందారు. వారు ఇప్పటికీ సంపన్నులుగానే చలామణి అవుతున్నారు. వీరు బినామీ కంపెనీల ద్వారా ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసి ఉండవచ్చు. ఇది భారీ స్థాయిలో జరగలేదని మనకు ఎలా తెలుస్తుంది?

ఎన్నికల బాండ్ల పథకంపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. వాటన్నింటికీ నేటి వరకూ సమాధానం లభించలేదు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం కార్పొరేట్ దాతల జాబితా విడుదలైన తర్వాత దీనిపై కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉంది

నిబంధనలకు తూట్లు

అపరిమిత విరాళాలు అందించేందుకు అనుమతించడం, అది కూడా దాతల పేర్లను గోప్యంగా ఉంచడం ద్వారా క్విడ్‌ప్రోకో ఆరోపణ నుండి కార్పొరేట్ సంస్థలు తప్పించుకోవడానికి అవకాశం లభించింది. కంపెనీలు తాము ఆర్జించే లాభాల నుండి ఎంత మేరకు రాజకీయ పార్టీలకు విరాళాలు అందించవచ్చుననే విషయంలో గతంలో పరిమితులు ఉండేవి. ఆ విరాళాలను ఆయా కంపెనీలు తమ వార్షిక నివేదికల్లో విధిగా ప్రకటించాల్సి వచ్చేది. అయితే ఎన్నికల బాండ్ల పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఈ పరిమితులు, నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు.

ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ప్రభుత్వ విధానాలు అగ్ర స్థానంలో ఉన్న వంద కంపెనీలకు లబ్ది చేకూర్చాయి. ఆ సమయంలోనే ఆ కంపెనీలు ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసి, పాలక పక్షానికి విరాళంగా అందజేశాయి. ఇది ఓ రకమైన క్విడ్‌ప్రోకోయేనన్నది సుస్పష్టం.



కండీషన్స్ అప్లై

సీట్ల పంపకంపై యూపీలో కాంగ్రెస్‌కు అఖిలేశ్ షరతు

ఒప్పందం తర్వాతే రాహుల్ యాత్రలో పాల్గొననున్న ఎస్పీ చీఫ్

లక్నో : యూపీలో కాంగ్రెస్‌తో కలిసి నడిచే విషయంలో ఎస్పీ 'కండీషన్స్ అప్లై' అంటున్నది. సీట్ల పంపకంపై ఆ పార్టీ అధినేత అఖిలేశ్ షరతులు విధిస్తున్నారు. యూపీలో కాంగ్రెస్‌కు 17 లోక్‌సభ స్థానాలను ఆఫర్ చేసినట్టు ఎస్పీ తెలిపింది. సీట్ల పంపకం ఖరారయ్యే వరకు రాహుల్ గాంధీ నేతృత్వంలోని భారత్ జోడో న్యాయ్ యాత్రలో పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పాల్గొనరని వివరించింది. "మేము కాంగ్రెస్‌కు 17 లోక్‌సభ స్థానాలకు తుది ఆఫర్ ఇచ్చాం. మంగళవారం రాయ్‌బరేలీలో జరిగే న్యాయ్ యాత్రలో అఖిలేశ్ యాదవ్ పాల్గొనటం వారి అంగీకారంపై ఆధారపడి ఉంటుంది" అని ఎస్పీ ముఖ్య అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి తెలిపారు. అయితే కాంగ్రెస్‌కు ఇచ్చే సీట్ల గురించి మాత్రం ఆయన చెప్పడానికి నిరాకరించారు. "ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. వారి నుంచి జాబితాలు వచ్చాయి. మేము వారికి కూడా జాబితాను ఇచ్చాం. సీట్ల పంపిణీ పూర్తయిన క్షణం, ఎస్పీ వారి న్యాయ యాత్రలో చేరుతుంది" అని అన్నారు.

'ఇండియా' కూటమిలో ఎస్పీ, కాంగ్రెస్‌లు భాగస్వాములు. ముఖ్యంగా తన రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ఇప్పటికే చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఇప్పుడు ఈ రెండు పార్టీల మధ్య సీట్ల పంపకాల చర్చలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ఎస్పీ గతంలో కాంగ్రెస్‌కు 11 సీట్లను ఆఫర్ చేసింది. అయితే, కాంగ్రెస్ రాష్ట్ర యూనిట్ మాత్రం ఎక్కువ కేటాయించాలని డిమాండ్ చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క రాయ్‌బరేలీ సీటును మాత్రమే కైవసం చేసుకున్నది. రాహుల్ గాంధీ అమేథీలో స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయారు. ఆ సమయంలో ఎస్పీ అమేథీ, రాయ్‌బరేలీలో పోటీ చేయని విషయం విదితమే

ఈడీ సమన్లను ఆరోసారి దాటవేసిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఎక్సైజ్ పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి ఈడీ సమన్లను మరొకసారి దాటవేశారు. ఈ కేసులో దర్యాప్తు సంస్థ ఇప్పటి వరకు ఆయనకు ఆరు సార్లు ఈ సమన్లను పంపింది. కేజ్రీవాల్‌కు గతంలో జారీ చేసిన నోటీసులను ధిక్కరించినందుకు స్థానిక కోర్టు ఇటీవలే దోషిగా నిర్ధారించిందనీ, ఏడో సారి సమన్లకు హామీ ఇచ్చిందని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి. ఈడీ తనకు పదేపదే సమన్లు పంపే బదులు కోర్టు నిర్ణయం కోసం వేచి ఉండాలని కేజ్రీవాల్ అన్నారు. ఎక్సైజ్ పాలసీతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో తమ సమన్లను ధిక్కరించినందుకు కేంద్ర ఏజెన్సీ దాఖలు చేసిన ఫిర్యాదుకు సంబంధించి ఫిబ్రవరి 17న ఢిల్లీ కోర్టు కేజ్రీవాల్‌కు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. కోర్టు కేసును మార్చి 16కి వాయిదా వేసింది. ఈ కేసులో కేజ్రీవాల్‌కు జారీ చేసిన మొదటి మూడు సమన్లను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించినందుకు ఆయనపై ఐపీసీ సెక్షన్ 174 కింద కోర్టు ముందు ఫిర్యాదు చేసినట్టు ఈడీ వర్గాలు తెలిపాయి.



విద్య, వైద్యం అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- ప్రముఖ సినీ నటుడు సోనూసూద్
- శంషాబాద్‌లో సిద్దురెడ్డి నిర్మించిన స్కూల్ భవనం ప్రారంభం

నవతెలంగాణ-శంషాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని సిద్ధాంతి గ్రామంలో ప్రముఖ వ్యాపారవేత్త కందకట్ల సిద్దురెడ్డి సుమారు రూ.65 లక్షలతో ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని చేవెళ్ల ఎంపీ జి.రంజిత్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్, దాత సిద్దురెడ్డితో కలిసి సోమవారం సోనూసూద్ ప్రారంభించారు. స్థానిక కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో సోనూసూద్ మాట్లాడారు. తాను పుట్టి పెరిగింది పంజాబ్‌లో అన్నారు. నార్త్‌లో హీరోగా.. సౌత్‌లో విలన్‌గా నటిస్తూ అక్కడ, ఇక్కడ ప్రజల అభిమానాన్ని సంపాదించానని తెలిపారు. తను నార్త్ అయినప్పటికీ తన భార్య తెలుగు అమ్మాయి అని చెప్పారు. దీంతో తెలుగుతో తనకు విడదీయరాని బంధం ఏర్పడిందని తెలిపారు. దేశంలోగానీ రాష్ట్రంలోగానీ ప్రభుత్వ విద్య, వైద్య రంగాలనే బలపడితేనే సామాన్య ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. శంషాబాద్‌లో సిద్దురెడ్డి నిర్మించిన పాఠశాల భవనం గురించి హీరో ఇంద్రసేన ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. ఈ విషయంపై సిద్దురెడ్డిని పిలిపించి చర్చించినట్టు తెలిపారు. రాబోవు రోజుల్లో శంషాబాద్‌లో తాను కూడా సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సిద్దురెడ్డి ద్వారా చర్యలు తీసుకుంటానన్నారు. విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రముఖ నటుడు సోనూసూద్ కోవిడ్-19 సమయంలో సహాయ, సహకారాలు అందించి ఎంతోమంది జీవితాలను కాపాడారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో సిద్దురెడ్డి ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'కండ్లకు కూలింగ్ అద్దాలు తీయడు..



- 'ఇంత అహంకారి నిజామాబాద్ ఎంపీగా వద్దు' అంటూ పేపర్ పాంప్లెట్స్
- జగిత్యాలలో ప్రకటన కాగితాలు
- 'నేను అద్దాలు పెట్టుకుంటే మీ తమ్ముడికి ఏం నొప్పి.. అంకుల్' అంటూ ఎంపీ అరవింద్ ఫైర్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'కండ్లకు ఉన్న కూలింగ్ అద్దాలు తీయడు.. కారు దిగి ప్రజలతో మాట్లాడడు.. ఇంత అహంకారి, నియంత.. ధర్మపురి అరవింద్ నిజామాబాద్ ఎంపీగా వద్దు' అని ప్రింట్ చేసి ఉన్న పేపర్ పాంప్లెట్లు జగిత్యాల జిల్లాలో వైరల్ అయ్యాయి. ఇదే సమయంలో 'నేను అద్దాలు పెట్టుకుంటే మీ తమ్ముడికి ఏం నొప్పి అంకుల్' అంటూ సోషల్ మీడియా ద్వారా జీవన్‌రెడ్డిని ఉద్దేశిస్తూ నిజామాబాద్ ఎంపీ అర్వింద్ చేసిన వ్యాఖ్యలూ అదేస్థాయిలో చర్చకు దారి తీశాయి. రానున్న నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నుంచి అర్వింద్, కాంగ్రెస్ నుంచి జీవన్‌రెడ్డి మధ్యనే పోటీ ఉండనున్నట్టు వస్తున్న సంకేతాలతో ఇరుపార్టీల మధ్య పొలిటికల్ వార్ మొదలైంది. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ గత లోక్‌సభ ఎన్నికల్లో వంద రోజుల్లోనే పసుపు బోర్డు తీసుకొస్తానంటూ బాండ్‌పేపర్ రాసిచ్చి మరీ ఫెల్యూర్ అయ్యారనే విమర్శ మొదలు.. మాటల్లో దూకుడు, దుర్భాష కూడా ఆయన పట్ల ప్రజల్లో కొంత చులకన భావం తెచ్చిందంటూ పార్టీ వర్గాల్లోనే చర్చ మొదలైంది. అందులోనూ ఇటీవల జగిత్యాల జిల్లాలోని కోరుట్ల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఈ క్రమంలో ఆయనకు తన సొంత పార్టీ సీనియర్ల నుంచి తిరుగుబాటు ప్రతికూలంగా మారుతోంది. మళ్లీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ బీజేపీ నుంచి ఆయనే పోటీలో ఉంటారనే సంకేతాలు వెలుడుతున్న క్రమంలో ఆయననుద్దేశిస్తూ కొన్ని వ్యాఖ్యలు ప్రింట్ చేసిన పేపర్‌పాంప్లెట్స్ జగిత్యాలలో వెలుగుజూడటం గమనార్హం. 'నియంత ధర్మపురి అర్వింద్ నిజామాబాద్ ఎంపీగా వద్దు' అంటూ ఈ.కృష్ణమాచారి, పి.గంగాధర్, కె.శ్రీనివాస్, బి.రమేష్ పేర్లతో పేపర్‌పాంప్లెట్ సోమవారం ఉదయమే జగిత్యాల జిల్లాలో వెలుగుజూశాయి. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి న్యూస్‌పేపర్లతో కలిపి వాటిని కొందరు పంపిణీ చేశారు. క్షణాల్లోనే ఆ పాంప్లెట్ ఫొటోలు సోషల్ మీడియాలోనూ చక్కర్లు కొట్టాయి.

పాంప్లెట్ ఇష్యూపై ఎంపీ అర్వింద్ ఫైర్

'జీవన్ రెడ్డి అంకుల్ నేను కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుంటే మీ తమ్ముడికి ఏం నొప్పి' అంటూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కామెంట్స్ చేశారు. సోషల్ మీడియా వేదికగా ఓ వీడియో రిలీజ్ చేసిన ఆయన 'మీరు ఎప్పుడు కలిసినా.. మీ ఆశీర్వాదం తీసుకునే వాడిని' అలాంటిది తనలో అహంకారం ఎక్కడ కనబడిందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని ప్రశ్నించారు. ఇవే చివరి ఎన్నికలు అని చెబుతూ 2014 నుంచి వచ్చిన అన్ని ఎన్నికల్లో పోటీ చేస్తూనే ఉన్నారంటూ విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఇద్దరం ప్రత్యర్థుల్లా తలపడినా ఎన్నికల ముందు 'మీ ఆశీర్వాదం తీసుకుంటా' అని చెప్పడం గమనార్హం.

'ఎన్సీపీ-శరద్‌చంద్ర పవార్' ఉపయోగించుకోవచ్చు : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకూ 'నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) - శరద్‌చంద్ర పవార్' పేరును ఉపయోగించుకోవచ్చునని శరద్ పవార్ గ్రూపునకు సుప్రీంకోర్టు సోమవారం తెలిపింది. అజిత్ పవార్ గ్రూపుదే అసలైన ఎన్సీపీ అని ఈ నెల 7న ఎన్నికల కమిషన్ ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ శరద్ పవార్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. శరద్ పవార్ గ్రూపు పిటిషన్‌ను జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ కెవి విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ నెల 26 నుంచి మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయని, తమ గ్రూపునకు ఎలాంటి పేరు, పార్టీ గుర్తింపు లేకుండా ఉంటుందని శరద్ పవార్ తరపు న్యాయవాదులు ధర్మాసనం ముందు తెలిపారు.

ఇవీ మన మూలాలు!

ప్రాణికోటి ప్రస్థానం అంతా కలగాపులగం. అదేమీ అధ్యాయాలకు అధ్యాయాలు ఏదో మెథడలాజికల్‌గా, పద్ధతిగా అల్లుకుపోయిన కథేమీ కాదు. నిజానికి అదొక పేజీలు చిరిగిన పుస్తకం. అన్నీ అతుకుల బొంతలు. తదుపరి పేజీలో క్లూ దొరుకుతుందన్న ఉత్సాహంతో పేజీ తిప్పితే అక్కడ ఆ పేజీనే గల్లంతై ఉంటుంది.

మానవ ప్రస్థానం గురించీ, మరీ ముఖ్యంగా 'మన' మూలాల గురించీ తెలుగులో ఒక సాధికారిక గ్రంథంగా ఇటీవల విడుదలైన 'ఇవీ మన మూలాలు'లో "మన విశ్వాసాలూ, ఇష్టాయిష్టాలూ, రాజకీయ అవసరాలదీ కాకుండా, శాస్త్ర పరిశోధనల్లో జ్ఞానానిది పైచేయి అయినంతవరకూ ఆ పరిశోధన క్రమంలో ఎలాంటి ఫలితాలు వచ్చినా, వాటిని తెరచిన బుద్ధితో ఆహ్వానించడమే మనం చేయగలిగిందీ, చేయవలసిందీ" అంటారు కల్లూరి భాస్కరం.

"ఒక్క మనదేశానికి మాత్రమే పరిమితమై చెప్పుకుంటే, జన్యు పరిశోధనలు భారత్ లోకి ఆర్య ఇండో- యూరోపియన్ జనాల వలసను స్పష్టీకరించిన దరిమిలా, జనం సెంటిమెంటును వాడుకునే రాజకీయానికీ, జ్ఞాన రంగానికీ మధ్య ఒక అసమ యుద్ధం ముమ్మరమైంది. ధర్మ పోరాటంలో తాను ఓడిపోతున్న పరిస్థితుల్లో రాజకీయం తమకు కలిసివచ్చే మేధావులూ, మీడియా సాయంతో అసత్యాలూ, అర్ధసత్యాలూ వక్రీకరణలే ఆయుధాలుగా అధర్మ పోరాటానికి దిగింది. అంతకన్నా కూడా అసలా చర్చ మీదే తెరదించేసి వ్యూహాత్మక మౌనం పాటించడమే మంచిదని కూడా క్రమంగా భావించినట్లు కనిపిస్తోంది"

నిజానికి కల్లూరి భాస్కరం గారి ఈ వాక్యాలే ఈ పుస్తకానికి ఆలంబన. ఇవీ 'మన' మూలాలు అనగానే మనకు తట్టేది ఒక గర్వాతిశయం. మన పూర్వీకుల గురించి గర్వంతో ఉప్పొంగి పోవాలన్న ఆసక్తి! ప్రతీ మానవుడికీ ఇది సహజమేనేమో! మన జననం, మన జనం, మన ఊరు, మన దేశం, మన తాత ముత్తాతలు, మన వంశవక్షం... అబ్బా, ఈ 'మన'లో ఎంత ఆకర్షణ వుంది! ఈ అవ్యాజమైన అనురాగాన్ని ఏ జన్యువు పెంచి పోషించిందో తెలీదు కానీ, మన మూలాల గురించి తెలుసుకోవాలన్న తపన మనని నిరంతరం ఉత్సాహంతో నింపేస్తుంది. ఈ సందర్భంలో అలెక్స్ హేలీ రాసిన "ది రూట్స్' మనని అమితంగా ప్రభావితం చేసిన పుస్తకాల్లో ఒకటి.


ప్రాణికోటి ప్రస్థానం అంతా కలగాపులగం. అదేమీ అధ్యాయాలకు అధ్యాయాలు ఏదో మెథడలాజికల్‌గా, పద్ధతిగా అల్లుకుపోయిన కథేమీ కాదు. నిజానికి అదొక పేజీలు చిరిగిన పుస్తకం. అన్నీ అతుకుల బొంతలు. తదుపరి పేజీలో క్లూ దొరుకుతుందన్న ఉత్సాహంతో పేజీ తిప్పితే అక్కడ ఆ పేజీనే గల్లంతై ఉంటుంది.

తొలి మానవ ఆనవాళ్లు మొదలయ్యాక వాటి వలసలన్నీ అయోమయంగా ఊహకు అందనంతగా, ఎటువంటి ఆధారాల్లేకుండా పోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. మనం భూగోళంగా భావించే ఈ మట్టి (నీటి) ముద్ద ఒకప్పుడెలా ఉందో, ఆ తర్వాత అది పెళ్ళలుగా విడిపోయి ఖండాలుగా అవతరించినప్పుడూ, మంచు యుగాలు కొనసాగినప్పుడూ, జల ఖండాలు విడదీసినప్పుడూ, అగ్ని పర్వతాలు బద్దలైనప్పుడూ ఎలా రూపురేఖలు మార్చుకుందో నిరాధారం. మానవ మనుగడ మొదలయ్యే అనేక దశల్లో ఆ ఖండ భాగాలు చెల్లాచెదురై, గుంపులు గుంపులుగా కలిపి వుంచిన తొలి మానవ ప్రాణుల మధ్య అగాధాలు సృష్టించినా, ఒక చోటు నుంచి ఇంకొక చోటుకు వెళ్లి మరొక గుంపుతో సంపర్కాలు జరిపి, తమ జన్యువుల్లో అన్ని గుంపుల తాలూకూ లక్షణాలను ఎలా మోసుకుంటూ తిరిగారో అంతా అనూహ్యం. అయినప్పటికీ, ఒకచోట స్థిరపడే వరకూ కొనసాగిన ఆ మానవ మహాప్రస్థానాన్ని, గల్లంతయిన పేజీలను జాగ్రత్తగా పేర్చుకుంటూ, సరిచేసుకుంటూ, నిర్మించుకు రావడం చాలా ఆసక్తికరం. ఈ ఆసక్తికర కథనాన్ని ఈ పుస్తకం నిష్పక్షపాతంగా మన ముందుంచే ప్రయత్నం చేసింది.



చాల్స్ డార్విన్, టోనీ జోసెఫ్, డేవిడ్ రైక్, రూథర్ ఫర్డ్, డేవిడ్ అంతోనీ వంటి వారి అద్భుత పరిశోధనా ఫలితాలను ఉటంకిస్తూ సాగిన ఈ రచన బీజాంకుర దశ నుంచి, అంటే ఎక్స్, వై క్రోమోజోముల నుంచి మొదలై, హద్దుల్లేని భూగోళమంతా చుట్టి, ఆర్యావర్తం వరకూ వచ్చి అంతమవుతుంది. స్థల, కాలాల సరిహద్దుల ఊహాజగతి ఒక్కసారిగా విస్తృతమై, దిగంతాలు దాటి వెతుక్కుంటూ వెళ్లి, అన్వేషణ పూర్తయ్యాక మన హృదయాలు కుంచించుకుపోవడానికి బదులు విప్పారుతాయి. కుల, వర్ణ, వర్గ, జాతి స్పృహలు లేని ఒక మహోన్నత సమాజంలో విశ్వ మానవ ప్రాణిగా వికసించాల్సిన అవసరాన్ని ఈ పుస్తకం మన హృదయంలో నాటుతుంది. ఈ పుస్తకం పూర్తయ్యాక, మానవ సమాజం పట్ల ఒక గొప్ప గ్రంథానికి వుండాల్సిన బాధ్యత ఇంతకంటే వేరే ఏదో ఉంటుందనుకోవడం పొరపాటనిపిస్తుంది.

ఈ గ్రంథం మహా వానరాలైన చింపాంజీలూ, బోనోబోలు, ఒరాంగుటాన్లూ, గొరిల్లాలు, హోమోలు (24 జతల క్రోమోజోములు కలిగిన) నుంచి విడిపోయి, 23 జతల క్రోమోజోములు కలిగిన మనిషి తొలిసారిగా కనబడటం మొదలుపెట్టిన 32 లక్షల సంవత్సరాల క్రితం నుంచీ ప్రారంభించి, 19 లక్షల సంవత్సరాల క్రితం ఆఫ్రికా నుంచి వేరే ప్రాంతాలకు విస్తరించడమూ, 7 లక్షల సంవత్సరాల క్రితం వునికిలోకి వచ్చిన హోమో



సేపియన్స్, నియాండర్తల్ అనే రెండు మానవ రకాల పరిశీలనతో ప్రారంభమవుతుంది. నియాండర్తల్ మగ ప్రాణి లక్ష సంవత్సరాల క్రితం ఈ హోమో సేపియన్స్ ఆడప్రాణితో జత గూడడమూ, నియాండర్తల్ రకం అంతరించిపోయినా, ఇప్పటికీ మనలో 'కెరాటిన్' జన్యు అవశేషాన్ని మోసుకు తిరిగడమూ అనే ఒక్క ఉదాహరణతో మన సజాతీయ గుంపుల మధ్య సంపర్కాలు ఖండాలు దాటి ఉన్నాయన్న వాస్తవం గగుర్పాటు కలిగిస్తుంది.

ఇందులో ప్రతిదీ ఒక ఆసక్తికరమైన అంశమే. మన మూలాల్లోని ఒకటి రెండు సందర్భాల్ని ఇక్కడ ఉటంకించడం ద్వారా అవి మిమ్మల్ని ఎంతగా అప్రతిభుల్ని చేస్తాయో చూడొచ్చు.

మానవ చరిత్రలో తొలి మహత్తర విప్లవం వ్యవసాయమనీ, వ్యవసాయం కోసం ప్రాదేశిక భావన బలపడి రాజ్యావతరణకు ఎలా దారి తీసిందో, ఈ ప్రాదేశిక భావన వెనక అసలు నిజం ఆస్తుల స్వంతమూ, వాటిని కాపాడుకోవడం కోసమేననేది సరిహద్దుల గీతలు, కంచెలు, గోడల్లో చూడొచ్చుననే నిజాన్ని బయట పెడుతుంది. ఇలాంటి అద్భుత సూత్రీకరణలు ఈ పుస్తకంలో చాలా ఉన్నాయి. ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డేవిడ్ రైక్, హిట్టైట్ లిపి ఛేదించిన ప్రముఖ పురాతత్వ భాషావేత్త బెడ్రిక్ హ్రోజ్నీ నీ ప్రస్తావిస్తూ, వ్యవసాయ విప్లవం పారిశ్రామిక విప్లవంతో పోల్చదగ్గ మహా విప్లవం ఎందుకైందో చెబుతారు.

నాలుగు భాగాలుగా విస్తరిల్లిన ఈ గ్రంథంలో మొదటి భాగంలో మానవ పూర్వీక జాతులైన నాలుగైదు రకాల మనలాంటి వారి మూలాలను చూపగా, రెండో భాగంలో వాంగ్మయాధారాలూ, యూరప్, భారత్‌లో కనపడే సామ్యాలూ, మూడో భాగంలో ఆఫ్రికన్ తల్లిలో వెతుక్కున్న జనన రహస్యాలూ, జన్యుమూలాలూ, తర్వాత అక్కడి నుంచి మానవ ప్రస్థాన విస్తృతిలో భాగంగా భరతభూమిగా పేర్కొనే మన సరిహద్దుల లోపల మెహర్‌గడ్, హరప్పా, ద్రవిడ సంస్కృతి మేళవింపులూ, సరిహద్దు దేశాలతో బాంధవ్యమూ, ఆర్యావర్తమూ, వేదవాంగ్మయమూ, రామాయణ మహాభారతాల వెనుక ఉన్న చారిత్రక వెలుగు జిలుగులూ, మధ్య యూరప్ నుంచి చైనా వరకూ ఎనిమిది వేల కిలోమీటర్ల దూరం వ్యాపించిన స్టెప్స్ (ఎందుకో మరి కల్లూరి భాస్కరం గారు ఈ పదాన్ని 'స్టెప్పీలు' అన్నారు! నిజానికి వీటిని స్టెప్స్ అనడం సరైంది!) అనబడే గడ్డి భూములనుండి (సరిహద్దుల ఎల్లలు అనే స్పృహ ఇప్పుడు ఏర్పరచుకున్నది!) మొదలు పెట్టి, మహాభారత గాథల్లోని ఇతిహాసపు ఆనవాళ్లనూ, ఆర్యావర్తంలో అతి సాధారణమైన పశుబలుల గురించీ, యజ్ఞ యాగాదుల గురించీ, వైదిక ప్రమాణాల గురించీ చాలా విస్తృతమైన వివరణలు ఇస్తూ 'మన' మూలాల లోపలికి చొచ్చుకు వెళతారు.

ఇందులో ప్రతిదీ ఒక ఆసక్తికరమైన అంశమే. మన మూలాల్లోని ఒకటి రెండు సందర్భాల్ని ఇక్కడ ఉటంకించడం ద్వారా అవి మిమ్మల్ని ఎంతగా అప్రతిభుల్ని చేస్తాయో చూడొచ్చు.

భారతీయుల రూపురేఖల్లో జన్యు మిశ్రమం వల్ల ఎంత వైవిధ్యం కనబడుతుందో చెబుతూ, నలుపు నుంచి చామన చాయ వరకూ, యూరోపియన్ కవళికల నుంచి చైనీయ కవళికల వరకూ ఇక్కడ జనాల్లో కనిపిస్తాయనీ, ఉత్తర భారత పూర్వీకులకు యురేషియా జనాలతో అంటే... యూరప్, మధ్య ఆసియా, పశ్చిమాసియా, కాకసస్ లతో జన్యు సంబంధం ఉందనీ, అదే సమయంలో దక్షిణ భారత పూర్వీకులకు, నేటి భారత ఉపఖండానికి బయట ఉన్న ఏ జనాభాతోనూ జన్యు సంబంధం లేదనీ డేవిడ్‌రైక్ ప్రతిపాదించిన సూత్రీకరణలను ప్రస్తావిస్తారు.

ఈ విషయ విస్తృతి ఒక మహా సముద్రమైతే, ఈ సమీక్ష ఒక నీటి బొట్టు మాత్రమే!

ఈ సమీక్ష ఉద్దేశం బాధ్యతగల ఒక చదువరిగా తన జాతి మూలాలను వెతుక్కునే క్రమంలో సరిహద్దులు లేని ఒక నవీన మానవుడి అవతరణ దిశగా మన ప్రస్థానం కొనసాగుతుందని తెలుసుకోవడమే ప్రధాన విషయం.

తెలుగువారికి ఒక గొప్ప పరిశోధక గ్రంథాన్ని అందించిన కల్లూరి భాస్కరం గారికి యావత్తూ తెలుగు ప్రజానీకం కతజ్ఞతలు తెలుపుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



– వి.విజయకుమార్, 8555802596

సమరం!



నెర్రెలు బారిన నేలకూనకు
చనుబాలిచ్చే చైతన్య మాతలు!
జీవకోటి మనుగడకు
జీవం పోసే నిత్య బాలింతలు!

గలగలా పారే నదీతీర గర్భంలో
పాపాత్ములు పంచుకొనే నల్ల బంగారునిధులు!
పచ్చని చీరను పరుచుకొని
నిరంతర విధులను నిర్వర్తించే పరిసరప్రభలు!

ఆధునికత పేరుతో! అభివృద్ధి ముసుగులో
పంచభూతాల సీమంతపు వసంతాన్ని
యంత్రభూత కోరలతో పరపరా చెరిచి!
అభయారణ్య ఆవాసాల్లో సునామీలనుసృష్టించి
ఆనక!అమాయక ఆదివాసుల గుండెల్లో
గునపాలు దించే హరిత హంతకులు!

కొలిమిలా మండుతున్న
ధరిత్రీ ఊపిరి తిత్తులు
కొంతైనా ఉపశమించేందుకు
కంకణం కట్టుకున్న భూమి పుత్రులు!
సడలని మదితో సమరం సాగించే
అవిశ్రాంత సాధనా శూరులు!!

– కరిపె రాజ్‌కుమార్, 8125144729

చలి కప్పిన సన్మాన దుప్పటి



ఇత్తులు చల్లిన
నేలనా నెత్తురు సల్ల
కారినా చెమట చుక్కలు
రాలిన రక్తపు చుక్కలు

మొక్కలు చెప్పుతాయి
నా మొఖంలో దుఃఖం
ఎంత ఉందని
సెలకనే చెప్పుతాది
నా శ్రమ ఎంతని

ముండ్లను ముద్దాడిన పాదాలు
నెలకు నెత్తురు తిలకం దిద్ది
పచ్చని పతాకని
ఎగుర వేసిన హృదయమని

మట్టే మందై మానిన గాయాలు
ప్రకృతి గాలి ప్రాణం
పోసిన పాదాలు

మేఘమే నాకు మెరుపుల గొడుగు
సెలక్క శరీరానికి చేసిన సత్కారం
వరి గడ్డిని నా వంటికి
చలి కప్పిన సన్మానం దుప్పటి

– దేవరపాగ కృష్ణయ్య, 9963449579

సాహిత్య వార్తలు

మాడభూషి రంగాచార్య స్మారక కథాపురస్కారం

మాడభూషి రంగాచార్య స్మారక కథాపురస్కారం 2023 సంవత్సరానికి ఉమానూతక్కి కథాసంపుటి ' 25వ గంట' ఎంపిక అయ్యింది. ఫిబ్రవరి 25 సాయంత్రం 5-30 గంటలకు కష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం, సుల్తాన్ బజార్, హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో రచయిత్రికి నగదు బహుమతి, జ్ఞాపిక అందజేస్తారు. 'నేటికాలపు మేటి కథకులు పుస్తకావిష్కరణ' ఉంటుంది. శీలా సుభద్రాదేవి, శ్రీధర, కొండవీటి సత్యవతి, లలితాదేవి పాల్గొంటారు.

- శ్రీమతి మాడభూషి లలితాదేవి

కొమ్మవరపు విల్సన్ పుస్తక పరిచయం

కొమ్మవరపు విల్సన్ రావు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే..!' పుస్తక పరిచయ సభ ఈ నెల 25 తేదీ ఉదయం 9:30 గంటలకు శ్రీకాకుళం మీటింగ్ హాల్‌లో జరుగుతుంది. ఇందులో కె.శ్రీనివాసు, అట్టాడ అప్పలనాయుడు, కలిమిశ్రీ, డా॥ కె.జి.వేణు, డా॥ కె.ఉదయ్ కిరణ్, వి.జి.కె. మూర్తి, నెట్టిమి రమణారావు, చింతాడ తిరుమలరావు, దాసరి రామచంద్రరావు, పాయల మురళీకష్ణ, బాల సుధాకర్ మౌళి, కంచరాన భుజంగరావు, సాంబమూర్తి లండ, బాడాన శ్యామలరావు, పూజారి దివాకర్, కె.షణ్ముఖరావు, యస్. భవానీ వర ప్రసాద్ పాల్గొంటారు

- సాహితీ స్రవంతి, శ్రీకాకుళం

తెరవే రాష్ట్ర మహాసభలు

ఈ నెల 25వ తేదీ ఉదయం హైదరాబాద్, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర మహా సభలు నిర్వహించనున్నారు. ఈ సదస్సులో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, కె. శ్రీనివాస్, అందెశ్రీ, నగునూరి శేఖర్, ఆచార్య జయధీర్ తిరుమలరావు, జూకంటి జగన్నాథం, ఆచార్య కాత్యాయనీ విద్మహే, గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, ఉదారి నారాయణ పాల్గొంటారు. తెలంగాణ భాషా సాహిత్య సంస్కృతులకు ఎదురవుతున్న సవాళ్లు - పరిష్కారాలు, తెలంగాణ కవులు రచయితల కర్తవ్యాలు చర్చిస్తారు.

- కొండి మల్లారెడ్డి, బూర్ల వేంకటేశ్వర్లు

కొలకలూరి పురస్కారాలు - 2024

ఈ సంవత్సరం పురస్కారార్థం వచ్చిన సుప్రసిద్ధ సాహిత్య స్రష్టల గ్రంథాలలో పురస్కారాలకు ఎంపికైన మూడింటితోపాటు మరి మూడు గ్రంథాలకు పురస్కారం ప్రకటించగలగటం ఆనందదాయకంగా ఉంది. విజేతలు : 'శ్రీమతి కొలకలూరి భాగీరథీ కథానికా పురస్కారం - 2024' కి గాను 1. 'కామునికంత' (హుమయున్ సంఫీుర్), 2. 'కలుంకూరి గుట్ట' (కె. వి. మేఘనాథరెడ్డి). 'కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం - 2024' కి గాను 1. 'అడవి బతుకులు' (డా॥దిలావర్), 2. 'నిర్మాల్యం' సింహప్రసాద్). 'కొలకలూరి రామయ్య విమర్శన పురస్కారం - 2024' కి గాను 1. 'తాత్త్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామం' (డా॥సుంకిరెడ్డి నారాయణరెడ్డి), 2. 'నవలా హృదయం -3' (వి. రాజారామమోహనరావు). మా అమ్మ జయంతి, వర్ధంతి 26.2.2024. రోజు సాయంకాలం పురస్కార ప్రదాన సభ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (నాంపల్లి, హైదరాబాద్)లో జరుగుతుంది.


- ఆచార్య కొలకలూరి సుమకిరణ్, 9963564664

వైద్యం వేంకటేశ్వరాచార్యులుకి సాహిత్య పురస్కార ప్రదానోత్సవం

22వ సాహిత్య పురస్కార ప్రదానం డా॥ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25 వ తేదీ ఉదయం 10 గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడపలో జరుగుతుంది. వైద్యం వేంకటేశ్వరాచార్యులు ఈ పురస్కారం అందుకుంటారు. ఈ సభలో ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్, ఆచార్య చింతా సుధాకర్, ఆచార్య టి.రామప్రసాద రెడ్డి, బి.రాజశేఖర్, ఎ.రామసుబ్బారెడ్డి, డా॥ కె.గోపీనాథ్, డా॥ వై.నాగేంద్రమ్మ పాల్గొంటారు.

-డా॥భూతపురి గోపాలకష్ణశాస్త్రి, 9966624276


కొత్తల పండుగ



కష్టసుఖాలు కావడి కుండలైన ఊరిలో
ఉగాది ముందు ఒక్క కల్లమైనా ..
ఊరు ఊరంతా కొత్తల పండుగ
సాటగొట్టి బూడ్డి పొత్తిబోసిన
యాసంగి వడ్లకుప్ప మీద గణాలపతి
పెద్ద బతుకమ్మ మీది గుమ్మడి గౌరమ్మ
ఆరున్నొక్క రాగంబట్టి కుండ కొలతబెడుతుంటే..
కష్టాలన్నీ రైతు కంటి చెమ్మలో
కరిగిపోయే ఎన్నరావలు
ఇయ్యడమే గుణమైన ప్రకృతికి
ఇస్వాసంగా ఉండడం కన్నా
తిరిగి ఏమివ్వగలమని దోసిలి నిండా కొత్తొడ్లుబట్టి
మెత్తగా గుండెలకత్తుకుంటుంటే
పంచభూతాలు కల్లొత్తుకుంటాయి
పెద మేతరి తాత సేతుల్ల దివ్యత్వమేముందో..
శివాంట మూడు పిడికిల్ల కొత్త బియ్యం
అడుక్కొచ్చి వండుకుంటే
ఇగ యేడు యేడంతా ఇంట్లె బర్కతే
జాజు సున్నపు పూతలతో
రోల్లు రోకళ్ళు జల్లలు కుందెన్లకు
ఏటికొక్కమారు పెండ్లికళ
పుదిచ్చిన కూరాడు కుండ
ఇంటి లచ్చువమ్మోరు
ఆడకట్టు ముత్తైదువలు ఒక్కతానజేరి
బొట్టు పసుపొంచుకొని
పిడికెడు పిడికెడు వడ్లు రోట్లెబోసి
కుదురుగా కూసబెట్టిన కుందెనలో
కంకణాలు కట్టిన రోకళ్ళతో
సువ్వీ సువ్వన్నలారా సువ్వన్నలారో సువ్వన్నలారా..
సువ్వీ అంటూ మీరంతా
పోటు ఎయ్యంగా.. ఒక పోటు ఎయ్యంగా..
అని పాటతో పాటు పోటు వేస్తుంటే
మట్టి గాజుల గలగల సప్పుడు బతుకు గీతమైతది
ఆకాశమప్పుడు కునికిపాట్లుబడ్తది
అల్కు పిడుసతొ ఇగురంజేసిన
ఒత్తు పొయ్యిమీద.. తెచ్చిన గిద్దెడు బియ్యం
తుకతుక ఉడికితే ఇత్తడి గిన్నెల అత్తెసరన్నం
పుట్టకన్నెలు తెరుస్తది
కూరాడు ముంగటి పచ్చటాకుల
ఆ పచ్చబువ్వే ప్రసాదమైతది
కోడిపుంజులు లేవు కొబ్బరికాయలు లేవు
కూరాడు కుండకు నీళ్లారబోసి
పప్పు పచ్చిపులుసుతో పావురంగ కలిపి
ఇంటాడబిడ్డ మొదట ముద్ద తిని
తలో బుక్కెడు నైవేద్యంబెడితే..
ఏటికేడంతా పుట్టింటి గడపకు
కంకెడు కూడుకు కొదవుండదు
నోటి దాకా ముద్ద రావడానికి
ప్రకృతి చేసిన సాయాన్ని ఆడబిడ్డ అనుమతికి
తంతులా ముడేసిన తాతలు
సచ్చి సర్గానికి బోయింద్రు..
కాలంలో కనుమరుగయ్యేదాకానైనా
భూమ్మీద ఈ పండగుంటే
ఎంత బాగుండో అనిపిస్తది..
కొత్తల పండుగ యాదికొచ్చినప్పుడల్లా..
పానం పాత రోజుల్లకు పరుగులువెడ్తది..

– తుల.శ్రీనివాస్, 9948525853

దేదీప్యమానంగా వెలిగే గజల్ కాగడా



మునవ్వర్ రాణా తన తల్లిని చాలా ప్రేమిస్తాడు. తన కవిత్వంలో తల్లి/ అమ్మ పట్ల తనకున్న ప్రేమను వ్యక్తపరిచాడు. పంపకంలో ఒకరికి భవనం/ మరొకరికి వ్యాపారం/ ఇంట్లో పిన్నవాడినైన నాకు/ దక్కింది అమ్మ, వరం.

దివంగత మునవ్వర్ రాణా ప్రముఖ కవి. ఉర్దూతో పాటు హిందీ, అవధి భాషల్లో గజల్ రాసేవారు. ఉర్దూ సాహిత్యానికి గాను ఆయనకు 2014 సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. మునవ్వర్ రాణా జనవరి 14, 2024న తన 71వ ఏట లక్నో, ఉత్తర ప్రదేశ్‌లో గుండెపోటుతో మరణించారు. వారి మరణం సాహితీ లోకానికి, ముఖ్యంగా ఉర్దూ సాహిత్యానికి తీరని లోటు.

మునవ్వర్ రాణా ఉత్తరప్రదేశ్‌లోని సరియు నదీ తీరాన ఉన్న చరిత్రాత్మక నగరమైన రాయబరేలిలో 1952 నవంబర్ 26న ముస్లిం కుటుంబంలో జన్మించాడు. తండ్రి పేరు సయ్యద్ అన్వర్ అలి తల్లి అయిషా ఖాతూన్.

భారతదేశ విభజన తరువాత, అతని బంధువులు చాలా మంది పాకిస్తాన్‌కు వెళ్లారు. కాని అతని తండ్రి భారతదేశం విడిచి వెళ్లలేదు. దేశ విభజన తర్వాత అతని తండ్రి 'జమీందారీ'ని కోల్పోయాడు. తన జీవనోపాధి కోసం అతని తండ్రి రవాణా వ్యాపారం ప్రారంభించాడు. వారి ఇంటి వాతావరణం మౌల్వీ సంప్రదాయం.

మునవ్వర్ రాణా బాల్యం చాలా వరకు కోల్‌కతాలో గడిచింది. అతను అక్కడి పాఠశాల నుండి విద్యను అభ్యసించాడు. తర్వాత బి.కాం గ్రాడ్యుయేట్ చేశాడు. కోల్‌కతాలో నివసిస్తున్నప్పుడు, మునవ్వర్ రాణా 'నక్సలిజం' వైపు ఆకర్షితుడయి, వాళ్లను కలవడం ప్రారంభించాడు. వారిలో కొందరు మునవ్వర్ రాణాకు స్నేహితులు కూడా అయ్యారు. 'నక్సలైట్స్' తో తన కొడుకుకు సంబంధం గురించి తెలిశాక, అతను మునవ్వర్ రాణాను ఇంటి నుండి బయటకు పంపి, అతనితో కుటుంబ సంబంధాల్ని తెంచేశాడు. రెండేళ్ల ఆవారా జీవితం లాంటిదే గడిపాడు రాణా. అలా గడిపిన కాలంలో మానవ విలువలను, జీవిత పరమార్థాన్ని బాగా అర్థం చేసుకున్నాడు.

మునవ్వర్ రాణా తన తల్లిని చాలా ప్రేమిస్తాడు. తన కవిత్వంలో తల్లి/ అమ్మ పట్ల తనకున్న ప్రేమను వ్యక్తపరిచాడు. పంపకంలో ఒకరికి భవనం/ మరొకరికి వ్యాపారం/ ఇంట్లో పిన్నవాడినైన నాకు/ దక్కింది అమ్మ, వరం.

మరో ద్విపదం (షేర్) లో తల్లి గురించి తన గజల్‌లో అంటాడు... "ఓ చీకటి! చూసుకో నీ మొహం/ మారింది గాఢాంధకారం/ అమ్మ తెరిచిన నయనాలకు/ వెలిగింది ఇల్లు దేదీప్యమానం".

మునవ్వర్ రాణా లక్నో వెళ్ళినప్పుడు, ఆ ప్రాంతం అతన్ని ఎంతగానో ఆకర్షించింది, లక్నో అతనికి ఇష్టమైన నగరంగా మారింది. అక్కడే స్థిర పడ్డాడు. మునవ్వర్ రాణా లక్నోలో ఉన్నప్పుడు ప్రముఖ గజల్ కవి వలీ ఆసిని కలిశాడు. వలీ ఆసి సలహా మేరకు కవిత్వం నేర్చుకోవడం ప్రారంభించాడు. గజల్ నైపుణ్యాన్ని జీర్ణించుకున్నాడు. వలీ ఆసికి కృతజ్ఞుడయ్యాడు. మునవ్వర్ తన గజల్ లను మొదటిసారిగా ఢిల్లీలోని 'ముషాయిరా'లో ఆలాపించాడు. అతను తన కవితలలో సున్నితమైన సమస్యలను చిత్రీకరించడానికి హిందీ, అవధి భాషల పదాలను ఉపయోగించడంలో ప్రసిద్ధి చెందాడు. మునవ్వర్ రాణా కవితల్లో (గజల్) చెప్పుకోదగ్గ విశేషం 'అమ్మ'ని గౌరవించడం.

మునవ్వర్ రాణా ఒక ప్రత్యేకమైన స్వరంతో ఇండియాలో, విదేశాలలోనూ అత్యంత ప్రజాదరణ పొందిన కవులలో ఒకరు. అతని అత్యంత ప్రసిద్ధ కవిత 'మా'. దీనిలో అతను తల్లి సద్గుణాలను కీర్తించడానికి గజల్ శైలిని ఉపయోగించాడు.

మునవ్వర్ రాణ గజల్‌లో గ్రామం, పొలాలు, కూలీలు, నేల, ఉనికి, బీడీలు తయారు చేసే కార్మిక మహిళలు, రైలు డబ్బాలను చీపురు ద్వారా ఊడ్చే స్త్రీలు కేంద్రంగా ఉంటాయి. ఓ ముషాయిరా (కవిత గోష్ఠి) లో అంటాడు: "ఎలా తెంచుకొని వెళ్లాలి నా ఉనికి సంకెళ్లను/ జీవితాంతం ముడిపడినవి, ఎక్కడికెళ్లను/ పృథ్వియే గదా నా తల్లి/ దాన్నొదిలి నేనెక్కడికి వెళ్లను".

ఉర్దూలో ప్రచురించబడిన కొన్ని గజల్ సంకలనాలు: 'బగైర్ నక్షే కా మకాన్, చహరే యాద్ రహతె హై, జంగ్లి ఫూల్, కహో జిల్లే ఇలాహి, మా(తల్లి), సఫేద్ జంగ్లి కబుతర్, ముహజిర్ నామా' మొదలైనవి. రాణా కవిత్వం హిందీ, ఇంగ్లీష్, గురుముఖి, బంగ్లా భాషలలో కూడా అనువదించ బడినాయి.



- మొహ్మద్ అమ్జద్ అలీ, 00 966 507662638

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఖమ్మం
సోమవారం | ఫిబ్రవరి 19, 2024 | www.navatelangana.com



తమ్మినేనికి పరామర్శ

నవతెలంగాణ-ముదిగొండ

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను మండల పరిధిలోని కమలాపురం సిపిఐ(ఎం) గ్రామశాఖ సభ్యులు ఖమ్మంరూరల్ మండలం తెల్దారుపల్లిలో తమ్మినేని నివాసాన్ని సందర్శించి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా తమ్మినేనితో మాట్లాడి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో తమ్మినేని అనారోగ్యానికి గురై హైదరాబాద్ ఏఐజి హాస్పిటల్‌లో చికిత్స పొందిన విషయం విదితమే. తమ్మినేని ప్రస్తుతం తెల్దారుపల్లి తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు టిఎస్ కళ్యాణ్, మరికంటి వెంకన్న, కమలాపురం గ్రామశాఖ కార్యదర్శి కుక్కల కుటుంబరావు, నాయకులు కుక్కల రామచంద్రం, బొజ్జ వెంకట్, బొజ్జ ప్రసాద్, బొజ్జ శ్రీకాంత్, బొజ్జ సుందర్ రావు పాల్గొన్నారు.

రెండు ప్రభుత్వ ఉద్యోగాలు ఒకేసారి

పేదింటి విద్యా కుసుమం శ్రీలక్ష్మి

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మండలం పరిధిలోని జమలాపురం గ్రామానికి చెందిన తల్లపరెడ్డి కోటిరెడ్డి, రామ తులశమ్మల కుమార్తె తల్లపరెడ్డి శ్రీలక్ష్మి జూనియర్ లెక్చరర్ లైబ్రరీన్‌గా, గురుకుల స్కూల్ లైబ్రరీన్‌గా ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పేదింటి విద్యా కుసుమం శ్రీ లక్ష్మీ, హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ ఎంపికైనట్లు తెలిపారు. శ్రీలక్ష్మి ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు ఎర్రుపాలెంలోని సిపిఎస్ స్కూల్‌లో, ఐదో తరగతి నుండి పదవ తరగతి వరకు జడ్పీఎస్ఎస్ స్కూల్లో, ఇంటర్, డిగ్రీ ఎర్రుపాలెం సర్దార్ జమలాపురం కేశవరావు మెమోరియల్ కళాశాలలో, పీజీ సైన్స్ ఉస్మానియా క్యాంపస్ హైదరాబాదులో పూర్తి చేసింది. పీజీ పూర్తి చేసిన శ్రీలక్ష్మి ప్రభుత్వ ఉద్యోగ సాధనకు విశేషంగా కష్ట పడి గురుకులంలో లైబ్రరీయన్, జూనియర్ లెక్చరర్ లైబ్రరీయన్ పోస్టులకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపింది. శ్రీలక్ష్మి తండ్రి కోటిరెడ్డి గత కొన్ని సంవత్సరాలు క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. శ్రీలక్ష్మికి విద్యపై ఉన్న మక్కువకు తల్లి రామతులసమ్మ రోజువారి కూలి పనులు చేస్తూ కూతురుకు చదువులో ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రోత్సహించింది. శ్రీ లక్ష్మీ ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, జమలాపురం, ఎర్రుపాలెం గ్రామస్తులు, సర్దార్ జమలాపురం కేశవరావు కళాశాల సిబ్బంది, మల్లెల లక్ష్మణరావు అభినందించారు.

ఇంట్లో చోరీ...నగదు, బంగారం అపహరణ

నవతెలంగాణ-కామేపల్లి

మండల పరిధిలోని పొన్నెకల్ గ్రామంలోని ఓ ఇంట్లో చోరీ జరిగి మూడు లక్షల 50 వేలు నగదు, మూడు తులాల బంగారం అపహరణకు గురైంది. పొన్నెకల్ గ్రామానికి చెందిన సవిటి మల్లేష్ బంధువుల వివాహ నిమిత్తం 10 రోజుల క్రితం పాలేరు వెళ్లారు. ఇంటి తాళాలను పగలగొట్టి బీరువాలో దాచిన బంగారం, నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఆదివారం ఉదయం మల్లేష్ తల్లి వాకిలి ఊడుస్తుండగా తాళం పగిలి ఉన్న విషయాన్ని గమనించి కుమారుడికి సమాచారం ఇచ్చారు. మల్లేష్ ఇంటికి వచ్చి బీరువాని పరిశీలించగా నగదు, బంగారం అపహరణకు గురైన విషయం తెలియడంతో స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీం బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సత్తుపల్లి డిపో కండక్టర్ లక్ష్మణ్‌సింగ్ నిజాయితీ

నవతెలంగాణ-వైరాటౌన్



ఆదివారం ఉదయం సత్తుపల్లి నుండి బస్సులో ప్రయాణిస్తూ కల్లూరులో దిగిన అనంతరం తన మనీ పర్స్ పోయిందని తెలుసుకున్న పువ్వాళ్ళ రంగారావు వైరాలోని తన మిత్రుడు రిటైర్డ్ టీచర్ చల్లా కృష్ణారావుకు తెలిపారు. నిజాయితీపరుడైన కండక్టర్ లక్ష్మణ్ సింగ్ పర్సులో ఉన్న గుర్తింపు కార్డులోని ఫోన్ నెంబర్ చూసి తానే స్వయంగా రంగారావుకు ఫోన్ చేశారు. అతని సూచన మేరకు వైరా బస్ స్టాండ్‌లో భద్రంగా పోలీసుల సమక్షంలో రంగారావు మిత్రుడు చల్లా కృష్ణారావుకు అప్పగించారు. ఆ పర్సులో చాలా ముఖ్యమైన కార్డులు, నగదు ఉన్నాయి. విధి నిర్వహణలో తన నిజాయితీని చాటుకున్న టిఎస్ ఆర్టీసీ సత్తుపల్లి డిపో బస్ కండక్టర్ లక్ష్మణ్ సింగ్‌ను పలువురు అభినందించారు.



గుత్తాని పరామర్శించిన యుగంధర్

నవతెలంగాణ-వేంసూరు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అనుచరుడు, మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు గుత్తా వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. ఆదివారం లచ్చన్నగూడెంలో ఆయన నివాసం నందు తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ మేడ రమేష్, మామిడిపల్లి వెంకటేశ్వరరావు, రంగారావుతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.



మాజీ సర్పంచ్ గొర్రెముచ్చు శారమ్మకు సన్మానం

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం వల్లాపురం గ్రామ సర్పంచ్ గొర్రెముచ్చు శారమ్మను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. చిన్న గ్రామపంచాయతీ అయినప్పటికీ సర్పంచ్ శారమ్మ వల్లాపురం గ్రామాన్ని అభివృద్ధిలో ఘనంగా నిలిపారు. తన పదవీకాలంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేసి శారమ్మ గ్రామస్తుల మన్ననలు పొందారు. ఆదివారం పదవీ విరమణ చేసిన సర్పంచ్, వార్డు సభ్యులను పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, ఏఎన్ఎం నర్సులు, అగ్రికల్చర్ విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కూసుమంచిలో సంత్ సేవా లాల్ జయంతి వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి పొంగులేటి

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణ వ్యాప్తంగా నియోజక వర్గస్థాయిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న గిరిజనుల వేడుక భోగ్ బండార్ సోమవారం కూసుమంచిలో జరగనుందని, కార్యక్రమంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. కూసుమంచిలోని బంజారా భవన్ ఖాళీ స్థలంలో జరిగే ఈ వేడుకకు పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

10 కిలోలు కోత

పత్తి కొనుగోళ్లలో సీసీఐ దగాపై ఆందోళనలు

- రకరకాల షరతులతో రైతులకు ఇబ్బందులు
- సకాలంలో డబ్బులివ్వకపోవడం.. దళారులకు వరం
- జిన్నింగ్ మిల్లుల యజమానులతో కుమ్మక్కు...ఇష్టానుసారంగా తరుగు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో వరి తర్వాత అధిక విస్తీర్ణం సుమారు 50 లక్షల ఎకరాల్లో సాగు చేసే పత్తి కొనుగోళ్లలో రైతులు నిలువునా మోసపోతున్నారు. కొనుగోళ్లలో భారత పత్తి సంస్థ (సీసీఐ) విధించిన షరతులు దళారులకు వరంలా మారాయి. ఇదే అదనుగా దళారులు జిన్నింగ్ మిల్లుల యజమానులతో కుమ్మక్కై క్వింటాకు 10 కేజీల చొప్పున తరుగు తీస్తుండటంతో రైతులు ఆందోళన బాట పడుతున్నారు. తేమ, నాణ్యత సరిగాలేదనే కారణంగా ఇష్టానుసారంగా కోత విధిస్తున్నారని చెబుతున్నారు. జిన్నింగ్ మిల్లుల వద్ద వేబ్రిడ్జి కాంటాలు కావడంతో కంప్యూటర్ బిల్లులు వస్తాయి కాబట్టి తరుగు తీసేందుకు వీలుగా లోడ్ వాహనంతో పాటు మనిషిని నిలబెట్టి కోత విధిస్తున్నారు. బిల్లులో ఎక్కడా కోత విధించినట్లు కనిపించకుండా జాగ్రత్త పడుతున్నారు. సరుకు భారీ మొత్తంలో వచ్చినప్పుడు కొనుగోళ్లు చేపట్టకుండా జాప్యం చేస్తున్నారు. రైతులు దళారుల వైపు మళ్లేలా పరిస్థితులు కల్పిస్తున్నారు. మరోవైపు సీసీఐ చెల్లింపుల్లోనూ జాప్యమవుతుండటంతో రైతులు దళారులకేసి చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రైతులు అక్కడక్కడ ఆందోళనలు చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తున్నా...దళారుల ప్రమేయాన్ని మాత్రం నియంత్రించలేకపోతున్నారు. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం జిన్నింగ్‌మిల్లుకు భారీగా సరుకు వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా క్వింటాకు పది కేజీల తరుగు తీస్తుండటంతో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. ఆ మరుసటి రోజే సమస్య పరిష్కారం అయినా దళారులు మరోరూపంలో దందా సాగిస్తున్నారు.

చెల్లింపుల్లో జాప్యం...దళారులకు వరం

జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని విక్రయించిన రైతులకు రెండు వారాల వరకు బిల్లులు చెల్లించడం లేదు. సీసీఐ క్వింటాకు రూ.7,020 మద్దతు ధర నిర్ణయించింది. కానీ తేమశాతంలో తేడాలు చూపుతూ క్వింటాకు రూ.7,005 మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. దీన్ని ఆసరా చేసుకుని దళారీలు వెంటనే డబ్బులు చెల్లిస్తామని క్వింటాకు రూ.6వేలు మాత్రమే ధర పెడుతున్నారు. తిరిగి అదే పత్తిని మిల్లర్లతో కుమ్మక్కై క్వింటాకు రూ.7,020 చొప్పున అమ్ముతున్నారు. ఇందులో మిల్లర్లు, దళారుల మధ్య పెద్దమొత్తంలో చేతులు మారుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

రైతులకు సీసీఐ ని'బంధనాలు'...

పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలు సైతం దళారులకు వరంలా మారాయి. ఎకరానికి 12 క్వింటాళ్ల చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేయాలని, అంతకుమించి దిగుబడి వస్తే కొనుగోలు చేయట్లేదు. పంటల సమగ్ర సర్వే ఆధారంగా కొనుగోళ్లు చేస్తున్నారు. ఏ పంట ఎన్ని ఎకరాల్లో సాగు చేశారనే వివరాలు ముందుగానే సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. దాని ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల సీసీఐ క్వింటాకు రూ.100 చొప్పున ధర తగ్గించి రూ.6,920 చొప్పున కొనుగోలు చేస్తుంది. ప్రయివేటు వ్యాపారులు రూ.6వేలకు పైగా ధర పెడుతుండటం...వెంటనే డబ్బులిస్తుండటంతో రైతులు అటువైపు మొగ్గు చూపుతున్నారు. నిల్వలు పేరుకుపోయాయనే కారణంతో తరచూ కొనుగోళ్లు నిలిపివేస్తుండటంతో గత్యంతరం లేక రైతులు ప్రయివేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. సాధారణంగా తేమశాతం ఆధారంగా క్వింటాకు కేజీ చొప్పున తరుగు తీయాల్సి ఉండగా అధిక తేమశాతం పేరుతో విచ్చలవిడిగా తరుగు తీస్తూ సీసీఐ మోసగిస్తుందని రైతులు వాపోతున్నారు.

ఇటు సీసీఐ...అటు దళారుల మోసం

ఇటు సీసీఐ, అటు దళారులు మోసగిస్తుండటంతో గత్యంతరం లేక దళారీలకు అమ్ముకుంటున్నాం. సీసీఐ నిబంధనలు, డబ్బుల చెల్లింపుల్లో జాప్యంతో చేసేది లేక బయట అమ్ముతున్నాం. జిన్నింగ్ మిల్లుల్లోనూ రైతులను మోసం చేస్తున్నారు. కోత పెట్టేందుకు వీలుగా వేబ్రిడ్జిపై మనిషిని నిలబెట్టి తూకం పెడుతున్నారు. క్వింటాకు నాలుగు నుంచి పది కేజీలు తరుగు తీస్తున్నారు.

- సాగర్‌రెడ్డి, రైతు, పల్లిపాడు





పిఎస్ఆర్ టాలెంట్ టెస్ట్ విజయవంతం

నవతెలంగాణ-ఖమ్మం



పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ, కామన్ ఎగ్జామినేషన్ సహకారంతో నిర్వహించిన పదవ తరగతి జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ విజయవంతమైంది. ఆదివారం ఖమ్మం జిల్లాలోని 21 మండలాలకు చెందిన ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆదివారం ఖమ్మంలోని రిక్కాబజార్ ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈనెల 13న నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలకు జిల్లా స్థాయి టెస్ట్ నిర్వహించారు. మధిర మండలం మర్లపాడు జెడ్పిహెచ్ఎస్ విద్యార్థి లక్కిరెడ్డి రాంమోహన్‌రెడ్డి, ప్రథమ స్థానాన్ని సంపాధించాడు. ఆయనకు రూ.10వేల నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందించారు. ద్వితీయ స్థానాన్ని జెడ్పిహెచ్ఎస్ మాధాపురం విద్యార్థి ఉబ్బలపల్లి జశ్వంత్ సాధించగా రూ.6వేల నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందించారు. తృతీయ స్థానాన్ని జెడ్పిహెచ్ఎస్ మహదేవపురం విద్యార్థిని పోరళ్ల నందిని సాధించారు. ఆమెకు రూ.4 వేల నగదు పురస్కారాన్ని, జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందించారు. పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థికి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఖమ్మంరూరల్ మండల విద్యాశాఖాధికారి శ్యాంసన్ మాట్లాడుతూ పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఒక గొప్పకార్యాన్ని పిఎస్ఆర్ ట్రస్టు తలపెట్టి విజయవంతమైందని, ఈ ప్రేరణతో ముున్ముందు అనేక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పిఎస్ఆర్ ట్రస్టు అధ్యక్షులు పరిశ పుల్లయ్య విద్యారంగ అభివృద్ధికి ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసిస్తున్న విద్యార్థుల మేధోశక్తిని వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం పేద విద్యార్థులకు ఆర్థిక దన్నుగా నిలవడం ఎందరికో ఆదర్శమని కొనియాడారు. ఇదే సందర్భంలో ట్రస్టుకు చేయూతనిచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత ప్రశ్నాపత్రాలను ఖమ్మంఅర్బన్ మండల విద్యాశాఖాధికారి ఎం.శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు పరిశ పుల్లయ్య, డిఎస్వో డి.జగదీశ్వర్, పి.ప్రభాకర్ రెడ్డి, రిక్కాబజార్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వి.శాంత, డిసిబి కార్యదర్శి నారాయణ, సభ్యులు పరిగ రాంమోహన్‌రావు, సూర్యదేవర అజిత, టి.సుబ్బారావు, ట్రస్టు సభ్యులు లక్ష్మి రాజ్యం, స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నా భూమిని ఆక్రమించుకున్నారు


బాధిత మహిళ తెగుళ్ల నారాయణమ్మ

నవతెలంగాణ-తల్లాడ



తన భూమి ఆక్రమించుకొని భద్రాద్రి కోల్డ్ స్టోరేజ్ అదనపు గదులు నిర్మిస్తున్నారని అన్నారుగూడెం గ్రామానికి చెందిన తిగుళ్ల నారాయణమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్, అదనపు గదులు తన భూమి సర్వే నెంబర్ 68లో ఉన్నాయని, ఈ విషయాన్ని అనేక సార్లు మండల తాసిల్దార్, ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టించుకోలేదన్నారు. గతంలో తహసిల్దార్ గంట శ్రీలత రికార్డులను పరిశీలించి ఇంక్రూస్మెంట్ నోటీస్ తయారు చేయాలని సిబ్బందికి పురమాయించారని, నేటికీ ఆ భూమిపై ఎటువంటి సర్వే చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ కోల్డ్ స్టోరేజీ ప్రారంభానికి సిద్ధంగా ఉందని, తనకు న్యాయం చేయాలని సదరు బాధిత మహిళ వేడుకున్నారు. ఆ భూమి సర్వే నెంబర్ 66లో సుంకర వెంకయ్య పేరు మీదుగా ఆర్ఎస్ఆర్‌లో బ్యాలెన్స్ ఉండగా అసైన్మెంట్ భూమిని పట్టా భూమిగా చూపెట్టి 66 సర్వే నెంబర్‌లో పట్టా చేయించుకున్నాడని ఆమె తెలిపారు. సదరు భూమిని సర్వే చేసేందుకు వచ్చిన వారిని చావా శ్రీనివాసరావు అడ్డుకున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు పరిశీలించి తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

మిర్చి రైతుల కష్టాలు



నవతెలంగాణ-తల్లాడ

మిర్చి రైతులు ఈ సంవత్సరం అన్ని విధాలా తీవ్రంగా నష్టపోయారు. క్రాప్ ఇన్సూరెన్స్ అందించి ఆదుకోవాలని మిర్చి రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తల్లాడ మండలంలో రైతులు 6819 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. సీజన్ ప్రారంభంలోనే ఆకు ముడత, ఇతర తెగుళ్లు ఆశించి పంట నష్టం చేశాయి. అధిక పెట్టుబడులు పెట్టి ఎలాగోలా కొందరు రైతులు పంటను దక్కించుకున్నారు. కాత దశలో ఉన్న తోటకు తుఫాన్ రూపంలో రెండో దెబ్బ తగిలింది. మిగిలిన పంటను కోయించడానికి ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తెచ్చేందుకు రవాణా ఖర్చులు 40,000 భరించి తీసుకుని వస్తే వారు ఒక రోజు, రెండు రోజులు ఉండి రాత్రికి రాత్రే వేరే ప్రాంతాలకు కళ్ళంలో ఆరబోసిన మిరపకాయలను తీసుకొని వెళ్ళిపోయారు. ఇంటికి వచ్చిన పంటను అమ్ముకుందామంటే దళారులు కాటాల్లో మోసం చేసి రైతులను మోసం చేస్తున్నారు. ప్రకృతి సహకరించకపోవడం మోసాలతో రైతులు పూర్తిగా నష్టపోయారు. కొంతమంది రైతులు చేలను కౌలుకు తీసుకొని అధిక పెట్టుబడులు పెట్టి,పెట్టుబడులు తిరిగి రాక సందిగ్ధంలో పడిపోయారు. బ్యాంకులలో పంట రుణాలు ఇచ్చే సమయంలో క్రాప్ ఇన్సూరెన్స్ కట్ చేసుకుంటున్నారు. కానీ పంట నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ అందడం లేదు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి నష్టపోయిన రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ అందేలా చర్యలు తీసుకోవాలని, తెగుళ్లతో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాల్సిన అవశ్యకత ఉంది. ఇన్సూరెన్స్ రైతులకు అందేలా సంబంధిత జిల్లా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

పేకాట ఆడుతున్న వారిపై ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాయుడుపేట, జలగంనగర్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులు నాయుడుపేట మున్నేరు వంతెన వద్ద శనివారం పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.5,880లు నగదు, 5 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొని పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని ఈశ్వరమాధారం గ్రామ శివారు బ్రిడ్జి వద్ద సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన బిక్షం(49) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నాలుగు బైకులపై హుజూర్‌నగర్ నుండి మేడారం జాతరకు బయదేరిన ఎనిమిది మంది స్నేహితులు ఈశ్వరమాధారం వద్దకు రాగానే ఎనిమిది మందిలో ఒకరైన బిక్షం గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు.



ఈత వల్ల రోగ నిరోధక శక్తి పెంపు

నవతెలంగాణ-వైరాటౌన్

ప్రతి రోజు వ్యాయామంగా ఈత కొట్టడం వలన అధిక బరువు, కండరాల బలహీనత, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ప్రజలు ఈత నేర్చుకోవడానికి వైరా చెరువును ఉపయోగించుకోవాలని వైరా స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఆదివారం నూతనంగా ఈత నేర్చుకున్న ఎస్‌కె పాషా, ఎస్‌కె.అక్బర్‌లు చెరువు వద్ద సన్మానం చేశారు. కార్యక్రమంలో వైరా స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు కోరుకొండ శ్రీను, ఏలూరు రాంబాబు, రాచిబంటి నాగరాజు, కంకణాల అర్జున్‌రావు, నారాయణ, శ్రీరంగం కృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-వైరా



వైరా విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఆదివారం రెండు కార్లు, లారీ ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఖమ్మం వైపు నుంచి వెళ్తున్న కారు తల్లాడ వైపు నుంచి వస్తున్న కారును ఢీ కొట్టింది. అదే వేగంతో ముందు నుంచి వస్తున్న లారీని కూడా ఢీకొట్టిన ప్రమాదంలో సత్తుపల్లి గంగారం స్పెషల్ బెటాలియన్ డీఎస్పీ ఎం.శ్రీనివాసరావుకి మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అంబులెన్స్‌లో వారిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న వైరా ఎస్ఐ వంశీకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. గాయపడ్డ వ్యక్తులను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సంఘటనపై ఎస్సై కేసు నమోదు చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
6
సోమవారం | ఫిబ్రవరి 19, 2024 | www.navatelangana.com

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు


ఖమ్మం : ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో వ్యాసరచన, నినాదం, పోస్టర్ అనే మూడు విభాగాల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. వ్యాసరచన విభాగంలో "నేను రాత్రికి రాత్రే మిల్లియనియర్ గా మారితే, ఆ డబ్బును ఎలా ఉపయోగిస్తాను" అనే అంశంపై 300 పదాలతో ఇంగ్లీష్, తెలుగు, హిందీ భాషల్లో రాయవచ్చని అన్నారు. నినాదం విభాగంలో "పొదుపు, చక్రవడ్డీ శక్తి" అనే అంశంపై, పోస్టర్ విభాగంలో "డిజిటల్, సైబర్ పరిశుభ్రత" అనే అంశంపై చేతితో గానీ, డిజిటల్‌గా గానీ వేయవచ్చని ఆయన తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు అందరూ ఈ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్థి పేరు, ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాల,కళాశాల పేరు, వయస్సు, ఫోన్ నంబర్ తప్పనిసరిగా దరఖాస్తులో పేర్కొనాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో ఈ మూడు పోటీలలో విజేతలు బహుమతి, సర్టిఫికేట్ ప్రదానంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందుతారని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులు ఈ నెల 22 సాయంత్రం 5 గంటల లోగా జిల్లా లీడ్ బ్యాంక్ ఆఫీస్ కి చేరే విధంగా పోస్ట్ లేదా ఈమెయిల్ (leadbankkhammam@yahoo.com) ద్వారా వ్యాసం, నినాదం, పోస్టర్ లను పంపించాలని పేర్కొన్నారు.

అద్భుత పర్యాటక క్షేత్రంగా మెట్ల బావి

- రూ..61.80 లక్షల వ్యయంతో పనులు
- ఆకట్టుకుంటున్న అందమైన కాంతులు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

చరిత్ర కండ్ల ముందు కనిపిస్తే ఆ అనుభూతే వేరు. చరిత్రను తెలుసుకునేందుకు ఖండాలు దాటి.. సముద్రాల్లో మునిగేవాళ్లకు లెక్కేలేదు. అలాంటిది ఖమ్మం నగరంలో రాజుల కాలం నాటి ఓ బావి ఇప్పుడు వెలుగులోకి వచ్చి అద్భుత క్షేత్రంగా దర్శనమిస్తున్నది. ఖమ్మం నియోజకవర్గంలోని స్థానిక 38వ డివిజన్ ఖిలాలోని కొన్ని శతాబ్దాల పాటు సేవలందించి, దశాబ్దాలుగా నిరాదరణకు గురై.. రూపు రేఖలు కోల్పోయిన చారిత్రక మెట్లబావి ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం చొరవతో మళ్లీ జీవం పోసుకున్నది. అంతేకాదు ఇది ఓ గొప్ప పర్యాటక ప్రాంతంగా ఖమ్మం ప్రజలందరికీ మెట్లబావి ఓ అద్భుత లైటింగ్ కాంతులతో రూపుదిద్దుకున్నది.





ఖమ్మం ఖిలా దిగువన మైదానప్రాంతంలో ఉన్న పురాతన బావి. నిజాం పాలకుడైన జాఫర్ ఉద్ దౌలా హయాంలో ఇది నిర్మితమైందని చారిత్రక ఆధారాలున్నాయి. నాడు ఈతకొలనులా ఉపయోగపడిందని, ఆ తర్వాత నగరానికి తాగునీరందించిందని స్థానిక పెద్దలు చెబుతుంటారు..
ఆధునికీకరణ పనులతో మారుతున్న జాఫర్ ఉద్ దౌలా మెట్ల బావి రూపురేఖలు ఎంతో పురాతనమైన ఈ బావిని జాఫర్ బావిగా పేర్కొంటూ ఉంటారు. నిన్నమొన్నటి వరకు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, తుమ్మచెట్లు, మట్టితో పూడుకుపోయి.. కంపుకొట్టిన ఈ మెట్ల బావి తెలంగాణ ప్రభుత్వం వల్ల ఆధునికీకరణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. అసలు ఖమ్మం ఖిల్లా దాదాపు 4 చదరపు కి.మీ విస్తీర్ణంతో 2 కోట గోడలతో పటిష్ఠంగా సుమారు 900 సం. క్రితం నిర్మించబడినదిగా సితాబ్ ఖాన్ (సీతాపతి) ఖమ్మంను తన రెండవ రాజధానిగా పరిపాలించారు. క్రీ.శ. 1516 నందు సితాబ్ ఖాన్ ను ఓడించి, కుతుబ్ షాహిలు రాజ్యాన్ని స్థాపించారు. సితాబ్ ఖాన్ (సీతాపతి) ఖమ్మంను తన రెండవ రాజధానిగా పరిపాలించారు. క్రీ.శ. 1516 నందు సితాబ్ ఖాన్ ను ఓడించి, కుతుబ్ షాహిలు రాజ్యాన్ని స్థాపించారు. క్రీశ. 1716-1903 సం? లో తాలూకాదార్ గా ఉన్న జాఫరుద్దాలా కోట మీద మహల్ ను నిర్మించారు. ఈ కోటకు దక్షిణాన ఖిల్లా పైన ఉన్న వర్షపు నీరు అంతా కూడా ఒక దగ్గరకు వేరు విధంగా ఖిల్లా పైన ఒక గోడను నిర్మించి లోతట్టు ప్రాంతం ఎంచుకుని కాకతీయుల కాలంలో ఒక మెట్ల బావిని త్రవ్వించారు. ఇది వారి ఆలోచనా విధానాన్ని తెలియజేస్తుంది. 60/70 అడుగుల కొలతలతో ఇట్టి బావిని సున్నం మరియు మట్టి రాయితో నిర్మించారని తెలుస్తుంది. తదనంతరం కుతుబ్ షాహీలు, అసఫ్ జాహీల కాలం నందు బావి గోడలు పైన వరకు నిర్మిస్తూ వచ్చారు. ప్రాంతీయంగా ఈ బావిని జాఫర్ బావి అని కూడా పిలుస్తుంటారు. కాల క్రమేణ ఈ బావి ప్రజల నిరాదరణకు గురి అయ్యింది. బావి మొత్తం చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, పనికిరాని వస్తువులతో నింపివేయడం జరిగినది. ఈ బావి ఉన్న దుస్థితిని ఖమ్మం నగర పాలక సంస్థ గమనించి, ఇట్టి వారసత్వ సంపద రాబోయే తరాల వారికి తెలియ పరచాలని, పురావస్తు శాఖ వారితో సంప్రదించి, ఖమ్మం జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ ఆదేశాలతో, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి ఆధ్వర్యంలో రెయిన్ వాటర్ ప్రాజెక్టు, హైద్రాబాద్ వారి సూచనలతో ఇట్టి బావికి పూర్వ వైభవం తీసుకు రావడానికి డివై ఈఈ నవ్య జ్యోతి ఎంతో కృషి చేశారు. 2023, ఏప్రిల్ నందు మొదటగా ఈ బావిలో ఉన్న నీటిని బయటకు పంపుటకు రెండు 7 హెచ్పి మోటార్లు. 23 రోజులు నిరంతరం పనిచేయడం జరిగినది. ఈ బావిలో నీరు అంతా బయటకు పంపిన తరువాత సుమారు 90 రోజుల పాటు ప్రతీ రోజు 24 మంది పని వారు నిరంతరం శ్రమించి బావిలో ఉన్న చెత్తను 60 అడుగుల పొడవు, 70 అడుగుల లోతు, 60 అడుగుల వెడల్పు అనగా సుమారు 2.12 లక్షల కు.మీ చెత్తను తీయడం జరిగినది. ఇందు కోసం ఖమ్మం నగరపాలక సంస్థ సుమారు రూ.62.00లక్షల నిధులు మంజూరు చేయడమైనది. కాంట్రాక్టర్ సంక్రాంతి ప్రసాద్ కు ఈ పనులు అప్పగించడంతో 6930 మంది కార్మికులు చేసిన పని దినాలు 210 రోజులు, కష్టపడి ఎంతో కృషి చేశారు. అసలు ఈ బావి ఒకప్పటి మంచినీటి బావిని, అలా ఉన్న బావిని ఒకప్పుడు వర్షాలు రావడంతో ఖిల్లా పైన నుండి వస్తున్న మురికి నీరు రావడంతోబావి మొత్తం చెత్తచెదారంతో పేరుకుపోయింది. అలాంటి జాఫర్ బావిని స్థానిక కార్పొరేటర్ అలియా షౌకత్ అలీ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్ వెంటనే స్పందించారు. సరికొత్త రూప్ రేకులుగా మారుస్తూ చుట్టూ ప్రహరీ గోడ, జాఫర్ బావికి కలర్ ఫుల్ లైటింగ్ తో తీర్చిదిద్దారు.

విద్యారంగ సంక్షోభ నివారణకు ప్రభుత్వం చొరవ చూపాలి



- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి
- విద్యా, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత
- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- యూటీఎఫ్ డివిజన్ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-సత్తుపల్లి

దశాబ్దాల కాలంగా విద్యారంగం ఎదుర్కొంటున్న సంక్షోభాలకు ప్రభుత్వం తక్షణమే చొరవ చూపాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన యూటీఎఫ్ డివిజన్ కార్యాలయ భవన నిర్మాణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి చావ రవి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రవి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణలో సమస్యలు పరిష్కారమవుతాయనుకుంటే అవి మరింతగా జటిలమయ్యాయన్నారు. 317 జీవో ద్వారా ఉపాధ్యాయ బదిలీలు జరిపి భార్యాభర్తలను దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ లోపాలను సరిచేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఆగిపోయిన స్కూలు అసిస్టెంట్ల బదిలీలు, ఉద్యోగోన్నతులను తిరిగి చేపట్టి ఉపాధ్యాయ వర్గాల్లో ఉన్న అసంతృప్తిని తొలగించాలన్నారు. టెట్ పరీక్షతో సంబంధం లేకుండా కండిషనల్ బేస్డ్‌గా అయినా సరే ఉద్యోగోన్నతులు కల్పించేందుకు ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. సంఘ సత్తుపల్లి మండల అధ్యక్షుడు బాల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ దుర్గాభవాని, రాష్ట్ర కార్యదర్శులు రాజు, మహబూబ్‌ఆలీ, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన బాధ్యులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, కృష్ణ, మాజీ కార్యదర్శులు బండి నరసింహారావు, కల్యాణం నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నిర్మలకుమారి, డివిజన్ ఇన్‌ఛార్జిలు జీఎస్‌ఆర్ రమేశ్, వీవీ రామారావు, వివిధ మండలాల బాధ్యులు కొప్పుల శ్రీనివాసరావు, ఈశ్వరాచారి, చంద్రశేఖర్, వీరాస్వామి, ప్రసాద్, విజయకుమార్, డి ఉమామహేశ్వరరెడ్డి, బి బాలయ్య, చెరుకు శ్రీనివాసరావు, మధు, ఆర్ పద్మావతి, టీఆర్‌ఎస్ రాణి, బీఎంఎస్ భాను, శ్రీదేవి, అనసూర్య సుజాత, సుబ్బలక్ష్మి, సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు, దమ్మపేట, కల్లూరు మండలాల నుంచి సంఘ ప్రధాన బాధ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విద్యా, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత: ఎమ్మెల్యే రాగమయి దయానంద్

విద్యా, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ స్పష్టం చేశారు. యూటీఎఫ్ డివిజన్ కార్యాలయ భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్య, వైద్య రంగాలు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలను సందర్శించి ఆయా పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటుగా ఉపాధ్యాయ సమస్యలను సైతం పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ హామీ ఇచ్చారు. యూటీఎఫ్ సంఘ భవనాన్ని త్వరితగతిన పూర్తిచేసుకొని విద్యారంగం బాగుండేందుకు మంచి ఆలోచనలు చేసే విధంగా దిశా నిర్దేశం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, కమల్‌పాషా పాల్గొన్నారు.



వైభవంగా... శ్రీదుర్గాపార్వతి కాశీ విశ్వేశ్వరాలయ విగ్రహ ప్రతిష్ట

- భక్తుల సందడితో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- మహాన్నదానంలో పాల్గొన్న 20వేల మంది భక్తులు
- ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడులో ఆదివారం శ్రీదుర్గా పార్వతి సహిత కాశీ విశ్వేశ్వరుని ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ప్రతిష్ట కార్యక్రమానికి సత్తుపల్లి, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల సందడితో శివాలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. ఉదయం 10:44ని॥లకు శ్రీ విఘ్నేశ్వర పూజతో మొదలైన ప్రతిష్ట కార్యక్రమం సుబ్రహ్మణ్య, నందీశ్వర, చండీశ్వర, శృంగీశ్వర, భంగీశ్వర, కాలభైరవ, దక్షిణమూర్తి, నాగేంద్రస్వామి, శ్రీమృత్యుంజయలింగ సహిత ఆదిత్యాది నవగ్రహ దేవతా సహిత తదితర పూజాధికాల నడుమ శ్రీదుర్గాపార్వతి కాశీ విశ్వేశ్వరాలయంలో సిద్ధాంతి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో 20మంది రుత్వికుల బృందం మంత్రోచ్చారణల నడుమ విశ్వనాధుని విగ్రహ ప్రతిష్ట కన్నుల విందుగా జరిగింది. ఈ ప్రతిష్ట కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా తుని తపోవనం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిందానంద సరస్వతి స్వామిజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్

గుడిపాడు శివాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. కాశీ విశ్వనాధుని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి అరుణకుమారి, డీసీసీబీ మాజీ ఛైర్మెన్ మువ్వా విజయబాబు ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. నీలకంఠేశ్వరుని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహాన్నదానంలో పాల్గొన్న 20వేల మంది భక్తులు

శ్రీదుర్గాపార్వతి కాశీవిశ్వేశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఏర్పాటు చేసిన మహాన్నదాన కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 20వేల మంది భక్తులు పాల్గొని అన్నమహా ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురష్కరించుకొని పట్టణానికి చెందిన 30 జంటలు (దంపతులు) ఐదు రోజులుగా దీక్షను చేపట్టి ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని దీక్షను విరమించారు. ఈ ప్రతిష్ట కార్యక్రమాలు ఆలయ ప్రతిష్ట నిర్వహణ కమిటీ బాధ్యులు కొల్లి నాగేశ్వరరావు, కొల్లి నరసింహారావు, వెంకటాచారి, చల్లగుండ్ల కృష్ణయ్య పర్యవేక్షణలో విజయవంతంగా జరిగాయి.

మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

తోట రామాంజనేయులు

నవతెలంగాణ-మధిర

నెలల జీతం చెల్లించకుండా కార్మికులను ఇబ్బంది పెట్టే ఔట్సోర్సింగ్ విధానాన్ని మున్సిపాలిటీలో రద్దు చేసి కార్మికులకు నేరుగా మున్సిపాలిటీనే జీతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా నాయకులు బెజవాడ రవిబాబుతో కలిసి ఏఐటియుసి కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు చెరుకూరి వెంకటేశ్వరరావు, మధిర మండల నాయకులు అన్నారపు సత్యనారాయణ, ఏఐటీయూసీలో చేరినా వారిలో చటారి నాగేంద్రం, నరేష్, గోపాలకృష్ణ, సునీల్, కిరణ్, శ్రీకాంత్, మార్తమ్మ, కుమారి, ప్రసాద్, కృష్ణ, శాంతమ్మ శ్రీను, పుల్లయ్య ప్రేమ్‌కుమార్, అను, శాంతమ్మ, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్టీయుసీ జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

ఐఎన్టీయుసీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి 94వ జన్మదిన వేడుకలను ఖమ్మం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తా సీతారాములు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఐఎన్టీయుసీ జాతీయ అధ్యక్షులుగా కొనసాగుతూ అనేక కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించాడని, రాజ్యసభ యంపిగా చట్టసభలో కార్మికుల పక్షాన మాట్లాడరని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పమ్మి వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులు నరాల నరేష్ మోహన్ నాయుడు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ విప్లవ కుమార్ పాల్గొన్నారు.

విజయవంతమైన మెగా హెల్త్ క్యాంప్

- 420 మందికి వైద్య సేవలు

నవతెలంగాణ నేలకొండపల్లి

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్ రావు సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపులో 175 మందికి డాక్టర్ కొల్లి అనుదీప్ (ఎండి జనరల్ మెడిసిన్) సాధారణ వైద్య సేవలు, 34 మందికి డాక్టర్ గుడిపూడి రాజేష్ (ఎమ్మెస్ ఇఎన్టి) చెవి,ముక్కు, గొంతు వైద్య సేవలు, 26 మందికి పేర్ల హర్ష (ఎండి డిఎం) గుండె వైద్య నిపుణులచే గుండెకి సంబంధించిన వైద్య సేవలు, 57 మందికి డాక్టర్ మేదరమెట్ల అనిల్ కుమార్ (ఎంఎస్ ఆర్థో)చే ఎముకలు కీళ్ల వైద్య సేవలు, 33 మందికి డాక్టర్ కొల్లు హర్ష (ఎమ్మెస్ డిఎన్ బి) గ్యాస్ట్రో ఎంటరాలజీ సర్జన్ చే జీర్ణకోశ వ్యాధి వైద్య సేవలు, 98 మందికి డాక్టర్ మచ్చ నేహా (ఎంబిబిఎస్, ఎంఎస్) చే కంటి వైద్య పరీక్షలు అందించారు. మొత్తం 420 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎన్‌జీఆర్ సేవ కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ నెల నెల వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటాలకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలను కూడా విస్తృతంగా చేపట్టాలనే లక్ష్యంతో ప్రతి నెల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డి, కట్టెకోల వెంకటేశ్వర్లు, గ్రామీణ వైద్యులు బండి పుష్పలత, బి నాగేశ్వరరావు, ఎస్.కె మొయినుద్దీన్, తానిషా, కే రఘు, ఈగ అనిల్ కుమార్, వాలంటీర్లు అబ్దుల్, మంకెనపల్లి నరసింహారావు, మైకు బాబు, ఏలూరు కోదండ రామారావు, దండా సైదారావు, వల్లంచట్ల భాస్కరరావు, మల్లికార్జున్



తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్లు, డ్రయిన్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు గుడిపాడులో రూ. 25లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రహదారి, డ్రయిన్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ పట్టణ ప్రజల అవసరం మేరకు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అభివృద్ధి అని గతంలో సత్తుపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధిని ఈ సందర్భంగా రాగమయి దయానంద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, నాయకులు కమల్‌పాషా, గాదె చెన్నరావు, పూచి గోవర్ధన్, కిలారి వెంకటేశ్వరరావు, మానుకోట ప్రసాద్, కొల్లి నరసింహారావు, కౌన్సిలర్ దూదిపాల రాంబాబు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో అనూష రాణింపు

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలో అమ్మపేట రవీంద్రభారతి (ప్రైవేట్ స్కూల్)కు చెందిన పట్ల అనూష ఇండియన్ బ్రిలియంట్స్ ఒలంపియాడ్ (ఐబిఓ) వారు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పెయింటింగ్ ఒలంపియాడ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి పొంది, రాష్ట్ర టాపర్ గా నిలిచింది. ప్రథమ బహుమతి అందుకున్న అనూషను ఆదివారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో శాలువాతో ఘనంగా సన్మానించి, మెమొంటో, సర్టిఫికెట్‌ను అతిథులు అందజేశారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన అనూషను పాఠశాల కరస్పాండెంట్ ఎం.వెంకటరమణ, డైరెక్టర్ ఎం.రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయులు ఎం.నరేష్ కుమార్ ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు చదువుతోపాటు, అన్ని రంగాల్లో రాణిస్తూ భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు సాధించి పాఠశాలకు పేరు తేవాలని వారు ఆకాంక్షించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన సండ్ర

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని లక్ష్మీపురం (రాళ్ల బంజర) గ్రామ బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పలగాని శ్రీరంగం కుమారుడు సాయిబాబు-మమత నూతన దంపతులను సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఆదివారం ఆశీర్వదించారు. వారి వెంట జడ్పీటీసీ కట్ట అజయ్ కుమార్, కల్లూరు మండలం నాయకులు లక్కినేని రఘు, కాటమనేని వెంకటేశ్వరరావు, బోబోలు లక్ష్మణరావు, మేకల కృష్ణ, మహమ్మద్ ఇస్మాయిల్, జయ బాబు, పెదకంటి రామకృష్ణ, పుసులూరి శ్రీను, సిహెచ్ కిరణ్ కుమార్, మోదుగు నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకట్ కిరణ్‌ని అభినందించిన ఎమ్మెల్యే రాగమయి

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్



టీఎస్‌పీఎస్‌సీలో ఖమ్మం జిల్లా ఎస్సీ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించిన వెంకట్ కిరణ్‌ను ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అభినందనలు తెలియజేశారు. మండల పరిధిలోని రేజర్ల గ్రామానికి చెందిన మద్దెల మోహన్ రావు, సునీత దంపతుల కుమారుడు మద్దెల వెంకట్ కిరణ్ టిఎస్‌పిఎస్‌సి ప్రకటించిన టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్ పోస్ట్ ఫలితాలలో జోన్ 4లో ఎస్సీ విభాగంలో మూడవ ర్యాంకు సాధించారు. జిల్లా ఎస్సీ విభాగంలో మొదటి ర్యాంకు సాధించిన వెంకట కిరణ్ ను ఆదివారం రేజర్ల గ్రామంలోని వారి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఘనంగా సన్మానించి అభినందించారు.



కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు

- వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక త్రీ టౌన్ ప్రాంతం గాంధీచౌక్ లోని వర్తక సంఘం భవనంలో సిఎస్‌సి హెల్త్ కేర్ వారి ఆధ్వర్యంలో కార్మికుల కోసం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు మాట్లాడుతూ.. కార్మికుల ఆరోగ్యానికి దృష్టిలో పెట్టుకుని ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు సిఎస్‌సి హెల్త్ కేర్ వారి నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. కార్మికులకు ఈ ఉచిత వైద్య పరీక్షలలో షుగర్, థైరాయిడ్, విటమిన్ డి, ఊపిరితిత్తులు, కిడ్నీ, లివర్, గుండె, బ్లడ్ గ్రూపింగ్, క్యాన్సర్, ఎలర్జీ వీటితోపాటు 54 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించినట్లు డాక్టర్ సాయి కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి డిస్ట్రిక్ట్ సెక్రెటరీ గజ్జి సూర్యనారాయణ, నాగేశ్వరరావు, రాంప్రసాద్, క్యాంపు కోటేటర్ అశోక్ కుమార్, గోపి, తిరుపతి, పద్మ ప్రసన్న, సీమ, తదితరులు పాల్గొన్నారు.

రాయపట్నంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

నవతెలంగాణ-మధిర

మధిర మండలం రాయపట్నం గ్రామంలో శాసనసభ్యులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో రూ.8 లక్షలు మంజూరు కాగా ఆ పనులకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, రాయపట్నం గ్రామ మాజీ సర్పంచ్ బొమ్మకంటి హరిబాబులు
భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు, నిడమానూరు వంశీకృష్ణ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి రవికుమార్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు చిలువేరు బుచ్చి రామయ్య, కోట డేవిడ్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు బిట్రా వద్దండయ్య, పగిడిపల్లి డేవిడ్, మారేడు పుల్లారావు పాల్గొన్నారు.

ఖమ్మంలో సేవాలాల్ 285వ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలోని 5వ డివిజన్ యుపీఎస్ కాలనీ ఖానాపురం హవేలిలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజు 285వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ గొప్ప సంఘ సంస్కర్త అని, గిరిజనుల వలస జీవితం నుండి స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడంలో, తండాలు నిర్మించడంలో, వ్యవసాయం చేయటంలో ప్రముఖ పాత్ర పోషించాడని అన్నారు. ప్రజలందరూ ఎప్పుడు ఐక్యమత్యంతో సోదర భావంతో మెలగాలని ఆశించిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగో డివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి, రాధాకృష్ణ, ఉమారాణి, మణికంఠ నాయక్, సూర్య నాయక్, ఎం.వీరన్న, బి.కొండల్, మల్సూర్, పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | ఫిబ్రవరి 19, 2024 | www.navatelangana.com

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

నవతెలంగాణ-దమ్మపేట



గురుకుల విద్యార్థులు జాతీయ స్థాయిలో అథ్లెట్లు పతకాలు గెలుపొందాలని ట్రైబెల్ వెల్ఫేర్ గురుకుల కళాశా ప్రిన్సిపాల్ శ్రీజానూ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ట్రైబెల్ వేల్ఫర్‌లో జరగుతున్న జిల్లా అథ్లెటిక్స్ చంపియన్షిప్‌ను ప్రిన్సిపాల్ ఒలింపిక్ జండా ఊపి పరుగుపందెంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ జిల్లా నలుమూలల క్రీడాకారులు రావటాన్ని ముందుగా అభినందించారు. రానున్న రాష్ట్ర, జాతియ స్థాయి పోటీలలో పతకాలు గెలుపొంది బద్రాద్రి జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలపాలని తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి కె మహిధర్ మాట్లడుతూ జిల్లా నలుమూలల నుండి దాదాపు 60 మంది పాల్గొన్నారని వీరిలో ప్రతిభ చుపినవారిని ఈ నెల 25వ తేదీ హైదరాబాద్ లో జరగనున్న రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు పంపుతామని తెలిపారు. అథ్లెటిక్ కోచ్ జె. కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు కళాశాల పిడి వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ బాలాజి, శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

నవతెలంగాణ-పాల్వంచ

19వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాలులో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, సమస్యలపై ఫిర్యాదులు అందచేయు ప్రజలు ఉదయం 9.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమానికి విచ్చేసి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా దరఖాస్తులు అందచేయాలని కలెక్టర్ సూచించారు.

మంత్రులకు స్వాగతం పలికిన టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు

నవతెలంగాణ-జూలూరుపాడు



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక హెలికాప్టర్లో భద్రాచలంలోని ఐటిడిఏ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చారు. టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు వారికి హెలిపాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందించి స్వాగతం ఎ

శ్రీనిహాన్ ఇంటర్నెట్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-చంద్రుగొండ



చంద్రుగొండలో శ్రీనిహాన్ ఇంటర్నెట్ డిజిటల్ సెంటర్‌ని స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పతల ఏడుకొండలు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర సెక్రెటరీ కోదుమూరి దయాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు బడుగు కృష్ణవేణి, ఉపతల శీను, ఉపతల రమణ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం రోడ్డు-కొవ్వూరు రైల్వే లైన్ మంజూరైనందుకు హర్షం

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాచలం రోడ్డు-కొవ్వూరు రైల్వే లైన్ మంజూరైనందుకు, పనులు మొదలు పెడుతున్నందుకు ప్రధానమంత్రి మోడీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ధన్యవాదాలు తెలుపు తున్నట్లు భద్రాచలం రోడ్డు-కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ అధ్యక్షుడు కొదమ సింహం పాండురంగాచార్యులు తెలిపారు. ఆదివారం అఖిలపక్షం, సాధన కమిటీ సభ్యులు హాజరై కొవ్వూరు రైల్వే లైన్ కమిటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏప్రిల్ ఒకటి నాడు శంకుస్థాపన జరగనున్న ఈ రైల్వే లైను కోసం 1984 సంవత్సరం నుండి భద్రాచలం రోడ్డు నుండి రైలు వెయ్యాలని తద్వారా గిరిజన ప్రాంతం డెవలప్ అవుతుంది అని ప్రస్తుతం వైజాగ్ నుండి హైదరాబాద్‌కు వందలాది కిలోమీటర్లు నిడివి ఉండగా ఆ దూరం 150 కిలోమీటర్ల తగ్గుతుందని, ఈ లైన్ వల్ల కేవలం 650 కిలోమీటర్లు వీలవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలు ఎంతో సహకారాలు అందించాలని 44 సంవత్సరాల ప్రయత్నం అనంతరం నేడు ఈ తీపి కబురు అందించినందుకు ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలరాజు సత్యనారాయణ, చలిగంటి శ్రీనివాస్, బానోత్ ధర్మ, గోపాలరావు, భయ్యాని ఈశ్వరయ్య, హనుమంతరావు, పవన్ కళ్యాణ్, కల్లూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నుండి గార్లపాటి పవన్ కుమార్ రిలీవ్

నవతెలంగాణ-జూలూరుపాడు



భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విద్యార్థి సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు గార్లపాటి పవన్ కుమార్ తన పై చదువుల కోసం రిలీవ్ అయినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1970లో ఏర్పడ్డ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ సంఘంలో అధ్యయనం పోరాటం అనే నినాదం కి ఆకర్షులై 2019 లో సంఘంలో చేరి మండల కమిటీ సభ్యులు నుండి జిల్లా అధ్యక్షులు గా ,రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పని చేశానని తెలిపారు. ఈ ఉద్యమ సమయంలో సహకరించిన ప్రతి ఒక్క ఉద్యమ సహచర్లకు, విద్యార్థి సంఘ నాయకులకు, విలేకరులకు, ఉపాధ్యాయులకు, అధికారులకు, రాజకీయ నాయకుల వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థి దశలో ఎన్నో పోరాటాలకు ప్రాతినిథ్యం వహిస్తూ విద్యార్థుల పక్షాన సమస్యలు పరిష్కారాల కోసం చిన్న వయసు నుండి అవగాహన కల్పించే దానికోసం భారత విద్యార్థి కంటే ఎస్ఎఫ్ఐ మంచి అవగాహన నేర్పిందని పేర్కొన్నారు. సమాజ సేవ చేసే దానికోసం విద్యార్థుల హక్కుల కోసం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రస్తుతం చదువుతున్నటువంటి విద్యార్థులందరూ కూడా విద్యార్థి ఉద్యమంలో పాల్గొనాలని తెలిపారు.

ఫజల్ భక్షికి సత్కారం

నవతెలంగాణ-చంద్రుగొండ



మండల కేంద్రంలో అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బెండాల్ పాడు గ్రామానికి చెందిన ఫజల్ భక్షిని ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజేష్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మరెన్నో సేవలు అందిస్తూ భవిష్యత్‌లో ఉన్నత అనేక పదవులు అందుకోవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పిఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కేశవ్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు కేసుబోయిన నరసింహరావుయాదవ్, చంద్రుగొండ మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు బొర్రా సురేష్, బిసి మండల అధ్యక్షులు రామకృష్ణ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



మానసిక శారీరక రుగ్మతులకు యోగాతో పరిష్కారం లభిస్తుందని యోగాతోనే మానవ జీవితం సంపూర్ణ ఆరోగ్యంతో కొనసాగుతుందని ది హార్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు రఫీ నాగేంద్రలు స్పష్టం చేశారు. ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ భద్రాచలం సెంటర్ వారి ఆధ్వర్యంలో ఈనెల 13 నుండి 18 వరకు స్థానిక చర్ల రోడ్డులో గల చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో జరిగిన హ్యాపీనెస్ ప్రోగ్రామ్‌లో పలువురు ఆరోగ్య అభిలాశులు పాల్గొని, వివిధ రకాల యోగా ఆసనము లతో పాటు శ్వాస క్రియ వ్యాయామలు మరియు అతి శక్తివంతమైన సుదర్శన క్రియా అనే ప్రక్రియపై ప్రత్యేక సాధన చేశారు. స్థానిక ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ రఫి, వాలంటరీ నాగేందర్, నేతృత్వంలో సీనియర్ టీచర్ పి. శ్రీనివాస జ్ఞానము గురించి కుల కుశంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభావతి, సోంపాక సీత, మునాఫ్, తదితరులు పాల్గొన్నారు.

నెగ్గేనా...? వీగేనా...!

- మున్సిపల్ చైర్పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం
- చైర్‌పర్సన్ సీటు కోసమే పార్టీ మారారా..!
- కాసుల కౌన్సిలర్స్ ఎటు మొగ్గు చూపనున్నారో...
- ఉత్కంఠగా మారిన గూడెం చైర్మెన్ అవిశ్వాస పంచాయతీ

నవతెలంగాణ-కొత్తగూడెం

కాసులకు కక్కుర్తి పడి, విలువలు మరిచిన రాజకీయాలు దిగజారిన పరిస్థితులు పెరిగాయి. ఇటీవల ఇల్లందు మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మాణ హైడ్రామా ముగిసింది....సోమవారం కొత్తగూడెం మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మాణంకు సన్నద్ధమయ్యారు. కొంత మంది కౌన్సిలర్స్ కేవలం మరో 10 నెలల కాల పరిమితి ఉన్నప్పటికీ అవిశ్వాసానికి పూనుకున్నారు...సపోర్టు చేసినందుకు లక్షల్లో సొమ్ము కౌన్సిలర్స్‌కి ముట్టచెప్పారు....ఎవరు ఎవరిని నెగ్గిస్తారో....సోమవారం జరిగిగే అవిశ్వాస తీర్మాణంలో ఏమి జరుగనుందోనని ఉత్కంఠగా మారింది....



ఒకే పార్టీలో ఉన్నారు. అదే పార్టీలో ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతా లక్ష్మీపై అవిశ్వాస తీర్మాణం పెట్టారు. ఆమె పనితీరు, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపిస్తు కలెక్టర్‌కు ఫిర్యాదుచేసి, అవిశ్వాసానికి ఎత్తుగడ వేశారు. గత పది రోజులుగా మున్సిపల్ చైర్పర్సన్‌పై ఏర్పాటు చేసిన అవిశ్వాస తీర్మానంపై గందరగోళ పరిస్థితులు కనిపిస్తున్నాయి. సమయం దగ్గర పడుతున్న తరుణంలో చైర్మెన్ సీతాలక్ష్మీ వర్గం, ప్రత్యర్థి భీమా శ్రీవల్లి వర్గాలకు సపోర్టుచేసే వారు వేరువేరుగా క్యాపుల్లో చేరారు. కొంత మంది కౌన్సిల్స్ గోవాలో తిష్ట వేయగా, మరో వర్గానికి చెందిన వారు హైద్రాబాద్ స్టార్ హెూటల్‌లో ఉన్నట్లు తెలుస్తుంది.

కొత్తగూడెం మున్సిపాలిటిలో 36 మంది కౌన్సిలర్స్ ఉన్నారు. చైర్పర్సన్‌గా ఎన్నికైన కాపు సీతాలక్ష్మి గత నాలుగేళ్ళుగా కౌన్సిలర్ల సూచనలను భేఖాతార్ చేస్తూ అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఇటీవల జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాకు చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానానికి 22 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన లేఖను అందించారు. దీనిపై సమగ్రంగా విచారణ అనంతర జిల్లా కలెక్టర్ ఈనెల 19వ తేదీ సోమవారం మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కౌన్సిల్‌లోని 36 మంది కౌన్సిలర్స్‌లో ప్రస్తుత చైర్మెన్‌కు అనుకూలంగా 16 మంది ఉన్నట్లు, అవిశ్వాసం పెట్టాలన్న వారికి 17 మంది ఉన్నట్లు, మిగిలిన వారు తటస్తంగా ఉన్నట్లు సమాచారం. సోమవరం జరిగే ప్రత్యేక సమావేశానికి సుమారు 25 మంది కౌన్సిలర్స్ హాజరుకావాల్సి ఉంది. అప్పుడే ప్రత్యేక సమావేశం జరుగుతుంది. కోరం పూర్తి కాని పక్షంలో సమావేశం జరిపే అవకాశం లేకుండా పోతుంది. ఇటీవల ఇల్లందు మున్సిపల్ చైర్మెన్ విషయంలో ఇదే హైడ్రామా జరిగిన సంగతి పాఠకులకు తెలిసిందే...తాజాగా కొంత మంది మున్సిపల్ మహిళా కౌన్సిలర్స్ భర్తలు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇదంతా చైర్మెన్ సీటు కోసమే అన్నట్లు ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు చర్చింటు కుంటున్నారు. చైర్మెన్ సీటు దక్కని పక్షంలో తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరే అవకాశం కూడా ఉందని కూడా ప్రచారం సాగుతుంది.



చైర్పర్సన్ పదవికి పోటీ పడుతున్న భీమా శ్రీవల్లి భర్త భీమ శ్రీధర్ తన సతీమణిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటే లక్షల్లో డబ్బులు కౌన్సిలర్స్‌కి ఆశ చూపుతున్నట్లు ప్రచారం ఉంది. ఈ సమావేశం రోజున గైర్హజరైన సదరు కౌన్సిలర్లకు కూడా డబ్బు ఇస్తామంటూ సీతాలక్ష్మి వర్గీయులు ఎర వేసినట్లు ప్రచారం ఉంది. గత పరిచయాల నేపద్యంలో కొత్తగూడెం మున్సిపల్‌చైర్ పర్సన్‌కు రాష్ట్ర మంత్రికి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మధ్య మంచి సత్‌సంబంధాలున్నాయి. ప్రస్తుతం చైర్మెన్ పదవి కోసం పోటీ పడుతున్న భీమా శ్రీవల్లి భర్త భీమా శ్రీధర్‌కు గతంలో పొంగులేటితో మంచి సంబంధాలు ఉన్నటపికీ అవి బెడిసి కొట్టాయి. వారి మధ్య సుహృద్‌భావ వాతావరణం లేకుండా పోయింది. ఇన్ని రాజకీయ పరిణామాల నేపద్యంలో సోమవారం జరిగే మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యే అత్యవసర సమావేశంలో అవిశ్వాస తీర్మానం నెగ్గేనా....? వీగేనా....? వేచి చూడాల్సిందే.

సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యం

నవతెలంగాణ-టేకులపల్లి

సింగరేణి సంస్థ పరిరక్షణ, మనుగడ, కార్మికుల సంక్షేమమే లక్ష్యంతో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పని చేస్తుందని ఎండీ.నజీర్ అహ్మద్ స్పష్టం చేసినట్లు తెలిపారు. ఆదివారం కోయగూడెం ఓసిలొ జరిగిన పిట్ సమావేశంలో అయన మాట్లాడారు. కార్మికుల పక్షాన ఉండి, కార్మికులు, సంస్థ కోసం పోరాడే సంఘం ఏఐటీయూసీ మాత్రమేనని కార్మికులు గుర్తించారని అన్నారు. ప్రస్తుత, గత సర్కారు సంఘాలను బుద్ధి చెప్పి సింగరేణి, కార్మికుల మనుగడను కాపాడే సంఘానికి కార్మికులు పట్టం కట్టారని, వారి నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తామని అన్నారు. నూతన భూగర్భ గనులు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తామని, కార్మిక హక్కులను కాపాడుతామని అన్నారు. ఎన్నికల సమయంలో కార్మికుల ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయిస్తామన్నారు. బొగ్గు బావులను వేలం వేయించే విధానానికి స్వస్తి పలికే విధంగా పాలకులపై వత్తిడి తెస్తామని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తమ గుర్తింపు సంఘానికి సహకారాన్ని అందించాలని కోరారు. ఏఐటీయూసీని గుర్తింపు సంఘంగా గెలిపించిన కార్మికవర్గానికి అయన కృతజ్ఞతలు తెలిపారు.



తొలుత గుర్తింపు సంఘం విజయ పతాకాన్ని సీనియర్ ఎలక్ట్రీషియన్ కె. శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహయ కార్యదర్శి కొంగర వేంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోత్ కృష్ణ, వర్క్ మ్యాన్ ఇన్స్‌పెక్టర్ గడ్డం అనంత శ్రీనివాస్, కాలే పుల్లయ్య షిఫ్ట్ ఇంచార్జ్‌లు మహ్మద్, షబ్బీర్, సామల శ్రీనివాస్, రామకృష్ణ చారి, వేంగళ రవి,ఎస్ ఐలయ్య,కనకరాజు, ఇబ్రహీం, పెరుగు భాస్కర్, మైఖేల్, పవన్ కుమార్,శ్రీరాములు, నవీన్ కుమార్, రంజిత్ కుమార్, రాజ్ కుమార్, రవికుమార్ ,మహ్మద్ సలీం,బొటిక శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కార్మికుల ఆకలి బాధను తీర్చండి

- 18 నెలల వేతన బకాయిలు చెల్లించండి
- లేదంటే ఈనెల 27 నుంచి నిరవధిక సమ్మె
- మంత్రి భట్టికి సీఐటీయూ వినతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



గిరిజన సంక్షేమ శాఖ కళాశాల అనుబంధ హాస్టల్స్‌లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు రావలసిన 18 నెలల వేతన బకాయిలు చెల్లించాలని, గిరిజన కార్మికుల ఆకలి బాధలు తీర్చండి అంటూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకి సిఐటియు జిల్లా అధ్యక్షులు కే. బ్రహ్మచారి ఆధ్వర్యంలో పోస్టుమెట్రిక్ హాస్టల్స్ ఔట్సోర్సింగ్ వర్కర్లు, ఆశ్రమ పాఠశాలల ఐదు నెలల వేతన బకాయిల కోసం డైలీ వేజ్ వర్కర్లు వినతి పత్రాన్ని సమర్పించారు. 18 నెలలు వేతనాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్థిక శాఖలో పెండింగ్లో ఉన్న వేతనాల చెక్కును వెంటనే క్లియర్ చేయాలని కోరారు. డైలీ వేజ్ వర్కర్లకు రావలసిన ఐదు నెలల జీతాలు ఇవ్వాలని కోరారు. వేతనాల సమస్యను పరిష్కారం చేయకపోతే ఈనెల 27వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 28వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ఉన్నాయని, 26వ తేదీ లోపు వేతనాలు కార్మికుల అకౌంట్లో జమ చేయాలని లేదంటే 27వ తేదీ నుంచి వంట బంద్ చేసి సమ్మె నిర్వహిస్తారని వినతి పత్రంలో పేర్కొన్నారు. జీతం లేకుండా ఎలా బతకాలో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సిఐటియు కోరింది. పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ పనిచేస్తున్న కార్మికులకు లో క్యాటరింగ్ ఏజెన్సీ విధానాన్ని రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా జీతాలు ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేసింది సమస్యల పరిష్కరించకపోతే జరిగే సమ్మెకు అధికారులే బాధ్యత వహించవలసి ఉంటుందని పేర్కొన్నది. వినతి పత్రంపై స్పందించిన డిప్యూటీ సీఎం విక్రమార్క సమస్యను పరిష్కరిస్తామని, త్వరలోనే జీతాలు చెల్లిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ 26వ తేదీలోపు అమలు కాకపోతే 27 నుంచి సమ్మె జరుగుతుందని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి. పద్మ, హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జలంధర్, రామా, స్వరూప, తిరుపతమ్మ, జయ లక్ష్మి, నూక శ్యామల, లాలయ్య, సారయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే తులసికి నిజమైన నివాళి

- 7వ వర్ధంతి సభలో వక్తలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



పార్టీ మరింత బలోపేతమే సీపీఐ(ఎం) కార్యకర్త, ఐద్వా నాయకురాలు బండారు తులసికి నిజమైన నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే.రమేష్‌లు అన్నారు. ఆదివారం తులసి 7వ వర్ధంతి సభ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతవహించారు. తొలుత తులసి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... పార్టీ బలహీన పడిన ప్రస్తుత పరిస్థితుల్లో నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు మరింత రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమాలు చేస్తూనే, సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించాలని పార్టీ పిలుపునిచ్చిందని తెలిపారు. ఎన్నికల ఫలితాలు ఇబ్బంది కలిగించేవిగా ఉన్న పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం పుల్లయ్య, కే. బ్రహ్మచారి, ఎంబీ. నర్సారెడ్డి, సీనియర్ నాయకులు జీఎస్. శంకరరావు, బి. తిలక్, పట్టణ నాయకులు బండారు శరత్ బాబు, వైవి. రామారావు, పి. సంతోష్ కుమార్, ఎన్. లీలావతి, కుంజా శ్రీనివాసరావు, కోరాడ శ్రీనివాస్, ఎన్. నాగరాజు, ఎస్. భూపేందర్, ఎంవిఎస్. నారాయణ, కుటుంబ సభ్యులు బండారు సత్యనారాయణ, బండారు సూర్యప్రసాద్, బి. ప్రతాప్ కుమార్, బి. సుందరయ్య, అడపా రామ్ గోపాల్‌రావు, బండారు సరస్వతి, బి. కుమారి, ఐద్వా నాయకురాలు ఎం. సుబ్బలక్ష్మి, కొరసా రవి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలను పరిష్కరించండి

- ఐటీడీఏ పాలకమండలి సమావేశంలో ఎంపీపీ భూక్యా సొన

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి



భద్రాచలం ఐటీడీఏ పాలకమండలి సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి లక్ష్మీదేవి పల్లి మండల భూ సమస్యల్ని తీసుకెళ్లిన ఎంపీపీ భూక్య సోనా. ఐటీడీఏ భద్రాచలం పాలకమండలి సమావేశంలో ఎంపీపీ భూక్య సోనా మాట్లాడుతూ లక్ష్మీదేవి పల్లి మండలం పూర్తిగా ఏజెన్సీ మండలంలోని రైతు సోదరులు నాలుగు తరాలుగా సాగుచేస్తూ తమ స్వాధీనంలో ఉన్న వాటికి భూహక్కు పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు పొందలేకపోతున్నారని, కావున మండలంలోని అంబసత్ర భూములకు, రెవిన్యూ భూములకు, లోతు వాగు ప్రాంత భూముల గురించి, ఉమ్మడి రేగళ్ల గ్రామపంచాయతీ పరిధిలోని రెవెన్యూ ,పోడు భూముల గురించి మండలంలోని పోడు భూములకు త్వరగా భూహక్కు పత్రాలు ఇప్పించగలరని కోరారు. అదేవిధంగా మండలంలోని పిహెచ్సికి అంబులెన్స్ కూడా అందించాలని మండలం సుమారు 50 కిలోమీటర్ల విస్తీర్ణ పరిధిలో ఉందని అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి చేర్చడానికి కావాలని ఉప ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది, స్పందించిన ఉపముఖ్యమంత్రి గౌరవనీయులు భట్టి విక్రమార్క గారు సమావేశంలో ఉన్న గౌరవ భద్రాద్రి జిల్లా కలెక్టర్ గారు ప్రత్యేక చొరవ తీసుకొని భూ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

గెలుపోటములను సమానంగా చూడాలి

- కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్
- ఏల్టా స్పెల్ విజార్డ్ అండ్ డ్రామా విజేతలకు బహుమతులు

నవతెలంగాణ-కొత్తగూడెం



గెలుపు, ఓటములను సమానంగా చూడాలని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో కీర్తిశేషులు ఆదిమూలపు శైలజ ఇంగ్లీష్ ప్రాంగణంలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ భద్రాద్రి జిల్లా (ఏల్టా) ఆధ్వర్యంలో స్పెల్ వీజార్డ్ అండ్ డ్రామా పోటీలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో డిఎస్పీ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, గ్లోబల్ భాష ఇంగ్లీష్ విజయాలకు బాట వేస్తుందని, జ్ఞానానికి, ప్రపంచ విజ్ఞానానికి ఆంగ్లము గేట్వే కావున విద్యార్థులు ఇంగ్లీషు పట్ల మక్కువ పెంచుకొని, ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంచుకుంటే ఈ పోటీ ప్రపంచంలో విజేతలుగా నిలబడవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని సులోచన రాణి, ప్రత్యేక అతిథిగా జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సంజీవరావు, అదిమూల శైలజ భర్త జె.అబ్రహం, వైస్ ప్రెసిడెంట్ జహంగీర్ షరీఫ్, కోశాధికారి వేంకటేశ్వరరావు, సత్యనారాయణ, ఎస్టీటీ యూనియన్ జిల్లా అధ్యక్షులు మద్దెల శివకుమార్, టీఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎన్. కృష్ణ, పీఆర్‌టియు జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, జిహెచ్ఎస్ బాబు క్యాంపు హెచ్ఎం నీరజ, ఆంగ్ల ఉపాధ్యాయులు పోటీల జడ్జీలు తావూరియా, రామ్ కుమార్, కృష్ణవేణి, రజిత, రమాదేవి, మురళి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి అనుహ్యా స్పందన

నవతెలంగాణ-బూర్గంపాడు



బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో భద్రాచలం నేతాజీ హాస్పిటల్, సహస్ర చిల్డ్రన్స్ హాస్పిటల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సారపాక గ్రామంలోని పద్మావతి డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రగతి విద్యా సంస్థ చైర్మెన్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి రిబ్బన్ కట్ చేసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ సారపాక గ్రామంలో పేద ప్రజల కోసం ఉచిత మెగా వైద్య శిబి రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సహస్ర హాస్పిటల్ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ వై. రాజ శేఖర్ రెడ్డి, నేతాజీ హాస్పిటల్ ఛాతీ వైద్య నిపు ణులు ఎస్.జగదీష్ లు మాట్లాడుతూ సుమారు 200 మందికి అవసరమైన వారికి ఉచితంగా గుండెకు సంబంధించిన ఈసిజి, హెచ్ బి , రక్త పరిమాణ శాతం, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. అలాగే ఈ ప్రాంతాలలోని ప్రజల కోసం అదునాతనమైన పరికరాలతో నొప్పిలేని లాప్రో స్కోపి వైద్య సేవలతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం నేతాజీ హాస్పి టల్, సహస్ర చిల్డ్రన్స్ హాస్పిటల్స్ ను భద్రాచలంలో ప్రారంభించామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వాహకులు నరసింహారెడ్డి, జక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు నరసింహారెడ్డి, పత్తి వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



12కేజీల గంజాయి పట్టివేత

-విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన సీఐ

నవతెలంగాణ-ఇల్లందు

గంజాయి తరలిస్తుండగా ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్సై అప్పారావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి పెట్రోలింగ్ జరుపుతుండగా స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. తనిఖీ చేయగా వారి వద్ద 12కేజిల 100గ్రాముల గంజాయ్ ఉన్నట్లు పేర్కొన్నారు. ఒరిస్సా రాష్ట్రం నుండి భద్రాచలం మీదుగా ఇల్లందు నుండి హైదరాబాదు తరలించడానికి ఏర్పాట్లు చేసుకున్నారని తెలిపారు. ఒరిస్సా రాష్ట్రానికి వంకరగిరికి చెందిన గణేష్ పూజారి, పురాన్పూర్ జిల్లా తురిపాటిగూడెం చెందిన సత్యం బాజీగా గుర్తించామని కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్న పెట్రోలింగ్ బృందాన్ని సీఐ అభినందించారు. గంజాయి మారకద్రవ్యాల అక్రమ రవాణాను చేసిన అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ పెన్షనర్స్ డే వేడుకలు

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల కేంద్రమైన బూర్గంపాడులో ఆదివారం తెలంగాణ రిటైర్డ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ బూర్గంపాడు శాఖ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగస్తులు కేసుపాక రాములు, వీర లింగయ్య, షబ్బీరున్నిసా బేగం, అనసూయలను ఘనంగా పూల మాలలతో శాలువాలతో సన్మానించి సత్కరించారు. బూర్గంపాడు ఎస్బిఐ మేనేజర్ కె.ప్రద్యుమ్న, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఇజిఆర్. వెస్లీ లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్బిఐ మేనేజర్ మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగస్తులకు, పెన్షన్ దారులకు కావలసిన లోన్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమానికి బూర్గంపాడు యూనిట్ అధ్య క్షులు మహ మ్మద్ ఖాసిం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కేసుపాక రాములు, సీనియర్ పాత్రికేయులు తోకల మోహన్‌రావు, సహా అధ్యక్షులు ఎంజె. విల్సన్, బి. సువర్ణ రత్నం, సి హెచ్. నాగేశ్వరరావు, వివిధ మండలాల యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్ష నారసింహ సన్నిధిలో 'గరుడ ముడి'

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం కల్పవృక్ష నారసింహ స్వామివారి దివ్య సన్నిధిలో నృసింహ దీక్ష తీసుకున్న స్వాములకు దీక్ష విరమణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వాములు భక్తులతో ఆశ్రమం సందడిగా మారింది. నృసింహ నామంతో భక్తులు ఆనందంగా భజనలు చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వాహకులు డా. కృష్ణ చైతన్య స్వామి మాట్లాడుతూ... దీక్ష అంటే మనిషిని సన్మానంలో నడిపించే సాధనమని మనిషి మార్పుకి కారణం దీక్ష అని అటువంటి మహా శక్తి కలిగిన నృసింహ దీక్ష ను ప్రతి సంవత్సరం కొన్ని వందల మంది స్వీకరిస్తూ ఉన్నారని దీక్షా కాలంలో చివరి మూడు రోజులు ప్రతి రోజు లక్ష గోమయ పిడకలతో విశేషమైన హెూమ ద్రవ్యాలతో నృసింహయాగం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగానే గరుడ ముడితో భద్రగిరి ప్రదక్షిణ చేయడం జరిగినదని అన్నారు.దీక్ష తీసుకోవాలంటే భగవంతుని అనుగ్రహం ఉండాలని, కోటానుకోట్ల రూపాయలు ఉన్నా భగవంతుని అనుగ్రహం లేకపోతే ఏమీ చేయలేమని అన్నారు. ఈ కార్యక్రమం లో ఆశ్రమం నిర్వాహకులు డా. కృష్ణ చైతన్య స్వామి,నృసింహ దీక్షాపరులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మేడారం బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-టేకులపల్లి

తెలంగాణా రాష్ట్ర రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు టేకులపల్లి నుంచి మేడారం జాతరకు వెళ్ళు భక్తుల ప్రయాణ సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రయాణ సముదాయాన్ని ఇల్లందు నియోజకవర్గ శాసన సభ్యులు కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సబ్ ఇన్స్ స్పెక్టర్ శ్రీ.సైదా రాహుఫ్ ఆర్టీసీ డీఎం. బీ.వెంకటేశ్వరరావు, అధికారులు నరసయ్య, భూమిక, కుమార్, హెల్త్ కమ్యూనిటీ సిబ్బంది వజ్జా పార్వతి, కల్తీ వెంకట రమణ, పూనెం చంద్రకళ,వాంకుడోత్ లక్ష్మి, నాగమణి, రాంబాబు, సొసైటీ డైరెక్టర్లు గుడిపూడి కృష్ణయ్య, ఉల్లోజి ఉదయ్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రెడ్యానాయక్, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు అఫ్రోజ్, టేకులపల్లి మాజీ ఉప సర్పంచ్ కటుకోజుల సురేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోరం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం దృష్టికి అపష్కృతంగా ఉన్న సమస్యలు

- ఐటీడీఏ పాలక మండలి సమావేశంలో పాల్గొన్న అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఐటీడీఏ పాలకమండలి సమావేశంలో అశ్వారావుపేట మండలంలో అపష్కృతంగా ఉన్న సమస్యలను ఎంపీపీ శ్రీరామమూర్తి లేవనెత్తారు. భద్రాచలంలోని ఐటిడిఎ కార్యాలయం సమావేశం ప్రాంగణంలో పీఓ ప్రతీక్ జైన్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఐటిడిఎ పాలకమండలి సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ పాలక మండలి సమావేశంలోనే పాల్గొన్న అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి మండలంలోని పోడు భూములకు మిగిలిన పట్టాలు ఇవ్వాలని, గరుకులాల పాఠశాలలు, కళాశాలలకు నూతన భావనలను నిర్మించాలని, అలాగే మండలంలోని గ్రామాలలో పలు చోట్ల నూతన బ్రిడ్జిలను మంజూరు చేయాలని, ప్రభుత్వ హాస్పిటల్‌లో నిపుణులైన వైద్యులను, సిబ్బందిని, 108 అత్యవసర వాహనాన్ని సమకూర్చాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, భద్రాచలం ప్రాజెక్టు పరిధిలోని ఎంపిలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాల్వంచ నుండి మేడారం బస్సులు ప్రారంభం

నవతెలంగాణ-పాల్వంచ

మేడారం జాతర పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ బస్టాండ్ ఆవరణ నుండి ఆదివారం బస్సులు ప్రారంభమయ్యాయి. సామాజిక సేవ కార్యకర్త యడ్లపల్లి శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కత్తిరించి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మధిర డిపో మేనేజర్ శంకర్ మాట్లాడుతూ రెండు నెలల క్రితం ఈ పాల్వంచ బస్టాండ్‌కు వచ్చినప్పుడు తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ అస్తవ్యస్తంగా ఉండేదనీ యడ్లపల్లి శ్రీనివాసరావు స్థానిక అధికారులతో సంప్రదించి పాల్వంచ బస్టాండ్‌కు నూతన వైభవం తీసుకొచ్చారని, అందుకు ఆర్టీసీ రిటైర్ ఎంప్లాయ్ అయినా ఇబ్రాయిల్ సహకరించారని కొనియాడారు. ఇలాంటి దృక్పథం ఉన్న వీరిద్దరూ ఇలాగే ముస్ముందు కూడా వారి సేవలు ఆర్టీసీ సంస్థకు అందించాలని కోరారు. వీరిద్దరిని శాలువా కప్పి బొకే ఇచ్చి ఘనంగా సన్మానించారు. 45 బస్సులను పాల్వంచనుండి మేడారం వెళ్ళు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో పాల్వంచ బస్ స్టేషన్ నుండి ప్రతి 10 నిమిషాలకు మేడారం బస్సు ఉంటుందని, ప్రయాణ చార్జీలు పెద్దలకు 310, పిల్లలకు 170 ఉంటుందని, మేడారం వెళ్లే ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజర్ శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో మధిర డిపోకు చెందిన పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి

నవతెలంగాణ-చండ్రుగొండ



రైతు వేదికలో గ్రంథాలయ సాధన సన్నాహక కమిటీ సమావేశం ఆదివారం రాయి రాజా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు, గ్రామ యువత, అఖిలపక్ష రాజకీయ నాయకులు తదితరులు పాల్గొని వారి వారి అభిప్రాయాలు తెలియపరచడం జరిగింది.చంద్రుగొండ మండల ప్రధాన కేంద్రం అవడం వలన నిత్యం ప్రజలు, ప్రయాణికులు వస్తువులు కొనుగోలు అమ్మకాల కోసం బ్యాంకులకు, ఇతర లావాదేవీలకు వచ్చినప్పుడు మహిళలకు మూత్రశాలలు లేకఅనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని అఖిలపక్ష నాయకులు సమావేశంలో అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ అధికారులు స్పందించి గ్రంథాలయం, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని వారు అన్నారు. వీటి సాధన కోసం కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, సీపీఐ(ఎం), బీఆర్ఎస్, బిజెపి ప్రజా సంఘాల, మండల నాయకులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు బస్సులు ప్రారంభం...



- ఇల్లందు నుండి 130 బస్సులు 400 మంది సిబ్బంది
- మేడారం 120 కిమీ.చార్జి రూ. 270
- మహాలక్ష్మి పథకానికి జీరో టికెట్
- 25వరకు జాతర బస్సులు
- ఇల్లందు గుండాల పస్ర మీదుగా మేడారం

నవతెలంగాణ-ఇల్లందు

గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమైన జాతర. ముఖ్యంగా తెలంగాణ ప్రజలు ఇలవేల్పుగా కొలుస్తున్న సమ్మక్క సారలమ్మల జాతర ఈనెల 21 నుండి ప్రారంభం కానుంది. ఖమ్మం, ఇల్లందు, బయ్యారం, గార్ల, కారేపల్లి, కామేపల్లి, టేకుపల్లి, ఆళ్ళపల్లి, గుండాల మండలాలకు చెందిన వేలాది మంది జాతరకు తరలనున్నారు. ఇందుకోసం ముందస్తుగానే భక్తులు పెద్దయెత్తున మేడారం జాతరకు తరలుతున్నందున ఆర్‌టిసి భారీ ఏర్పాట్లు చేపట్టింది. భక్తులకోసం బస్టాండ్‌లో చలువ పందిళ్ళు వేశారు. అధికారులు, సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్ల కోసం టెంట్లు వేశారు. మెడికల్ క్యాంపు సైతం ఏర్పాటు చేశారు. ఖమ్మం నుండి ఇల్లందు మీదుగా గుండాల, పస్ర మేడారానికి దగ్గరి దారి కావడంతో ఇల్లందు పాయింట్ నుండి 130 బస్సులు నడపనున్నారు. ఖమ్మం డిపోతోపాటు సూర్యపేట, హైదరాబాద్ నుండి లోకల్ బస్సులను ఇల్లందు బస్సుస్టాండ్‌కు రప్పించారు. ఆదివారం నుండి ఇల్లందు మేడారం జాతర బస్సులు ప్రారంభిచించినున్నట్లు ఖమ్మం డిఎం బి.ఓ.శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలతో బస్టాండ్ సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఇల్లందు నుండి 130 బస్సులు 400 మంది సిబ్బంది

మేడారం 120కిమీ.చార్జి రూ. 270 : మహాలక్ష్మి పథకానికి జీరో టికెట్



ఇల్లందు పాయింట్ నుండి మేడారానికి 130 బస్సులు నడుపుతున్నారు. ఇందులో హైదరాబాదులోని హైయత్ నగర్-1,హయత్ నగర్-2, ఇబ్రహీంపట్నం, మేహిద్దీపట్న నుండి 64బస్సులు, ఖమ్మం డిపో నుండి 30, సూర్యపేట నుండి 53 బస్సులు నడపనున్నారు. ఒక బస్సుకు కండక్టర్, డ్రైవర్, సిబ్బంది ఒకరు ఉండనున్నారు. సుమారు 400 మంది విధుల్లో పాల్గొననున్నారు. ఇల్లందు నుండి గుండాల 60కిమీ.గుండాల నుండి పస్రకు 45, పస్ర నుండి మేడారానికి 15కిమీ. మొత్తం 120కీమీటర్లు ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో ఇల్లందు నుండే మేడారానికి దగ్గరి రూట్. చార్జి రూ.270,పిల్లలకు రూ. 150.మహాలక్ష్మి పథకం ద్వార మహిళలకు జీరో టికెట్ అమలులో ఉంటుంది. గతంలో బస్సు సీట్లు నిండితె పంపేవారు. ప్రస్తుతం బస్సు సీట్లు నిండినప్పటికి భక్తులు నిల్చొని ప్రయాణం చేస్తామంటే అనుమంతించనున్నట్లు తెలిసింది.

ఏర్పాట్లు పూర్తి

ఖమ్మం డిఎం శ్రీనివాసరావు



ఇల్లందు నుండి మేడారం జాతరకు ఆదివారం నుండి వచ్చే ఆదివారం 25వ తేది వరకు బస్సులు నడపనున్నట్లు ఇల్లందు రూట్ ఇంచార్జి,ఖమ్మం డిఎం బి.శ్రీనివాసరావు నవతెలంగాణకు తెలిపారు. మొత్తం 130 బస్సులు నడుపుతున్నామని భక్తుల రద్దీని బట్టి మరిన్ని బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 11 రూట్ పాయింట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఇల్లందు, టేకుపల్లి, ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, ఏటూరినాగారం, మంగపేట, చర్ల, వెంకటాపురం ఉన్నట్లు పేర్కొన్నారు. మేడారం జారతకు వెళ్ళిన భక్తులు తిరుగు ప్రయాణంలో మేడారంలో 41వ నెబంర్ వద్దకు వస్తే ఇల్లందు ఖమ్మం రావడానికి బస్సులు ఉంటయని తెలిపారు. ఇల్లందు బస్టాండ్‌లో భక్తులకు అన్ని సౌకర్యాలు, రక్షణ ఏర్పాట్లు చేశామని తెలిపారు.

జాతరకు వెళ్లే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించండి

- మేడారం బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం



మేడారం జాతరకు వెళ్లే భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ రవాణా వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకాన్ని కలిగించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం బస్టాండ్‌లో మేడారం జాతరకు ప్రయాణ సౌకర్యం కల్పించే ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఆదివారం కూనంనేని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి సేవా శిభిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జాతరకు 140 బస్సులు ఏర్పాటు చేసినప్పటికి భక్తుల రద్దీ పరిగణలోకి తీసుకొని స్థానికంగా ఉండే ప్రైవేటు బస్సులను అద్దెప్రాతిపదికన వినియోగించుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిపో అధికారులతోపాటు, సిబ్బంది వారం రోజులపాటు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించాలని తద్వారా మేడారం జాతరకు ఉత్తమ సేవలందించిన డిపోగా పేరుతేవాలని సూచించారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి నష్టపోవద్దని, సురక్షిత ప్రయాణంకోసం ఆర్టీసి సేవలను ఆశ్రయించాలని సూచించారు. కొత్తగూడెం డిపో పరిధిలో 30 ఆర్టీసి సంస్థ బస్సులు మరో 34 ప్రైవేటు బస్సులు ప్రయాణ సేవలు అందిస్తున్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా, డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు, ఫోర్మెన్ రాంబాబు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సునిత, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, కె.రత్నకుమారి, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఉపేందర్, యు.హరీష్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా తిష్ట

- **అసలు తిరుమలాయపాలెం..పనిచేసేది పాల్వంచ ప్రాజెక్ట్**
- **అక్రమార్జనలో దిట్ట**

నవతెలంగాణ-పాల్వంచ

పరిపాలన అసలు బ్యాంకు కోసం అడపాదడపా విధి నిర్వహణలో ఉద్యోగులను డిప్యూటేషన్ చేయడం మామూలుగా జరుగుతుంటాయి. అది కూడా నామమాత్రంగా 6 నెలల నుంచి ఏడాది వరకే డిప్యూటేషన్ చేయడం సర్వసాధారణం కానీ ఐసిడిఎస్ శాఖలో తిరుమలయపాలెం లో పనిచేస్తున్న ఓ అధికారిని డిప్యూటేషన్‌పై పాల్వంచలో ఐసిడిఎస్‌లో 5ఏళ్లుగా తిష్ట వేయడం గమనార్హం. విధుల్లో పాల్వంచ ప్రాజెక్టులో నిర్వహిస్తూ వేతనాలు మాత్రం తిరుమలయపాలెంలో పొందడం విశేషం. తిష్ట వేసిన అధికారి అక్రమార్జనలో ? దిట్ట అని సర్వాత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కింది స్థాయి ఉద్యోగులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నేరుగా కేంద్రాలను సందర్శించి అంగన్వాడీ టీచర్లను ఆయాలను భయభ్రాంతులకు గురిచేస్తూ అందిన కాడికి కందిపప్పు, నూనె, గుడ్లు లాంటివి తీసుకుంటారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ అధికారి పనితీరుతో ప్రాజెక్టులోని సూపర్వైజర్లు , అంగన్వాడీ, టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఏడాదికి ఒకసారి సన్మానాల పేరుతో చీరలు సారెలు కోరుతుందని అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు వాపోతున్నారు. తాజాగా ఇంత జరుగుతున్నా ఐసిడిఎస్ జిల్లా అధికారులు ఫిర్యాదు రాలేదంటూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వారికి కూడా ఆ అధికారి ప్రలోభాలకు గురి చేస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరు నెలల క్రితం అప్పట్లో పనిచేసిన ఐసిడిఎస్ టిడిపి తప్పుడు ప్రచారాలతో వ్యవహరించినట్లు అధికారిపై ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఆ శాఖ ఆర్‌జెడి ప్రత్యేక దృష్టి సారించి పాల్వంచ ఐసిడిఎస్ ప్రాజెక్టును కాపాడవలసిందిగా అంగన్వాడీలు కోరుతున్నారు.

గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు చూసుకున్న చందన

గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు చూసుకున్నట్లు ఉంది పాల్వంచ ఐసిడిఎస్ అధికారి తీరు. ఆదివారం నవతెలంగాణ దినపత్రికలో వెలువడిన "అంగన్వాడీల నుంచి వసూళ్లు"? వార్తతో పాల్వంచ ప్రాజెక్టు అధికారి అతలాకుతలమవుతూ ఉదయం నుంచి ఆ వాట్సప్ గ్రూపులో చేసిన నాటకల్లో మేము డబ్బులు ఇవ్వలేదు అంటే ఇవ్వలేదు అంటూ పోస్టింగ్‌లు చేయడం గమనార్హం. నవతెలంగాణలో వార్త చూసిన వెంటనే అంగన్వాడీలకు సంబంధించిన గ్రూపులలో ఆమెకు మద్దతుగా ఉన్న కొందరి అంగన్వాడీలతో సపోర్టుగా పోస్టింగులు పెట్టించుకోవడం హడావిడి చేయడం కనిపించింది. నాకు అందరూ అంగన్వాడీలు, సూపర్వైజర్లు మద్దతు తెలపాలని హుకుం జారీ చేయడం గమనార్హం.

జోడో యాత్రను జయప్రదం చేయండి

- **మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలి**
- **జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జోగారావు**

నవతెలంగాణ-కొత్తగూడెం



రాష్ట్ర వ్యాప్తంగా జరుగు మొదటి విడత మాదిగల జోడో యాత్రకు అధికసంఖ్యలో కార్యకర్తలు పాలుగొని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు జోగారావు కోరారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ సెంటర్‌లో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో మాదిగ జేఏసి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ జోగారావు మాట్లాడుతూ మాదిగ జేఏసి వ్యవస్థాపకులు, తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్ సాధనకై, "మాదిగల పంతం-బిజేపి.అంతం" నినాదంతో ఈ నెల 21నుంచి హైదరాబాద్, అమీర్ పేట్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న తొలి విడత జోడో యాత్రకు మాదిగలు, మేధావులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీల వర్గీకరణ విషయంలో తీర్పును, రిజర్వ్ ఉంచిన సుప్రీంకోర్టు, తీర్పును వెంటనే వెలువరించాలని, నిరుద్యోగులైన మాదిగ యువతకు ఉద్యోగ నోటిఫికేషన్‌లలో అన్యాయం జరగకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసి.కొత్తగూడెం నియోజకవర్గ కన్వీనర్ బిరియా, భీమ్ రాజ్, నాయకులు రాజేష్, కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీసీ గణితశాస్త్ర మెటీరియల్ ఆవిష్కరించిన కలెక్టర్



- **విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి**
- **రూపొందించిన అధ్యాపకుడు హరిబాబుకు అభినందనలు**

నవతెలంగాణ-పాల్వంచ

జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు , కేజీబీవీ విద్యాలయాల్లో చదువుకుంటున్న ఇంటర్మీడియట్ ఎంపీసీ విద్యార్థులకు గణిత శాస్త్రం-1 బి, 2 బి మెటీరియల్స్‌ను ఉచితంగా పంపిణీ చేయడానికి రూపొందించి, ప్రచురించిన పుస్తకాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా పుస్తకఆవిష్కరణ చేశారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులందరికీ ఉపయోగపడేలా పుస్తకాలను రచించి, పంపిణీ చేస్తున్న పుస్తక రచయిత హరిబాబును కలెక్టర్ అభినందించారు. పుస్తక రచయిత, గణిత శాస్త్ర అధ్యాపకులుటి.హరిబాబు స్వయంగా రచించి, యారో ఎంటర్ప్రైజెస్ వారి ఆర్థిక సహకారంతో పుస్తకాలను ప్రచురించి జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు, కేజీబీవీ విద్యాలయాల్లో అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ఉపయోగపడటం కోసం వీటిని అందించడం జరుగుతుందని అధ్యాపకులు పుస్తక రచయిత టి. హరిబాబు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఒత్తిడి తగ్గించి సులభమైన పద్ధతిలో గణితంలో ఎక్కువ మార్కులు సంపాదించడానికి ఈ పుస్తకాలు ఉపయోగపడు తాయి. ఈ పుస్తకానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ముందుమాట రాసి ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు సహాయపడే విధంగా పుస్తకాలను ఉచితంగా సరఫరా చేయడం వలన చాలామంది విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని, ఈ మెటీరియల్ వలన విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధిస్తారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సులోచన రాణి సంతోషాన్ని వ్యక్తపరిచారు.



ఆదివాసీ సమస్యల వినతికి అవకాశం ఇవ్వరా...

- రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఉమ్మడి ఐటిడిఏ సంవత్సరాల తరబడి పాలక మండలి సమావేశాలు జరగని ఐటిడిఏ పాలకమండల సమావేశానికి ముగ్గురు మంత్రులు, ఇన్చార్జి మంత్రి రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆర్థిక శాఖ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను కలవడం కోసం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ సమస్యలు పరిష్కారం కోసం వినతి పత్రాలు ఇవ్వడానికి వెళితే కనీసం పట్టించుకోని మంత్రులు అని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలు భద్రాచలం ఉమ్మడి ఐటీడీఏ పరిధిలో ఆదివాసీల సమస్య పరిష్కారం కానీ పాలకమండలి సమావేశం ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. 2016 నుండి 2023 వరకు సుమారు 280 కోట్లు తునికాకు కార్మికుల రావలసిన బోనస్ గత ప్రభుత్వం కొంత ఇచ్చే ప్రయత్నం చేసింది. మిగిలిన వారందరికీ నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ సమావేశానికి ఇచ్చిన మంత్రులను కోరారు. అదేవిధంగా సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న పోడు భూములకు హక్కుపత్రాలు గత ప్రభుత్వం కొంతమందికి ఇచ్చి చేతులు దులుపుకుందని మరి ఇప్పుడు మిగిలిన వారందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 3 నీ 2020 బిజెపి కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కరోనా లాక్ డౌన్ కాలంలో ఏప్రిల్ 22 తారీఖున రద్దుచేస్తూ తీర్పునిచ్చిన అందరికీ తెలిసిందే కానీ తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 3 ని ఆర్డినెన్స్ ద్వారా అమ్ములు చేయాలని అమలు చేసే అధికారం గవర్నర్ ఉంటుందని ఈ సందర్భంగా మంత్రులు దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. అదేవిధంగా ఎన్నో ఏళ్లుగా ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలు ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి కోసం ఎదురుచూస్తున్న ఇంతవరకు ఏజెన్సీ డిఎస్‌ని ప్రకటించలేదని వెంటనే ప్రకటించాలని కోరారు. అదేవిధంగా భద్రాది కొత్తగూడెం జిల్లాలో వలస ఆదివాసీలు సుమారు 25వేల మంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నివసిస్తున్నారని గత 40 సంవత్సరాల క్రితం మన ఉమ్మడి రాష్ట్రానికి వచ్చిన వారందరికీ ఎస్టి కోయ తెగకు చెందిన ధ్రువీకరణ పత్రాలు జారిచేయాలని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ.. ఆ సమస్యను అజ్ఞానం చేసి పరిష్కారం చేసే విధంగా కృషి చేద్దామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అంతర్గత రోడ్లు, ఇంటి పన్నులు, రేషన్ కార్డులు, కరెంటు సౌకర్యం కల్పించాలని కోరారు. పాలకమండలి సమావేశం జరగాల్సిన తీరు ఇలా కాదు అని ఐటిడిఏ పాలకమండలి సమావేశం ఏర్పాటు చేయటం పట్ల చిత్తశుద్ధి లేదని ఆయన ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో మూడు నెలలకు ఒకసారి ఐటీడీఏ పాలకమండలి సమావేశం జరపాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాలు సమర్పించడానికి వచ్చిన వివిధ ఆదివాసి సంఘాలు రాజకీయ పార్టీలకు కూడా అవకాశం కల్పించలేదని ఆవేదన చెందారు. భవిష్యత్తులో ఇదే తీరు కొనసాగితే ఆందోళన పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు గౌరీ నాగేశ్వరరావు, మడివి రమేష్, సున్నం గంగ, జిల్లా కమిటీ సభ్యులు కుంజ శ్రీను, సోయం జోగారావు, మడకం నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలు ఈడబ్ల్యూఎస్ కోటాను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పాల్వంచ



ఈ ఏడాది మే 5న జరగనున్న 'నీట్' 2024 కు హాజరు కానున్న ముస్లిం విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ కోటాలో దరఖాస్తు చేసుకోవాలని, ముస్లింలు ఈ కోటాను సద్వినియోగించుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎండీ. యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 10% రిజర్వేషన్ సౌకర్యం ఉన్నందున ముస్లిం విద్యార్థులు తమ ప్రాంతంలోని మీ సేవ కేంద్రాల్లో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్ లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తద్వార ఎంబీబీఎస్, డెంటల్ , ఆయుష్ , బీవీఎస్సీ, ఏహెచ్ సీట్లలో రిజర్వేషన్ పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్ పొందే క్రమంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 8520860785 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | ఫిబ్రవరి 19, 2024 | www.navatelangana.com

రుణాల పేరుతో దళారుల దందా..!

గ్రామీణ ప్రాంత వాసులే లక్ష్యం

చింతకాని మండలంలో పేట్రేగిపోతున్న కేటుగాళ్లు

నవతెలంగాణ-ఖమ్మం

అమాయకులు, గ్రామీణ ప్రాంత వాసులే లక్ష్యంగా గత కొంతకాలంగా రుణాలు ఇప్పిస్తామంటూ కొన్ని ముఠాలు అమాయకులను దోచుకుంటున్నాయి. సబ్సిడీ, బీసీ, ఎస్సీరుణాలు ఇప్పిస్తామంటూ గ్రామీణ ప్రాంతంలో అమాయకులను ఎంచుకొని గత కొంతకాలంగా దోపిడీకి పాల్పడుతున్నారు. చింతకాని మండలంలో కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి దళిత బంధు రుణాలు పేరుతోను అమాయకుల నుంచి భారీగా దోచుకున్నారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది తమ చేతుల్లో ఉన్నారని, కావలసిన వారికి కొటేషన్లు ఇప్పిస్తామని నమ్మబలికి భారీ దందాకు తెర లేపారు. లోన్ ఇప్పించేందుకు ముందుగా ఒక పర్సంటేజీ మాట్లాడుకొని అనంతరం అందులో సగభాగం అడ్వాన్సులుగా తీసుకున్నారు. కొందరికి చిన్న చిన్న రుణాలు సైతం ఇప్పించి అందరికీ వస్తాయని నమ్మకం సృష్టించారు. దీంతో ఈ ముఠా చేతుల్లో అనేకమంది ఇరుక్కున్నారు. దళిత బంధు స్కీముల్లోనూ కొందరు అధికారులతో ఈ ముఠా కుమ్మక్కై కొటేషన్ల పేరుతో భారీ దంగా కొనసాగించారు. వంద శాతం సబ్సిడీతో లభించే దళిత బంధు స్కీములో కొందరు అమాయక మహిళల నుంచి కొటేషన్లు ఇప్పించినందుకు లక్షల్లో దండుకున్నారు. చింతకాని మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో వందల సంఖ్యలో బాధితులు ఈ ముఠా చేతుల్లో చిక్కుకొని డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా.. తిరిగి తమ డబ్బులు తమకు ఇవ్వాలని బాధితులు అడిగినందుకు అనేక ఇబ్బందులకు గురి చేస్తూ దాడులకు సైతం దిగుతున్నట్లు తెలుస్తోంది. బీసీ బంధు, సర్వాయి పాపన్న స్కీం, ఎస్సీ కార్పొరేషన్ రుణాల పేరుతో ఇప్పటివరకు కోట్ల రూపాయలు అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం తెలుస్తోంది. కొందరు కొటేషన్ల పేరుతో ఇప్పటికే బ్యాంకులకు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి బ్యాంకులను బురిడీ కొట్టించిన ఘటనలు సైతం వెలుగు చూస్తున్నాయి. ఏది ఏమైనా సంబంధిత అధికారులు దృష్టి సారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి

హరిత ప్రేమికుడి వినూత్న కానుక...

- వేడుకకు హాజరైన అతిథులకు గులాబీ మొక్కలు పంపిణీ

నవతెలంగాణ - అశ్వారావుపేట

లోకో భిన్న రుచి అన్నారు మన పూర్వీకులు. పరులు పట్ల ప్రేమను కనబరచడం పలు విధాలు. వీటికి తగ్గట్టుగా పర్యావరణ ప్రేమికుడు తన నూతన గృహప్రవేశానికి వచ్చిన సుమారు వెయ్యికి పైగా హాజరైన అతిథులకు గులాబీ మొక్కలు అందజేసారు. సాధారణంగా స్టీల్ లేక ప్లాస్టిక్ బాక్స్ లు కానుకగా ఇవ్వడం పరిపాటి. కానీ దీనికి భిన్నంగా పూలమొక్కలు పంపిణీ చేసిన వైనం చర్చాంశనీయం అయింది. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో గల కెమిలాయిడ్స్ పరిశ్రమలో ఉద్యోగి దండు శ్రీనివాసరాజు - సంధ్య దంపతులు గృహప్రవేశం వేడుకతో పాటు వారి సుకుమారుడు జ్ఞాన శివ సాయి వర్మ పంచెకట్టు వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన ప్రతీ ఒక్కరికి చక్కని విందు తో పాటు గులాబీ మొక్క అందజేసి అతిథులను అబ్బుర పరిచారు.

ప్రమాదానికి గురై వ్యక్తి మృతి

నవతెలంగాణ - అశ్వారావుపేట

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం ఏపీలోని ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం గొల్లగూడెంకు చెందిన పంపర్ల నాగరాజు(43), ఇతని స్నేహితుడు పోలిన నారాయణ కలిసి ఈ నెల 12న మేడారం జాతరకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 14వ తేదిన తమ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం కాలనీ వద్ద వేగంగా దూసుకొచ్చిన జేసీబీ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగరాజును విజయవాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్న క్రమంలోనే పరిస్థితి విషమించి మృతి చెందాడు.



పొంగులేటి వారి ఆత్మీయ ఆతిథ్యం

వేడుకగా మంత్రి సోదరుడు ప్రసాద్ రెడ్డి తనయుని వివాహ రిసెప్షన్

- భారీగా తరలొచ్చి లోహిత్ రెడ్డి- భవాని దంపతులను దీవించిన ప్రజానీకం
- ఆకట్టుకున్న 'పీఎస్ఆర్ ప్యాలెస్' సెట్టింగ్..
- స్వాగతం పలికిన మంత్రి శ్రీనివాసరెడ్డి- మాధురి, ప్రసాద్ రెడ్డి - శ్రీలక్ష్మి దంపతులు
- హాజరైన మంత్రులు భట్టి, కోమటి రెడ్డి, తుమ్మల, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు

నవతెలంగాణ-కల్లూరు

ఐదెకరాల్లో 'పీఎస్ఆర్ ప్యాలెస్' సెట్టింగ్.... ఇరవై ఐదు ఎకరాల్లో నోరూరించే వెజ్, నాన్ వెజ్ వంటకాలతో భోజన ఏర్పాట్లు..... మరో నలభై ఎకరాల్లో వాహనాల పార్కింగ్.... మొత్తంగా 70 ఎకరాల్లో జరిగిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి తనయుని వివాహ రిసెప్షన్ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. వారి స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో జరిగిన ఈ వేడుకకు ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగానే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు తరలొచ్చి లోహిత్ రెడ్డి భవాని దంపతులను దీవించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి - మాధురి దంపతులు ఆయన సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి- శ్రీలక్ష్మి దంపతులు వేడుకకు విచ్చేసిన వారినిఅతిథి మర్యాదలతో ఆహ్వానించారు. మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమయి, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వివిధ వ్యాపార, వాణిజ్య రంగ ప్రముఖులు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై నూతన వధూవరులను దీవించారు.

ఆకట్టుకున్న 'పీఎస్ఆర్ ప్యాలెస్ ' సెట్టింగ్...!

వధూవరులు ఆసీనులయ్యే వేదికను ఐదు ఎకరాల్లో సువిశాలంగా మలిచారు. పీఎస్ఆర్ ప్యాలెస్ పేరుతో రాజభవనం ఆకృతిలో భారీ సెట్టింగ్ వేశారు. హిందూ సంప్రదాయం ఉట్టిపడేలా, ఆధ్యాత్మిక గోపుర నమూనాలో తీర్చిదిద్దిన ఈ భారీ సెట్టింగ్ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ భవనానికి ఇరువైపులా కొండల మీది నుంచి జలపాతం జాలువారేలా, సహజసిద్ధంగా ఉండేలా మలచడం విశేషం. వీటితో పాటు.. ప్రత్యేక స్టాళ్లు, పచ్చని పూదోటలు, ఫౌంటెన్లు ఇలా అనేకం.. ఈ విశాల ప్రాంగణంలో ఆహ్లాదాన్ని పంచాయి.

ఆహా ఏమిరుచి...!

వేడుకకు విచ్చేసిన అతిథులకు మొత్తంగా 12 స్టాళ్లను ఏర్పాటు చేసి విందు భోజనం పెట్టారు. పది స్టాల్లు నాన్ వెజ్, ఒక స్టాల్ వెజ్, మరో స్టాల్ వీఐపీ ల కోసం ఏర్పాటు చేశారు. చికెన్ బిర్యానీ, మటన్ బిర్యానీ, రొయ్యల వేపుడు, తందూరి చికెన్, మటన్ కర్రీ, గోంగూర బోటీ, యాట తలకాయ కూర.. రుమాలీ రోటీ.. ఇలా పలు రకాల నోరూరించే వంటకాలు విచ్చేసిన వారికి వడ్డించారు. భోజనం తర్వాత నాలుగు రకాల ఐస్ క్రీములు, సీతాఫల్ జ్యూస్, డబుల్ కా మీఠా, స్వీట్ ఖీర్ ఏర్పాటు చేసి అందరికీ పసందైన భోజనాన్ని అందించారు.

ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లు...

వేడుకగా వేలాదిగా ప్రజానీకం తరలివస్తారని ముందుగానే అంచనా వేసి అందుకు తగినట్లుగా ఏర్పాట్లను చేశారు. పార్కింగు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లను చేశారు. ఏసీపీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రథమ చికిత్స కేంద్రం, ఫైర్ సర్వీస్ ఇలా భద్రత పరమైన అన్ని జాగ్రత్తలను తీసుకోని వేడుకలను సజావుగా నిర్వహించారు.

పలువురు డీఎస్పీలకు పోస్టింగ్‌లు

నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం శనివారం రాత్రి 61 మంది డిఎస్పిలకు రాష్ట్ర ప్రభుత్వం బదిలీ నిర్వహించింది. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖలో ఇటీవల భారీగా బదిలీలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపద్యంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్లో ఇద్దరు ఏసీపీలకు పోస్టింగ్ కల్పించారు. హైదరాబాద్ ఏసీబీ డిఎస్పిగా పనిచేసి డిజిపి కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న కే.శ్రీనివాసరెడ్డిని ఖమ్మం సిటిసి ఎసిపిగా, హైదరాబాద్ ఐటీ సెల్‌లో ఎసిపిగా ఉన్న బి.శ్రీనివాసులును ఖమ్మం ట్రాఫిక్ ఏసిపిగా బదిలీ చేశారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-నేలకొండపల్లి

బోదులబండలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. కూసుమంచి మండలం నేలపట్ల గ్రామానికి చెందిన మనోహరికి (అలియాస్ పూరి)(20) బోదులబండ గ్రామంలోని పొట్టపింజర విజయ్‌తో గత నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఆదివారం ఉదయం భర్త విజయ్ సిమెంట్ లోడ్‌లో పని నిమిత్తం వెళ్లగా అత్త మిర్చి తోటలో కూలి పని నిమిత్తం వెళ్లారు. ఆమె మామయ్య చేపలు పట్టేందుకు వెళ్లాడు. మామ ఇంటికి తిరిగి వచ్చేసరికి కోడలు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

3న మాస్ లైన్ ఆల్ ఇండియా యూనిటీ మహాసభ

- జయప్రదం చేయండి : జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

భారతదేశంలో చారిత్రాత్మకంగా మూడు విప్లవ పార్టీలు ఐక్యమై సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా)గా ఏర్పడి ఖమ్మంలో మహాసభ నిర్వహిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రజా ప్రదర్శన, బహిరంగ సభను వేలాదిమంది కదలిరావాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బందెల వెంకయ్య అధ్యక్షతన జిల్లా స్థాయి జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన మహిళలు ఎర్ర చీరలు, యువకులు రెడ్ టీషర్టు ధరించి, కోలాట బృందాలు డప్పు బృందాలు వేలాది మందితో ప్రదర్శనలో కళారూపాలు ప్రదర్శించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల నుండి కమ్యూనిస్టు విప్లవకారులు బహిరంగ సభకు హాజరవుతున్నారని అన్నారు. దేశం ప్రమాద అంచున ఉన్నదనీ, జనవరి 22వ తేదీన అయోధ్యలో రాముని ప్రాణప్రతిష్ట పేరున జరిగిన విధానం, క్రమం,తతంగం పూర్తిగా లౌకిక రాజ్య స్ఫూర్తిగా భిన్నంగా జరిగిందని, భారత ప్రధానమంత్రి స్వయంగా పాల్గొనడంతో పాటు, కార్యక్రమ నిర్వహణకు దేశ యంత్రాంగాన్ని ఉపయోగించడం జరిగిందని, ఒకవైపు ప్రజాస్వామ్య లౌకిక రాజ్యంపై దాడి, ఇంకోవైపు హిందుత్వ రాజ్య స్థాపన అవకాశాలు మరింత ముందుకు తెస్తున్నారని అన్నారు. ఎస్ఆర్అండ్ బిజిఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి ప్రదర్శన ప్రారంభమై స్థానిక పెవిలియన్ గ్రౌండ్ లో బహిరంగసభ జరుగుతుందని తెలిపారు. ఈ సభకు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చేలా రంగయ్య, కేంద్ర నాయకులు ప్రదీప్ సింగ్ ఠాగూర్, పోటు రంగారావు, సుభాష్ దేవ్, సంజయ్ సింఘ్వి, దినేష్ గోహైన్, కేజీ రామచందర్, కె.రమ, రాయల చంద్రశేఖర్ తదితరులు హాజరవుతారని ఆయన తెలిపారు. నాలుగైదు తేదీలలో భక్త రామదాసు కళా క్షేత్రంలో కామ్రేడ్ డీవీకే, మహాసభ జరుగుతుందని, మహాసభలకు ఆహ్వాన సంఘం అధ్యక్షునిగా వడెల్లి కృష్ణమూర్తి ప్రముఖ న్యాయవాది పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి వి మనోహర్ రాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సివై పుల్లయ్య, ఆవుల అశోక్, జి రామయ్య, కే అర్జునరావు, ఏ వెంకటరెడ్డి, ఆర్ శివలింగం ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, మలీదు నాగేశ్వరావు, సి హెచ్ శిరోమణి పాల్గొన్నారు.





దార నాగరత్నంకు నివాళి

నవ తెలంగాణ-మధిర

మధిర మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దార బాలరాజు తల్లి దార నాగరత్నం దశదిన కర్మ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అర్చకుల చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ- కామేపల్లి

అర్చకులు చలో సెక్రెటరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అచ్యుత రామారావు శర్మ పిలుపునిచ్చారు. కామేపల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.అర్చకుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20వ తారీఖున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసేందుకు పెద్ద సంఖ్యలో అర్చకులు తరలిరావాలన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెండింగ్ వేతనాల విడుదలతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు.



దుగ్గి అప్పిరెడ్డికి సండ్ర నివాళి

నవతెలంగాణ-వేంసూరు

టీజేపీ రాష్ట్ర నాయకులు దుగ్గి అప్పిరెడ్డి (85) ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు సత్యనారాయణపురంలో ఆయన స్వగృహంలో మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్‌తో పాటు పలు పార్టీల నాయకులు సందర్శించి నివాళ్లర్పించారు.

ఇంత మంచి పాలకవర్గాన్ని తాము ఎప్పుడూ చూడలేదు

- మోటమర్రి ఎస్సీ కాలనీ యూత్

నవతెలంగాణ - బోనకల్

మోటమర్రి చరిత్రలో ఇంత మంచి పాలకవర్గాన్ని తాము ఎప్పుడూ చూడలేదని మోటమర్రి ఎస్సీ కాలనీ యూత్ అభినందించింది. మండల పరిధిలోనే మోటమర్రి గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని మోటమర్రి ఎస్సీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో శాలువాలతో ఘనంగా సన్మానించి బొకేలు అందించారు. సర్పంచ్ కేతినేని ఇందు (సిపిఎం), ఉపసర్పంచ్ అద్దంకి శేషగిరిరావు తో పాటు పాలకవర్గానికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, అభినందించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యూత్ నాయకులు బలవంతపు నరసింహ రావు, కన్నెపోగు ప్రభాకర్, చిలుకూరి అప్పారావు మాట్లాడుతూ సర్పంచ్ కేతినేని ఇందు ఆధ్వర్యంలో మొత్తం పంచాయతీ పాలకవర్గం ఈ ఐదు సంవత్సరాల కాలంలో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు అన్నింటిని కల్పించారన్నారు. ప్రధానంగా గ్రామంలో అంతర్గత రోడ్లు గతంలో ఎంతో అధ్వానంగా ఉండేవి అన్నారు. కాని కేతినేని ఇందు సర్పంచిగా ఎన్నికైన తర్వాత గ్రామంలోనే ప్రధాన వీధులన్నింటిలో సిసి రోడ్లు వేశారన్నారు. గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టారన్నారు. వేసవికాలం సమీపిస్తుంది అంటే ముందుగానే చర్యలు చేపట్టి మంచినీటి సమస్య తలెత్తకుండా అనేక చర్యలు చేపట్టారన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయానికి సమస్యలపై వెళ్ళినప్పుడు సర్పంచ్‌తో పాటు పాలకవర్గం కూడా ఎంతో మంచిగా స్పందించారన్నారు. గ్రామంలో ఏ సమస్య చెప్పిన సానుకూలంగా స్పందించి పరిష్కారం చేశారన్నారు. పదవులు అలంకారం కాదని, పదవులు ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం ఎలా వినియోగించాలో ఆచరణలో చేసి ఈ పాలకవర్గం చూపించిందన్నారు. ఐదు సంవత్సరాలపాటు వివాదాలకు తావులేని మంచి పరిపాలన అందించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు కన్నే పోగు ప్రభాకర్, పాటిబండ్ల విజయకుమార్, నంద్రు విశ్వనాథం, పేరబత్తిని రత్నాకర్, బలవంతపు దాసు, సిపిఎం నాయకులు కేతినేని నాగేశ్వరరావు, పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



వైరాలో వైద్య శిబిరం విజయవంతం



నవతెలంగాణ-వైరాటౌన్.

వైరా బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ప్రతి నెల మూడవ ఆదివారం స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయం బోడేపుడి వెంకటేశ్వరరావు భవనం నందు నిర్వహించే వైద్య శిబిరాన్ని 104వ నెల విజయవంతంగా నిర్వహించారు. బోడేపుడి కళానిలయం వైద్య శిబిరం ద్వారా గత 104 నెలలుగా షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, గ్యాస్, అల్సర్ తదితర వ్యాధులకు నెల రోజులకు సరిపడా మందులను 100 రూపాయలకు అందిస్తున్నారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ జట్ల రంగారావు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు బృందం ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. వైరా స్వాగత్ ఐ కేర్ వైద్య బీందం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు పెద్దప్రోలు మాధురి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోడేపూడి కళానిలయం కార్యదర్శి బొంతు రాంబాబు, ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చునని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. షుగర్, బిపి మందులు దీర్ఘకాలంగా వాడే వారు గుండె, కిడ్నీ, న్యూరో సంబంధించిన పరీక్షలు తరచూ చేయించుకోవాలని, చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు గుండె, శ్వాసకోశ అనారోగ్య లక్షణాలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య శిబిరం వాలంటీర్లు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, బొంతు సమత, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహనరావు, అనుమోలు రామారావు, మాదినేని రజిని, మల్లెంపాటి ప్రసాదరావు, కంభంపాటి సత్యనారాయణ, కోట ప్రేమ్ కుమార్, పుప్పాల నాగరాజు, పాసంగులపాటి చలపతిరావు, మాదినేని ఉదయ్, తాటి కష్ణకుమారి, రేగళ్ల రేణుక తదితరులు పాల్గొన్నారు.



పురోహితులకు పంచాగాల బహూకరణ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లికి చెందిన ఎల్ఐసీ ఏజంట్ ఇందుర్తి సురేందర్‌రెడ్డి ఆదివారం నూతన తెలుగు సంవత్సరాది శ్రీకోధి నామ సంవత్సర పంచాగాలను పురోహితులకు బహూకరించారు. కారేపల్లిలో సాయి మందిరంలో జరిగిన కార్యక్రమంలో శ్రీ విఘ్నేశ్వర వర్చక పురోహిత సంఘం అధ్యక్షులు కొత్తలంక కైలాసశర్మకు పంచాగలాను అందజేశారు. ఈ సందర్భంగా ఇందుర్తి సురేందర్‌రెడ్డిని అర్చక సంఘం నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వెంకటేశ్వరశర్మ, ఈశ్వరశాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.



తండాలలో ఘనంగా బోగ్ బండారో

నవతెలంగాణ-కారేపల్లి

శ్రీసంత్ సేవాలాల్ జయంతిని పురష్కరించుకోని కారేపల్లి మండలం రూప్లాతండా, గుడితండాలో ఆదివారం బోగ్ బండారో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐ భూక్యా రవీందర్, ఇరిగేషన్ డీఈ భూక్యా లాల్‌సింగ్, తండా నాయక్ భూక్యా హుస్సెన్, కర్బరి దారావత్ రాములు ఆధ్వర్యంలో వేడుకలను జరిపారు. ఈసందర్భంగా బంజార గిరిజనులకు సేవాలాల్ మహారాజ్‌చేసిన సేవలను కొనియాడారు. అణగదొక్కబడిన బంజారా జాతిలో చైతన్యం నింపి ఐక్యం చేయటంలో సేవాల్ మహారాజ్ ఎంతో త్యాగం చేశారని కీర్తించారు. ఈకార్యక్రమంలో మాణిక్యారం మాజీ సర్పంత్ భూక్యా రంగారావ్, డీసీసీబీ మాజీ డైరక్టర్ దారావత్ బద్దులాల్, తండా పెద్దలు దారావత్ కిషన్, భూక్యా కోటయ్య, నూనావత్ వెంకన్న, దారావత్ వికాస్ భూక్యా భాషా, వాచ్యా, భూక్యా లక్ష్మన్, దారావత్ వస్రాం, భూక్యా సురేష్, దారావత్ వినోద్, వీరు, బాదావత్ బిక్షం, దారావత్ వీరన్న, భూక్యా నగేష్, భూక్యా కిషన్, కొండయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మత్తులో అశ్లీలంగా యువత

- జనం పట్ల వెకిలి చేష్టలు
- పోలీస్ లు గతంలో కౌన్సెలింగ్ ఇచ్చిన మారని తీరు
- ఆకతాయిల చేష్టలకు చెక్ పెట్టాలని వేడుకుంటున్న గ్రామస్తులు

నవతెలంగాణ-పినపాక

మండలంలోని జానంపేట గ్రామంలో యువకులు మత్తులో జోగుతున్నారు. అది మధ్యమా లేక మరి ఇతర మత్తు పదార్థాలు సేవిస్తున్నారా తెలియాల్సింది. ఆ మత్తులో వారు పలు ఇళ్లలోకి చొరపడి ఇష్టా రీతిన వ్యవహరిస్తున్నారు. వారి వెకిలి చేష్టలకు హద్దు అదుపు లేకుండా పోయింది. బాధితుల వీడియో విజువల్స్ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం జానంపేట గ్రామంలో ఓ రైతు ఇంట్లో వ్యక్తి చొరబడినట్లుగా సీసీ కెమెరా విజువల్స్ లో ఆదివారం తెల్లవారుజామున రికార్డ్ అయ్యాయి. ఆ సమయంలో ఓ యువకుడు ఇంటి పరిసరాలను పరిశీలించాడు. ఎవరు గుర్తుపట్టని విధంగా మోకానికి చేతులు అడ్డం పెట్టుకోవడమే కాకుండా టీ షర్ట్ ను సైతం మొఖం మీద కప్పుకోవడం జరిగింది. మత్తులో ఉన్న మైకంలో ఆ యువకుడు నీచాతి నీచంగా ప్రవర్తించాడు. మాటలు చెప్పడానికి వీలులేని విధంగా ప్రవర్తించడంతో అదృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఈ ఒక్క యువకుడి కాకుండా కొంతమంది యువకులు మత్తులో వికృత చేష్టలకు పాల్పడుతున్నారని గ్రామ ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన కొంతమంది యువకులకు గతంలో ఏడూళ్ళ బయ్యారం పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చినట్టు సమాచారం. అయినప్పటికీ వారిలో ఎలాంటి మార్పు లేదు. ఇళ్లలో ఎవరు లేని సమయాన సీసీ కెమెరాలు ముందుకు వచ్చి వికృత చేష్టలకు పాల్పడడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ అధికారులు దృష్టి సారించి సైకో లకు తగిన బుద్ధి చెప్పాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆదర్శవాది ఎస్సై పుష్పాల రామారావు

ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్సైకు పౌరసన్మానం

నవతెలంగాణ-కారేపల్లి

ఆదర్శభావాలు ఉన్న మానవతవాది ఎస్సై పుష్పాల రామారావు అని, సమస్యలపై సత్వరం స్పందించే తత్వంతోనే మండల ప్రజలను అభిమానాన్ని కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు చూరగొన్నారని వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నారు. ఆదివారం కారేపల్లి ఎస్సైగా పని చేసి బదిలీపై వెళ్తున్న పుష్పాల రామారావుకు కారేపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పౌరసన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, పీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు, జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి వీరప్రతాప్(టోనీ), పోలగాని శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత సంత ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, సీపీఐ మండల కార్యదర్శి బోళ్ల రామస్వామి, టీడీపీ నాయకులు చిన్ని శ్రీనివాస్‌లు మాట్లాడుతూ చీమలపాడు పేలుడు ఘటనలో కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు సమయస్ఫూర్తి, తక్షణమే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించటంతో మృతులు సంఖ్య తగ్గిందన్నారు. రాజకీయంగా చైతన్య కల్గిన మండలంలో విధి నిర్వహణ కత్తిమీద సాములంటిదని వామపక్షాలు బలంగా ఉండి, పోడు సమస్య తీవ్రంగా ఉన్నా ఎస్సై పుష్పాల రామారావు అందరికి అంగీకారమైన రాజీమార్గాన్ని ముందుకు తీసుకవచ్చి సమస్య తీవ్రతను తగ్గించేవారని కొనియాడారు. సేవా కార్యక్రమాలతో పెద్ద, చిన్న అందరిని ఆకట్టుకున్న ఎస్సై రామారావు బదిలీపై వెళు నా ఆయన సేవలు మరో రూపంలో మండలానికి ఇవ్వాలని కోరారు. సన్మాన గ్రహిత ఎస్సై పుష్పాల రామారావు మాట్లాడుతూ విధి నిర్వాహణలో మానవత దృక్పధం అవసరమేనన్నారు. తన విధి నిర్వహణలో ఉన్నతాధికారులతో పాటు జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధుల సహకారం మరవలేనిదన్నారు. అనంతరం ఎస్సైను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షులు అనంతారపు వెంకటాచారి, ప్రధానకార్యదర్శి పగడాల నాగేశ్వరరావు, కోశాధికారి పాలిక శ్రీనివాస్, సహాయకార్యదర్శి తేళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఇమ్మడి రమాదేవి, ప్రముఖ వ్యాపారాలు సురేందర్‌మనియార్, నల్లపాటి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో సన్మానం

వివిధ రాజకీయ పార్టీల నాయకులు కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావును సన్మానించారు. భాగ్యనగర్‌తండా ఎంపీటీసీ ఆలోత్ ఈశ్వరినందరాజ్ ఎస్సైను సన్మానించి మిఠాయిలు అందజేశారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ నాయకులు కడియాల సుధాకర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ముఖ్యమంత్రి కేసీఆరే..!

- ఆదర్శ పాఠశాలలో మారని విద్యాశాఖ బోర్డు
- పేరు మార్పు చేయడంలో బహిర్గతమైన సిబ్బంది నిర్లక్ష్యం



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి మార్పు జరిగి సుమారు రెండు నెలలు గడుస్తున్నా పాఠశాలలో ఏర్పాటు చేసిన బోర్డుపై ఇంకా రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్‌నే యథావిధిగా కొనసాగిస్తుండటం విధుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా బహిర్గతమవుతోంది. క్రమశిక్షణకు మారుపేరుగా పేరు గడించిన ఆదర్శ విద్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం మండలంలో పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రానికి అనుబంధ గ్రామమైన ఎల్లంపల్లి ఆదర్శ విద్యాలయంలో విద్యాశాఖ బోర్డుపై ముఖ్యమంత్రిగా కేసీఆర్, విద్యాశాఖ మంత్రిగా సబితా ఇంద్రారెడ్డి పేర్లను మార్పు చేయకుండా యథావిధిగా కొనసాగిస్తుండటం సిబ్బంది నిర్లక్ష్యానికి తార్కాణంగా నిలుస్తోంది. ఆదర్శ విద్యాలయ సిబ్బంది ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి విద్యాశాఖ బోర్డుపై పేర్లను మారుస్తారా లేకా యథావిధిగా కొనసాగిస్తారా వేచి చూడాల్సిందే.

ఎన్‌డీ నాయకత్వంపై కుట్రకేసులు

- రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఐ(ఎంఎల్)ఎన్‌డీ రాష్ట్ర నాయకత్వంపై రాష్ట్ర ప్రభుత్వం కుట్ర కేసులు మోపుతున్నదనీ వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర నాయకులు కె. గోవర్ధన్, గౌని ఐలయ్య, ఎం శ్రీనివాస్, జి అనురాధతో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 14న ఎన్‌డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర నాయకులు గోపన్నలతో పాటు ఎస్‌కే మదార్, కె సురేశ్‌లను ఖమ్మం పరిసర ప్రాంతాల్లో అదుపులో తీసుకున్నారని తెలిపారు. వారిని 48గంటల్లో కోర్టులో హాజరుపర్చకుండా 16న అరెస్టు చేసినట్టు తప్పుగా చూపించారని విమర్శించారు. వారితో పాటు 24 మందిపై ప్రభుత్వాన్ని కూలదోయటానికి ఆయుధాలు, డబ్బులు సమకూర్చుకుంటున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. వారితో పాటు మరికొందరిని అరెస్టు చేశారని వారందరిపైనా పెట్టిన కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన అని చెప్పుకునే సర్కారులో నిర్బంధమేంటని ప్రశ్నించారు.

14 శాతం వద్దు

- వేతన పెంపు కనీసం 25 శాతం ఉండాలి : ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం 14 శాతం వేతన పెంపు ప్రతిపాదనను తిరస్కరించింది. ఐదేండ్ల ఒప్పందం ప్రకారం 2017 నుంచి వేతన సవరణ జరగాల్సిన ఉద్యోగులు కనీసం 25 శాతం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం ముంబయిలో ఆల్ ఇండియా నేషనల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏఐఎన్ఎల్ఐఈఎఫ్), ఎల్ఐసీలోని ఇతర యూనియన్‌లతో జరిపిన ఒక సమావేశంలో ఈ ప్రతిపాదనను ప్రభుత్వం అందించింది. దీనిని యూనియన్ తిరస్కరించింది. ఇది అంకితభావాన్ని, కార్మికుల నిబద్ధతను ప్రతిబింబించడం లేదని తెలిపింది. ఏఐఎన్ఎల్ఐఈఎఫ్ జనరల్ సెక్రెటరీ రాజేష్ నింబాల్కర్ ఒక ప్రకటనను విడుదల చేశారు. అనేక పరామితులలో ప్రభుత్వ రంగ బీమా సంస్థ పనితీరును పరిగణనలోకి తీసుకుంటే, మేనేజ్‌మెంట్ చేసిన ఆఫర్ ఉద్యోగులను నిరాశపరిచిందని పేర్కొన్నారు. ఉద్యోగులకు చివరి పెంపు 2017లో జరిగింది. తదుపరి సవరణ 2022లో జరగాల్సి ఉంది. "2017 వేతన సవరణలో, కంపెనీ దాదాపు 20-25 శాతం పెంపును ఇచ్చింది. ఈసారి కూడా మేము దాదాపు 22 శాతం పెంపును ఆశిస్తున్నాం" అని నింబాల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రంగ బీమా సంస్థ నివేదిక ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24 మూడో త్రైమాసికంలో సంవత్సరానికి 49 శాతం నికర లాభాన్ని నమోదు చేసింది. ఇది గత సంవత్సరంలో రూ. 6,334.29 కోట్ల నుంచి రూ. 9,444.42 కోట్లుగా ఉన్నది. నికర ప్రీమియం ఆదాయం కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.1,11,788 కోట్ల నుంచి రూ.1,17,017 కోట్లకు మెరుగుపడింది. ఎల్ఐసీ మొత్తం ఆదాయం కూడా గత డిసెంబర్ త్రైమాసికంలో రూ.1,96,891 కోట్లతో పోలిస్తే రూ.2,12,447 కోట్లకు పెరిగింది.

చండీగఢ్ మేయర్ రాజీనామా?

చండీగఢ్ : దేశం యావత్తు తీవ్ర విమర్శలు చేసిన ఎన్నికల్లో విజయంతో చండీగఢ్ మేయర్‌గా ఎన్నికైన మనోజ్ సొంకార్ ఆదివారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. మనోజ్ సొంకార్ ఎన్నికకు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు విచారణకు ఒక రోజు ముందుగా మనోజ్ రాజీనామా చేసినటు భావిస్తున్నారు. జనవరి 30న చండీగఢ్ మేయర్ ఎన్నికలు జరిగాయి. అయితే ఇందులో కాంగ్రెస్, ఆప్ కౌన్సిర్లకు చెందిన ఏడు ఓట్లను చెల్లనవిగా ప్రకటించి బిజెపి అభ్యర్థి మనోజ్ సొంకార్ విజయం సాధించినట్లుగా అధికారులు ప్రకటించారు. చెల్లని ఓట్లుగా ప్రకటించడం కోసం ప్రతిపక్ష కౌన్సిలర్ల బ్యాలెట్ పత్రాలపై ఎన్నికల అధికారి పిచ్చి గీతలు పెడుతున్న వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఎన్నికలను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆప్ ఆశ్రయించింది. గత విచారణలో ఈ ఎన్నికను 'ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడంగా' సుప్రీంకోర్టు విచారించింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. నేడు జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని ప్రెసీడింగ్ అధికారి ఆదేశించింది.

కాంగ్రెస్ హయాంలో మెగా స్కామ్‌లు

- బీజేపీకి 370 ప్లస్ ఖాయం: ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : కాంగ్రెస్ హయాంలో అవినీతి రాజ్యమేలగా, తమ పదేండ్ల పాలనలో దేశంలో ఎలాంటి మెగా స్కామ్‌లు జరగలేదని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఢిల్లీలో ఆదివారం పార్టీ జాతీయ సదస్సు 2024 రెండో రోజు బీజేపీ నేతలను ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ విపక్ష నేతలు ఈసారి ఎన్డీయేకు 400 స్థానాలని నినాదాలు ఇస్తున్నారని, ఎన్డీయేకు 400 స్థానాలు వచ్చే దిశగా బీజేపీ 370 స్థానాలు పైగా గెలుచుకోవాలని ప్రధాని పిలుపు ఇచ్చారు.తాము మెగా స్కామ్‌లు, ఉగ్ర దాడుల నుంచి దేశాన్ని రక్షించామని యావత్ దేశం విశ్వసిస్తోందని అన్నారు. తాము పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ప్రయత్నించామని చెప్పారు. అభివృద్ధి చెందిన భారత్ ఆవిష్కరణ దిశగా రాబోయే ఐదేండ్లు కీలకమని అన్నారు.

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మలిచేందుకు అవసరమైన చర్యలను గత పదేండ్లలో చేపట్టామని ప్రధాని మోడీ వివరించారు. మనం అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపు ఇచ్చారు.

అన్నదాతల సమస్యలపై అలసత్వం

ఎంఎస్‌పీపై సర్కారు కుంటిసాకులు

- ఆ మూడు పంటలకే మద్దతు ధరలు పరిమితం
- ఆర్థికంగా నష్టపోతున్న ఇతర పంటల రైతులు



న్యూఢిల్లీ : పోలీసులు, పారా మిలటరీ దళాలు ఎన్ని రకాలుగా నిర్బంధాలు పెడుతున్నప్పటికీ డిమాండ్ల సాధన కోసం దేశ రాజధానిలో ప్రవేశించేందుకు అన్నదాతలు కృతనిశ్చయంతో ప్రయత్నిస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం రైతులు సాగించిన సుదీర్ఘ పోరాటం ఇప్పుడు మళ్లీ గుర్తుకు వస్తోంది. అయితే ప్రస్తుతం రైతులు చేస్తున్న డిమాండ్లలో కొంత తేడా ఉంది. ఆ నాడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలంటూ రైతన్నలు ఆందోళన జరిపిన విషయం తెలిసిందే. ఇప్పుడు మాత్రం పంటల కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పీ) చట్టపరంగా గ్యారంటీ ఇవ్వాలని వారు ప్రధానంగా కోరుతున్నారు. దీనితో పాటు రుణమాఫీ, పెన్షన్, ఉపాధి హామీ చట్టంలో అదనపు నిబంధనలు వంటి ఇతర డిమాండ్లను కూడా వారు ముందుకు తెస్తున్నారు. గ్రామీణ ఉపాధిని, దేశ ప్రజలకు సంబంధించిన అనేక అంశాలను కూడా వారు తమ నిరసన పరిధిలో చేర్చారు.

అన్నదాతల్లో 85% మంది చిన్న కమతాలు కలిగిన వారే. వీరు అరకొర ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. వీరికి ఐదు ఎకరాల కంటే తక్కువ భూమే ఉంది. ఇక మిగిలిన రైతులు కూడా కేవలం వ్యవసాయం పైనే ఆధారపడి లేరు. వీరిలో చాలా మంది వ్యవసాయ సంబంధమైన వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే రైతులు కేవలం వ్యవసాయ ఆదాయంతోనే మనుగడ సాగించడం లేదు.

ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడం వల్లనే రైతులు రాజధాని వైపు కదిలారు. 2022లో ఇచ్చిన హామీలే అమలుకు నోచుకోకపోవడంతో ప్రభుత్వంపై రైతులకు విశ్వాసం కలగడం లేదు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీకి నేటికీ అతీగతీ లేదు. ఎంఎస్‌పీ, వ్యవసాయ సంస్కరణలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై రైతులెవ్వరూ ఆశలు పెట్టుకోవడం లేదు. ఎందుకంటే దానిని బీజేపీ అనుకూల సభ్యులతో నింపేశారు. రైతు సంఘాలన్నీ దానిని బహిష్కరించాయి.

ప్రభుత్వం ఏం చెబుతోంది?

ఉత్పత్తి వ్యయాన్ని పూర్తిగా పరిగణనలోకి తీసుకొని అన్ని పంటలకూ ఎంఎస్‌పీని కల్పించాలన్న రైతుల డిమాండ్‌ను ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. అలా ఇచ్చినప్పుడే తాము నష్టాల బారి నుండి లాభాల బాట పడతామని రైతన్నలు చెబుతున్నారు. అయితే ఈ ప్రధాన డిమాండ్‌ను వ్యతిరేకించడానికి ప్రభుత్వం కొన్ని కారణాలు చూపుతోంది. అవేమిటంటే... దీనివల్ల రూ.10 లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. రైతులు పండించిన మొత్తం పంటను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇది పాలనాపరంగా సాధ్యం కాదు. ప్రైవేటు వ్యాపారులు కొనుగోళ్లు ఆపేస్తారు. దీనివల్ల రైతులు నష్టపోతారు. ప్రస్తుతం ధాన్యం, గోధుమలను మాత్రమే ప్రభుత్వం సేకరిస్తోంది. అలాంటప్పుడు ఇతర పంటలకు ఎంఎస్‌పీ ఎలా అమలు చేస్తారు? బడా రైతులకు మాత్రమే ఎంఎస్‌పీ లభిస్తుంది. డబ్ల్యూటీఓలో సమస్యలు ఎదురవుతాయి....ఇవన్నీ ప్రభుత్వం చెబుతున్న కారణాలు.

ఆ మూడు పంటలపైనే దృష్టి

ఇప్పుడు వాస్త వాలేమిటో పరిశీలిద్దాం. ప్రస్తుతం 23 పంటలకు ఎంఎస్‌పీ వర్తిస్తోంది. కానీ వరి, గోధుమ పంటలకు మాత్రమే అమలవుతోంది. చెరకు పండించే రైతులకు చక్కెర మిల్లులు ధర చెల్లిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో వరి, గోధుమ, చెరకు పంటలకు అక్కడి వాతావరణం అనుకూలంగా లేకపోయినా రైతులు వాటినే సాగు చేస్తున్నారు. ఈ పంటలకే కనీస ధర లభించడం దీనికి కారణం. ఉదాహరణకు మహారాష్ట్రలో నీటి ఎద్దడి అధికంగా ఉండే ప్రాంతాల్లో చెరకును సాగు చేస్తున్నారు. పంజాబ్‌లో వరి పంట పరిస్థితి కూడా అదే. ఫలితంగా వరి, గోధుమ, చెరకు పంటల ఉత్పత్తి అవసరమైన దాని కంటే అధికంగా ఉంటోంది. ప్రభుత్వం వద్ద నిల్వలు పేరుకుపోతున్నాయి. స్టోరేజీ సౌకర్యాలు సరిగా లేకపోవడంతో వృథా జరుగుతోంది. పంట ఉత్పత్తుల సేకరణ, నిల్వ, ప్రజా పంపిణీ వ్యవస్థ కోసం విడుదల చేయడం వంటి పనుల కోసం ఎఫ్‌సీఐకి పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇవ్వాల్సి వస్తోంది. ఈ పరిస్థితికి ఏకైక కారణం ఆ మూడు పంటలకు మాత్రమే మద్దతు ధర లభించడం.

అన్ని పంటలకూ వర్తింపచేస్తే...

అన్ని పంటలకూ ఎంఎస్‌పీని వర్తింపజేస్తే వాతావరణానికి అనుకూలించే పంటలనే రైతులు పండిస్తారు. దీనివల్ల కొన్ని పంటల ఉత్పత్తుల నిల్వలు పేరుకు పోవడాన్ని నివారించవచ్చు. కొన్ని పంట ఉత్పత్తులను పెద్ద ఎత్తున నిల్వ చేయాల్సిన అవసరం ఉండదు. దేశంలో చమురు గింజల సరఫరా తక్కువగా ఉన్నందున ఆ పంటల ఉత్పత్తిని పెంచుకోవచ్చు. కొన్ని పంట ఉత్పత్తులను దిగమతి చేసుకువాల్సిన అవసరం కూడా ఉండదు. ఫలితంగా విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు అందుబాటులో ఉన్న స్థలం ఇతర పంటలకు లభిస్తుంది.

డిమాండ్, సరఫరాలే కీలకం

ఎంఎస్‌పీ కంటే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఎందుకు తక్కువగా ఉంటున్నాయి? వ్యవసాయోత్పత్తుల ధరలను డిమాండ్, సరఫరా నిర్ధారిస్తాయి. ఉదాహరణకు పంట కోతల తర్వాత ఉత్పత్తులు వరదలా మార్కెట్‌లోకి వచ్చి పడతాయి. ఫలితంగా ధరలు పడిపోతాయి. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ప్రభుత్వం ఉచితంగా రేషన్ అందిస్తున్నప్పటికీ దేశంలో 30% మంది మహిళలు, చిన్నారులు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. పేదరికం అధికంగా ఉండడంతో డిమాండ్ తగ్గిపోతోంది. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ధరలు తక్కువగా ఉండడంతో 2022లో రైతులు రూ.14 లక్షల కోట్లు నష్టపోయారని ఓ సర్వే చెబుతోంది. రైతులకు అందజేస్తున్న సబ్సిడీకి ఇది మూడున్నర రెట్లు అదనం. అందుకే ఎంఎస్‌పీ, సేకరణ, పంపిణీ అనేవి కీలకంగా మారాయి.

ప్రభుత్వ సేకరణ ఎప్పుడు?

ధరలు ఎంఎస్‌పీ కంటే తక్కువగా ఉన్నప్పుడే ప్రభుత్వ సేకరణ అవసరం అవుతుంది. అధిక ఉత్పత్తి జరగకపోయినట్లయితే పంటల ధరలు ఎంఎస్‌పీ కంటే ఎక్కువగా ఉంటాయి. దేశంలో కరువు కాటకాలు సంభవించినప్పుడు, ఆకలి కేకలు వినిపించినప్పుడు, ధరలు ఆకాశాన్ని తాకినప్పుడు ప్రభుత్వం పంట మొత్తాన్నీ కొనుగోలు చేస్తుంది. ఆహార ధరలు తక్కువగా ఉండాలని సర్కారు కోరుకుంటుంది. అప్పుడు కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించవచ్చు. ఫలితంగా వ్యాపారులకు అధిక లాభాలు వస్తాయి. చౌకగా పనివారు లభించాలని కోరుకునే సంపన్నులు లాభాలు మూటకట్టుకుంటారు

వ్యవసాయ సబ్సిడీలు తగ్గించొచ్చు

జీవనానిని అవసరమైన వేతనాలకు రాజ్యాంగం హామీ ఇస్తోంది. అదే లభిస్తే వ్యవసాయోత్పత్తులు పెరుగుతాయి. వాటి ధరలు ఎంఎస్‌పీ కంటే ఎక్కువగా ఉంటాయి. అప్పుడు రైతన్నలు వ్యవసాయ కార్మికులకు మంచి వేతనాలు అందించగలుగుతారు. అయితే అధిక వేతనాలు, ధరలు ద్రవ్యోల్బణ పెరుగుదలకు కారణమవుతాయి. పరోక్ష పన్నులను తగ్గించి, ప్రత్యక్ష పన్నులను పెంచడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. అంతా సజావుగా ఉంటే వ్యవసాయ సబ్సిడీలను తగ్గించవచ్చు. ఆ మొత్తాన్ని విద్య, ఆరోగ్యం, ప్రజా పంపిణీ వ్యవస్థ, మౌలిక సదుపాయాలకు మళ్లించవచ్చు.

పారిశ్రామిక రంగంపై ప్రేమ

సబ్సిడీలు అవాంఛనీయమని కొందరు చెబుతారు. కానీ విద్య, ఆరోగ్యం తదితర రంగాలకు అవి ఎంతో అవసరం. కానీ ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఉదాహరణకు పీఎల్ఐ పథకం ద్వారా ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీలు ఇస్తోంది. వాస్తవానికి వాటికి అవి అవసరం లేదు. వీటినే పన్ను వ్యయాలు అంటారు. 2021లో ఈ పద్దు కింద రూ.448 లక్షల కోట్లు ఖర్చు చేశారు. భూమి, నీరు, విద్యుత్‌తో వ్యాపారం చేసే వారికి సబ్సిడీలు ఇస్తున్నారు.

యూరప్‌లో కూడా కార్మికులు డిమాండ్ల సాధన కోసం రోడ్లు, రహదారులను దిగ్బంధిస్తున్నారు. ప్రభుత్వాలు బడా వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలపై ప్రేమ కురిపించడానికి బదులు మెజారిటీ వర్గంగా ఉన్న ప్రజల సంక్షేమంపై దృష్టి సారిస్తే సత్ఫలితాలు లభిస్తాయి.

రైతులు వ్యవసాయేతర రంగాల్లో ఉపాధిని వెతుక్కోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నారు. అయితే యాంత్రీకరణ, ఆటోమేషన్, ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం కారణంగా వ్యవసాయేతర రంగంలో ఉపాధి లభించడం కష్టమైపోతోంది. అసంఘటిత రంగంలో కంటే సంఘటిత రంగంలో పని చేసే కార్మికుడు 19 రెట్లు అధికంగా ఉత్పత్తిని అందిస్తాడు.

పాస్‌వర్డ్ కోసం బలవంతం చేయకూడదు

- ఢిల్లీ హైకోర్ట్ కీలక తీర్పు
- గతంలో భిన్నమైన తీర్పులు ఇచ్చిన కర్నాటక, కేరళ న్యాయస్థానాలు



న్యూఢిల్లీ : డిజిటల్ ఆధారానికి సంబంధించిన పాస్‌వర్డ్‌ను వెల్లడించాల్సిందిగా నిందితుడిని బలవంతం చేయకూడదని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు చెప్పింది. సంకేత్ భద్రేష్ మోడీ, సీబీఐ మధ్య నడుస్తున్న ఓ కేసులో న్యాయస్థానం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. వ్యక్తులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, మానవ హక్కులను ముఖ్యంగా గోప్యతకు సంబంధించిన హక్కును ఈ తీర్పు పరిరక్షించిందని న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. మరో కేసులో కర్నాటక హైకోర్టు ఇచ్చిన తీర్పుకు ఇది భిన్నంగా ఉండడం గమనార్హం.

గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు కూడా ఢిల్లీ కోర్టు తీర్పు భిన్నంగానే ఉంది. నిందితుడి మొబైల్ ఫోన్‌లో ఉన్న సమాచారాన్ని తీసుకునే హక్కు ప్రాసిక్యూషన్‌కు ఉన్నదంటూ కేరళ హైకోర్టు ఓ కేసులో రూలింగ్ ఇచ్చింది. అలా తీసుకోవడం ఆర్టికల్ 20 (3) ప్రకారం రాజ్యాంగపరమైన హక్కును ఉల్లంఘించినట్లు కాదని స్పష్టం చేసింది. ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకునే సమయంలో పాటించాల్సిన మార్గదర్శకాలపై ఆదేశాలు జారీ చేయాలంటూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు ఇప్పటికే పెండింగులో ఉన్నాయి.

ఏమిటీ కేసు ?

ఈ-సంపర్క్ సాఫ్‌టెక్ కంపెనీ, దాని డైరెక్టర్లు భారత్‌లోని మోసపూరిత కాల్ సెంటర్ల నుండి అమెరికా పౌరులకు 20 మిలియన్ డాలర్ల విలువ కలిగిన ఫోన్ కాల్స్ చేసి, కుంభకోణానికి పాల్పడ్డారని సీబీఐ అభియోగాలు మోపింది.

ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న సంకేత్ భద్రేష్ మోడీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిని సీబీఐ వ్యతిరేకించింది. కుంభకోణానికి నిందితుడే సూత్రధారి అని, ఆయన తన ఎలక్ట్రానిక్ పరికరాలు, ఈ-మెయిల్ ఖాతాలు, క్రిప్టో వాలెట్ ఖాతాలకు సంబంధించిన పాస్‌వర్డ్‌లను అందజేయలేదని తెలిపింది. అయితే లాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల చుట్టూనే ఈ కేసు నడుస్తోందని, వాటిని ఇప్పటికే దర్యాప్తు సంస్థ స్వాధీనం చేసుకున్నదని న్యాయమూర్తి బెనర్జీ గుర్తు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం నిందితుడికి బెయిల్ మంజూరు చేశారు. పౌరులకు ఆర్టికల్ 20 (3) కింద రాజ్యాంగపరంగా లభించిన రక్షణకు దర్యాప్తు సంస్థలు ఆటంకం కలిగించరాదని చురక వేశారు.

జవాన్‌ను గొడ్డలితో నరికి హత్య

- బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి వడిగట్టారు. వారాంతపు సంతలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ జవాన్‌ను ఆదివారం ఉదయం మావోయిస్టులు గొడ్డలితో అత్యంత కిరాతకంగా నరికి హతమార్చారు. బీజాపూర్ జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సీఏఎఫ్ కంపెనీ కమాండర్ తేజరామ్ భూర్య కుట్రు పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే మావోయిస్టులు తమ ఉనికి చాటుకునేందుకే జవాన్లపై దాడి చేయడమే కాక, ఒక జవాన్‌ను అత్యంత కిరాతకంగా గొడ్డలితో నరికి చంపారని ఎస్పీ తెలిపారు. కాగా, ఘటన అనంతరం పోలీసులు అడవిని జల్లెడపడుతున్నారు.

అవ్‌దీవ్‌కా నగరం నుంచి ఉక్రెయిన్ ఉపసంహరణ

మాస్కో: అవ్‌దీవ్‌కా నగరం పూర్తిగా రష్యా సైన్యం వశమైందని రష్యా రక్షణ శాఖ శనివారం నాడు ప్రకటించింది. ఉపసంహరించుకునే క్రమంలో ఉక్రెయిన్ సైనికులు తమ ఆయు ధాలను,సాయుధ సామాగ్రిని తరలించు కోవటం సాధ్యపడలేదు. ఆ క్రమంలో దాదాపు 1500 మంది ఉక్రెయిన్ సైనికులు తమ ప్రాణాలను కోల్పోయారు. దీనితో యుద్ధ క్షేత్రం డోనెస్క్ నగరానికి మరింత దూరం జరిగినట్టయింది. ఇది ఆ నగర ప్రజలకు ఉక్రెయిన్ బాంబు దాడుల నుంచి ఉపశమనంగా మారనుంది. ఉక్రెయిన్ నూతన సైన్యాధ్యక్షుడు పశ్చిమ దేశాలలో శిక్షణ పొందిన ఎలైట్ సైనికులను పంపినప్పటికీ అవ్‌దీవ్‌కా నగరంపైన పట్టును నిలుపుకోవటం సాధ్యపడలేదని, అందుకే ఉపసంహరణకు ఆదేశించామని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాడీమీర్ జెలెన్స్కీ ఒక ప్రకటనలో తెలిపాడు. రష్యా సైన్యం అన్నివైపుల నుంచి చుట్టుముట్టడటంతో ఉపసంహరణ తప్ప మరో మార్గం లేదని ఆయన అన్నాడు.

అవ్‌దీవ్‌కా నగరాన్ని వశపర్చుకున్నాక డోనెస్క్ ప్రాంతాన్ని మరింతగా ఉక్రెయిన్ నుంచి విముక్తం చేసే పనిలో రష్యా సైన్యం ఉంటుందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అవ్‌దీవ్‌కాను విముక్తంగావించటంలో రష్యా సైనిక దళాలు గొప్ప విజయాన్ని సాధించాయని "సెంటర్" గ్రూపు కమాండర్ జనరల్ అంద్రే మోర్ద్విచేవ్‌కు ఇచ్చిన టెలిగ్రాంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ ప్రశంసించాడు. అవ్‌దీవ్‌కా నగరంలో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ ఓడిపోతుందని అనేక వారాలుగా అమెరికా అధికారులు, పశ్చిమ దేశాల జర్నలిస్టులు ఊహిస్తూనే ఉన్నారు. పశ్చిమ దేశాల నుంచి అందవలసిన సహాయం అందకనే ఉక్రెయిన్ అవ్‌దీవ్‌కా నగరాన్ని కోల్పోనున్నదని గత వారారంభంలో అమెరికా అధ్యక్ష భవన జాతీయ భద్రతా మండలి అధికార ప్రతినిధి జాన్ కిర్బీ నిందించాడు. ఈ ఓటమికి కారణం పశ్చిమ దేశాలు సష్టించిన "ఆయుధాల కత్రిమ కొరత" అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూడా అన్నాడు. అమెరికా అందించవలసిన 60 బిల్లియన్ డాలర్ల సైనిక సహాయం అందకపోతే అవ్‌దేవ్‌కాలో జరిగినట్టి పరాజయం ఉక్రెయిన్‌కు అనేక చోట్ల ఎదురౌతుందని ఒక అమెరికా రక్షణ శాఖాధికారి మీడియాతో మాట్లాడుతూ చెప్పాడు.

గాజాకు అందే సహాయాన్ని అడ్డుకుంటున్న ఇజ్రాయిల్ : అమెరికా దౌత్యవేత్త

గాజా: గాజాకు అందించే మానవతా సహాయాన్ని కూడా అక్కడి ప్రజలకు చేరకుండా వివిధ రూపాల్లో ఇజ్రాయిల్ అడ్డుకుంటోందని జో బైడెన్ పాలనా యంత్రాంగం ఆరోపిస్తోంది. నిజానికి ఈ విమర్శ అత్యంత అరుదైనదిగా భావించవచ్చు. ఇజ్రాయిలీ వైమానిక దాడుల్లో పాలస్తీనా పోలీసులు చనిపోవటంతో సహాయ సామాగ్రిని తీసుకువచ్చే వాహనాలకు రక్షణ కరువైందని, అవి క్రిమినల్ గుంపుల పాలవుతున్నాయని మానవతా సమస్యల పైన మధ్యప్రాచ్యంలో ప్రత్యేక దౌత్యవేత్తగా వ్యవహరిస్తున్న డేవిడ్ షట్టర్‌ఫీల్డ్ అన్నాడు. ఇదే కాకుండా సరిహద్దు దాటి గాజాలోకి ప్రవేసిస్తున్నప్పుడు ఇజ్రాయిలీలు చేస్తున్న నిరసనలు కూడా గాజా ప్రజలకు సహాయాన్ని అందించటానికి అడ్డంకిగా ఉన్నాయి.

ఇటీవల కాలంలో ఇజ్రాయిల్ పాలస్తీనా పోలీస్ ఉద్యోగుల పైన, వాహనాలకు భద్రతను అందించే మిలిటరీ కమాండర్ పైన కూడా దాడులు చేయటంవలన గాజా ప్రజలకు సహాయాన్ని అందించే ఐక్యరాజ్య సమితి, ఇతర సంస్థలు తమతమ సహాయ కార్యక్రమాలను నిర్వహించటంలో ఇబ్బందుల్లో పడుతున్నాయని షట్టర్‌ఫీల్డ్ తన విచారాన్ని వెలిబుచ్చాడు. ఇప్పటికే గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 35వేల మంది పాలస్తీనా ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారు. కనీసం ఒక లక్ష మంది గాయపడ్డారు. ఇజ్రాయిల్, హమస్ యుద్ధం పర్యవసానంగా గాజాలో నివసిస్తున్న ప్రజల్లో 85శాతం మంది స్థానభ్రంశం చెందారు. దాదాపు ఆరు లక్షల మంది ఆహారం అందక అలమటిస్తున్నారు. సహాయ సామాగ్రిని తెచ్చే వాహనాలను దారి మరల్చి హమస్ మిలిటెంట్లు తమ అవసరాలకు వాడుకుంటున్నారని ఇజ్రాయిల్ చేస్తున్న విమర్శకు సాక్ష్యం ఏమీ లేదని ఐక్యరాజ్య సమితి ఏజన్సీలతోపాటు షట్టర్‌ఫీల్డ్ కూడా అన్నాడు. ఇజ్రాయిల్ బాంబు దాడలవల్ల గాజాలో నివసిస్తున్న 14లక్షలమంది పాలస్తీనా ప్రజలు కాందిశీకులుగా మారి అత్యంత ఘోరమైన పరిస్థితులలో దక్షిణ సరిహద్దులోని రఫా నగరంలో నివసిస్తున్నారు. రఫా నగర జనాభా మూడు లక్షలకు లోపే ఉంటుంది. దీనినిబట్టి కాందిశీకులుగా మారిన గాజా ప్రజలు ఎటువంటి జీవన పరిస్థితులలో జీవిస్తున్నారో ఊహించుకోవచ్చు.

పోలీసుల అదుపులో పూర్వర్తి

- గ్రామంలో 75 ఏళ్ల తర్వాత ఎగిరిన త్రివర్ణ పతాకం
- పూర్వర్తి క్యాంపును సందర్శించిన సుక్మా ఎస్పీ
- హిడ్మా తల్లితో ముచ్చటించిన పోలీసు అధికారి
- అందరి దృష్టి పూర్వర్తి వైపు





నవతెలంగాణ-చర్ల


మాస్టర్ మైండ్ హిడ్మా జన్మించిన సరిహద్దు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా, బహిరంగడు పోలీస్ స్టేషన్ పరిధి దండకారణ్యంలో ఉన్న పూర్వర్తిలో స్వాతంత్ర్య వచ్చిన 75 సంవత్సరాల తర్వాత త్రివర్ణ పతాకం ఆదివారం రెపరెపలాడింది. మావోయిస్టుల రాజధానిగా పిలువబడే పూర్వర్తి గ్రామంలో భద్రతా దళాలు విజయవంతంగా పోలీస్ శిబిరాన్ని ఏర్పాటు చేశాయి. ఈ ప్రాంతమంతా పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ప్రాంతం. సుమారు 27కి పైగా దాడుల్లో పాల్గొన్న హార్డ్‌కోర్ మావోయిస్టు హిడ్మా ఈ గ్రామ నివాసి. సీసీఎం హిడ్మా, బెటాలియన్ కమాండర్ దేవా సహా 100 మందికి పైగా ఈ గ్రామంలో జన్మించి మావోయిజంలోకి వచ్చారు. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున మావోయిస్టు సంస్థ ఉంది. టేకెల్‌గూడ క్యాంపులో క్యాంపు ఏర్పాటు చేసిన తర్వాత కేవలం 15 రోజులకే పూర్వర్తి గ్రామంలో క్యాంపు ఏర్పాటు చేశారు. సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్, సీఆర్పీఎఫ్ డీఆర్జీ అరవింద్ రాయ్‌తో సహా ఎస్‌టిఎఫ్, డిఆర్‌జి, సిఆర్పిఎఫ్, కోబ్రా సైనికులు 1000 మందికి పైగా ఈ శిబిరంలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పూర్వర్తిలో క్యాంపు ఏర్పాటు చేసి వ్యూహాత్మకంగా తలపెట్టి ఇక్కడి నుంచి రానున్న రోజుల్లో మావోయిస్టులపై గాలింపు చర్యలు ముమ్మరం చేస్తామన్నారు. భద్రతా దళాలచే కూల్చివేయబడిన పూర్వర్తి గ్రామంలో నిర్మించిన మావోయిస్టుల స్మారక చిహ్నం ఉంది. ఇది కాకుండా, ఇక్కడ యుద్ధ ప్రాంతాన్ని కూడా సృష్టించారు. మావోయిస్టులు ఇక్కడే ఉండి భద్రతా దళాలకు వ్యతిరేకంగా ప్రణాళికలు సిద్ధం చేసేవారు. అలాగే, మావోయిస్టులు ఇక్కడ వ్యవసాయం కూడా చేశారు. అందులో వారు తమ బెటాలియన్‌కు కూరగాయలు, పండ్లు ఇతర ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తున్నారు. అయితే ఇప్పుడు ఈ ప్రాంతం పూర్తిగా భద్రతా బలగాల ఆధీనంలో ఉంది.

చత్తీస్‌గఢ్ రాష్ట్ర అంతర్గత ప్రాంతాలలో మావోయిస్టులపై అణిచివేత వేగంగా జరుగుతోంది. ఆపరేషన్ తీవ్రతరం చేయబడింది. మావోయిస్టు బెటాలియన్ హెడ్‌గా ఉన్న పేరుమోసిన మావోయిస్టు కమాండర్ హిడ్మా స్వగ్రామంలో పోలీసులు క్యాంపును ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యాలయంగా చేస్తున్నారు. తాజా అందిన సమాచారం మేరకు భద్రతా దళాలు గత 48 గంటలుగా అక్కడ క్యాంప్ నిర్వహిస్తున్నాయి. ఈ 48 గంటల్లో, సైనికులు ఏడుసార్లు ఎన్‌కౌంటర్ చేశారు. ప్రతీకారంగా, మావోయిస్టులు తిరిగి వచ్చి పూర్వర్తి గ్రామంపై దాడి చేశారు. దీనిని కంటోన్మెంట్‌గా మార్చారు. హిడ్మా ఇంటిపై నిరంతరం నిఘా ఉంచారు. ఇటీవల చత్తీస్‌గఢ్ హోం మంత్రి విజయ్ శర్మ సిల్గర్‌ను సందర్శించారు. అక్కడ మావోయిస్టులు లొంగిపోవాలని లేదా ముఖాముఖిగా లొంగిపోవాలని విజయ్ శర్మ స్పష్టం చేశారు.

హిడ్మా తల్లితో ఎస్పీ ముచ్చట్లు

తాను స్కెచ్ వేస్తే హింస తప్ప గురి తప్పని కరుడు కట్టిన మావోయిస్టు హిడ్మా ఇంటికి సుక్మా ఎస్పీ స్వయంగా వెళ్లి ఆమెతో ముచ్చటించి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలపడం కోసం మెరుపు.

ఆందోళనను ఎదుర్కోవడం ఇలా...



మనిషికి శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. ఆందోళన, ఒత్తిడి వంటివి సహజమే అయినప్పటికీ ఆనందంగా ఉన్నప్పుడు మాత్రమే వాటిని ఎదుర్కొనే శక్తి మనలో ఉంటుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ నిపుణుల అధ్యయనం ప్రకారం ఇటీవల టీనేజర్లలో మానసిక ఆందోళన పెరుగుతోందని తేలింది. 13 నుండి 18 ఏండ్ల వయసు గల యువతీ యువకుల్లో దాదాపు మూడింట ఒక వంతు మంది యాంగ్జైటీ డిజార్డర్‌ను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఈ సమస్యతో ఎక్కువగా బాధపడుతున్నారు. ఇది టీనేజర్ల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. కాబట్టి దానిని మేనేజ్ చేసుకునేందుకు నిపుణులు కొన్ని సూచనలు ఇస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం...



కొన్ని సార్లు ఆయా పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో తెలియక, అవగాహన లేక టీనేజర్లలో ఆందోళన పెరుగుతుంది. అందుకోసం వాటిని తట్టుకోవడానికి అవసరమైన శక్తి కావాలి. కాబట్టి ఆందోళనను రేకెత్తించే కార్యక్రమాల్లో నిమగ్నమవ్వడం ద్వారా క్రమంగా మిమ్మల్ని మీరు సవాలు చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అలాగని ఒకేసారి మరీ ఎక్కువ ఛాలెంజింగ్ విషయాల జోలికి వెళ్లవద్దు. మీ కాన్ఫిడెంట్‌ను పెంపొందించుకోవడానికి సాధించగల గోల్స్ ఏర్పర్చుకోవడంలో మరింత క్లిష్టమైన పనులను అధిగమించడంలో కాస్త ఎక్కువ శ్రమించండి. ఇలాంటి యాంగ్జైటీ ప్రేరేపిత పరిస్థితులకు స్థిరంగా, కుమిలి పోకుండా ఉండటం నేర్చుకోవడం ద్వారా కాలక్రమేణా ఆందోళనను అదుపులో ఉంచుకోవడం, ఎదుర్కోవడం సులభమవుతుంది.

నలుగురితో కలిసిపోవడం

మీకు ఖాళీ సమయం దొరికినప్పుడు సరదాగా గడిపే ప్రయత్నం చేయండి. అవసరమైతే నలుగురితో కలిసి గడపడానికి ప్రయత్నం చేయండి. దీంతోపాటు యోగా, డ్యాన్స్ వంటివి మీలోని ఆందోళనను తగ్గిస్తాయి. ఒంటరిగా లేదా స్నేహితులతో కలిసి వాకింగ్ చేయడం ఆందోళనకు విరుగుడుగా పని చేస్తుంది. వివిధ ఫిజికల్ యాక్టివిటీస్‌లో పాల్గొనడం వల్ల ఒత్తిళ్ల నుంచి మీ దృష్టిని మళ్లించవచ్చు. అల్లకల్లోలమైన భావోద్వేగాలను ఇది తగ్గిస్తుంది. తక్కువ శారీరక శ్రమతో పోలిస్తే టీనేజర్లలో అధిక స్థాయి శారీరక శ్రమ చేసే వారిలో యాంగ్జైటీ లక్షణాలు కలిగించే అవకాశం తక్కువగా ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

చర్చించండి

మీ సమస్యలు లేదా ఆందోళనల గురించి అర్థం చేసుకుని, పరిష్కారం చూపగల నిపుణులు, స్నేహితులు, ఇతర వ్యక్తులతో మాట్లాడండి. తల్లిదండ్రులు మిమ్మల్ని ఇబ్బందికర పరిస్థితుల నుంచి తప్పించడంలో అందరికంటే బెటర్‌గా సహాయపడతారనేది కూడా గుర్తుంచుకోండి. అలాగే మీకు ఇష్టమైన వ్యక్తులతో మాట్లాడడం వల్ల ప్రతికూల భావోద్వేగాలను తగ్గించుకోవచ్చు. ఇది ఆందోళనను మేనేజ్ చేయడంలో సహాయపడుతుంది.

మీ గురించి మీరు తెలుసుకోండి

మీ బలాలు బలహీనతలు తెలుసుకోవడం ద్వారా మిమ్మల్ని మీరు సరిదిద్దుకోవచ్చు. దీనికోసం సెల్ఫ్ రిఫ్లెక్షన్స్‌లో పాల్గొనండి. బలహీనతలను అధిగమించడానికి, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడానికి ఇది దోహదం చేస్తుంది. ప్రతి కూల అంశాలను స్పష్టంగా గుర్తించడం, నివారించడం అనేది స్వీయ-అభివృద్ధి కోసం అవసరమైన గోల్స్ సెట్ చేసుకోవడంలో అద్భుతంగా పని చేస్తుంది.

సమతుల్య జీవనశైలి

క్రమం తప్పకుండా ఫిజికల్ యాక్టివిటీ, తగినంత నిద్ర కలిగి ఉండటం, అలాగే విటమిన్లు, మినరల్స్‌తో కూడిన ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడం టీనేజర్లలోని ఆందోళనలను తగ్గిస్తాయి. మత్తుపదార్థాలు, పానీయాలకు దూరంగా ఉండండి. ఎందుకంటే ఇవి ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి.

సహాయం తీసుకోండి



ఆందోళన చెందుతున్నప్పుడు మీరు ఆ పరిస్థితి నుంచి బయట పడేందుకు ఇతరుల హెల్ప్ అడగడంలో తప్పులేదు. పరిస్థితులు విపరీతంగా మారుతున్నాయని మీరు భావిస్తే, మీ స్నేహితులను, నిపుణులను, కొలిగ్స్‌ను హెల్ప్ కోసం సంప్రదించవచ్చు. మన సమాజంలో మానసిక ఆరోగ్యంపై సరైన అవగాహన లేదు. దాంతో ఈ విషయంలో సహాయం అడగటం కూడాయిక కొన్ని సార్లు అవమానంగా భావిస్తున్నారు. ఈ ఆలోచన తప్పు. టీనేజర్స్ ఆందోళనను ఎదుర్కోవడంలో ఇతరుల సపోర్టును తప్పక కోరవచ్చు. మెరుగైన భవిష్యత్తుకోసం ఆందోళనను ముందుగానే గుర్తించడం, పరిష్కరించుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే ఇది మానసిక సమస్యలకు దారితీసే అవకాశం ఉంది.

ఆసక్తికలిగించే వాటిలో...

ఎప్పుడూ ఆందోళన కలిగించే విషయాలే ఆలోచించడం వల్ల ఇబ్బంది పడతారు. ముఖ్యంగా రాబోయే పరీ క్షలు, ప్రెజెంటేషన్‌లు లేదా ముఖ్యమైన సమావేశాలు వంటివి మీలో కాస్త ఆందోళన కలిగించేవిగా ఉండవచ్చు. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి అంతకు ముందు మీకు ఆనందాన్ని ఇచ్చే, ఆసక్తికలిగించే కార్యక్రమాల్లో కూడా పాల్గొనండి. ఫ్రెండ్స్‌తో కలవడం, మీకు నచ్చే వీడియోలు, కామెడీ సిరీస్ చూడటం, ఇష్టమైన సంగీతం వినడం వంటివి చేయండి.


ఈ రోజుల్లో డార్క్ సర్కిల్స్ (కండ్ల కింద నల్లటి వలయాలు) తో బాధపడే వారు చాలా మందే ఉన్నారు. అసలు ఈ కండ్ల చుట్టూ ఏర్పడే నల్లటి వలయాలకు కారణాలనేకం. ఒక్కొక్కరికి ఒక్కో పరిస్థితి వల్ల ఇవి ఏర్పడుతుంటాయి. అందులో మొదటి కారణం అలసట. కండ్లు ఎక్కువగా శ్రమిస్తే అలసట ఏర్పడుతుంది. ఫలితంగా ఈ వలయాలు ఏర్పడతాయి. ఎక్కువ సేపు ఫోన్ చూడటం, కంప్యూటర్ ఎక్కువగా వాడటం, రాత్రిళ్లు మెలకువగా ఉండటం, సరిగా నిద్రపోకపోవడం, అతిగా ఆలోచించి స్ట్రైన్ అవ్వడం వంటి కారణాలన్నీ అలసటకు కారణమవడంతో పాటు, డార్క్ సర్కిల్స్ ఏర్పడతాయి. ఇవి పెద్ద సమస్యేమి కానప్పటికీ అందాన్ని పాడుచేస్తాయి. ఇవి ఏర్పడేందుకు కారణాలు, వాటి నివారణకు ఏమేం చేయాలో తెలుసుకుందాం.

డార్క్ సర్కిల్స్ తగ్గాలటే...

- రక్తనాళాలను ప్రభావితం చేసే రక్తహీనత, థైరాయిడ్ సమస్యల కారణంగా ఈ డార్క్ సర్కిల్స్ వస్తాయి.
- డీహైడ్రేషన్ వల్ల కూడా ఈ సమస్య ఏర్పడుతుంది. ఈ డార్క్ సర్కిల్స్ కారణంగా చర్మం నల్లగా మారుతుంది.
- సూర్యరశ్మి కారణంగా దీని వల్ల చర్మం గోధుమ, నల్లగా మారుతుంది. ముదురు రంగు చర్మం ఉన్నవారికి హైపర్ పిగ్మంటేషన్, చర్మం మెలనిన్‌ని ఉత్పత్తి చేస్తుంది.
- కళ్ళ చుట్టూ నల్లని వలయాలు ఏర్పడటానికి మెలనిన్ ముఖ్య పాత్ర పోషిస్తుంది. సూర్యరశ్మి, హైపర్ పిగ్మంటేషన్, కొన్ని మెడిసిన్ కూడా డార్క్ సర్కిల్స్ కారణం కావొచ్చు.
- గ్లకోమా ట్రీట్‌మెంట్‌కి కొన్ని కంటి హైపోటెన్సివ్ మెడిసిన్, లాటానోప్రోస్ట్, బైమాటోప్రోస్ట్ వంటివి కూడా కళ్ళ చుట్టూ నల్లని రంగు పెరగడానికి కారణమవుతుంది.
- కెఫిన్, ఆల్కహాల్ వంటివి కూడా డార్క్ సర్కిల్స్‌కు కారణాలే.
- పడుకునే ముందు టీవీ, ఫోన్ వంటి స్క్రీన్స్ చూడడం వల్ల సమస్య పెరుగుతుంది.

నివారణకు...

- అన్నింటిలో మొదటిది, నల్లని వలయాలని తగ్గించేం దుకు బాగా నిద్ర పోవాలి. దీని వల్ల బాడీ, మనసుకి మంచిది.
- ఎండలో బయటికి వెళ్ళేటప్పుడు సన్‌స్క్రీన్ రాస్తుండాలి. ఇది హానికరమైన యూవి కిరణాల నుండి కళ్ళ చుట్టూ ఉన్న సున్నితమైన చర్మాన్ని రక్షిస్తుంది. తద్వారా సన్ డ్యామేజ్, అకాల వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. ఎండలో బయటకు వెళ్లేపుడు సన్ గ్లాసెస్ ఉపయోగిస్తే, అదనపు రక్షణను అందిస్తాయి.



- కీర దోసకాయ ముక్కల్ని కళ్ళపై పెట్టి 10 నిమిషాలు పెట్టాలి. ఈ దోసకాయ ముక్కల కారణంగా కళ్లకు ఒత్తిడి తగ్గి, రక్త నాళాలను చల్లగా చేసి రిఫ్రెష్‌గా ఉంచుతుంది.

ఈ సమస్యని ఇంటి చిట్కాలతో పూర్తిగా తగ్గించలేం. లేజర్ థెరపీ కారణంగా ఈ సమస్య తగ్గుతుంది. ఫిల్లర్స్, హైలురోనిక్ యాసిడ్, ఇంజెక్షన్స్‌తో ముడతలు తగ్గుతాయి. బ్లెఫరోప్లాస్టీ, సర్జరీలు, కనురెప్పల నుండి అదనపు చర్మం, కొవ్వు, కండరాలను తగ్గిస్తుంది. ఇది చర్మాన్ని యవ్వనంగా తాజాదనాన్ని అందిస్తుంది.

బంద్, సమ్మెలో 20 కోట్ల మంది

న్యూఢిల్లీ : జార్ఖండ్‌లోని రాంచీ నుంచి మహారాష్ట్రలోని ధూలే వరకు, ఒడిశాలోని రూర్కెలా నుంచి తమిళనాడులోని తూత్తుకుడి వరకు, సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక చేపట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలు రోజువారీ జీవనంపై స్పష్టమైన ప్రభావాన్ని చూపాయి. ప్రజలు, రైతులు, కార్మికులు దుకాణాలు, మండీలు, ఫ్యాక్టరీలను మూసివేశారు. రోడ్లు, రైల్వే ట్రాక్‌లు, హైవేలను దిగ్బంధించారు. స్వామినాథన్ కమిషన్ ఫార్ములా ప్రకారం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కోసం, అన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి ఒకేసారి రుణమాఫీ, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయటం, లఖింపూర్ ఖేరీ ఊచకోతలో తన కుమారుడు ఆశిష్ మిశ్రాను కేంద్ర మంత్రివర్గం నుంచి రక్షించిన అజయ్ మిశ్రాను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చింది. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనీ, ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనేలా రూ.26 వేలను కార్మికులకు కనీస వేతనంగా నిర్ణయించాలని కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూ) ఇందులో పాల్గొన్నాయి. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో సహా కేరళ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, యూపీ, అసోం, హర్యానా, పంజాబ్, గుజరాత్‌లలో పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. ఎర్ర జెండాలతో కార్మికులు 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'ప్రయివేటీకరణ వద్దు', రైతులందరికీ ఎంఎస్‌పీ ఇవ్వండి' అంటూ నినాదాలు చేశారు. ఫిబ్రవరి 16న పరీక్షల షెడ్యూల్ కారణంగా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన రైతులు, కార్మికులు ఫిబ్రవరి 13న చట్ట ఉల్లంఘన కార్యక్రమాన్ని, గ్రామీణ బంద్‌ను పాటించారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ మాట్లాడుతూ.. 20 కోట్ల మంది ప్రజలు సామూహిక కార్యాచరణలో పాల్గొంటారని నాయకులు ఆశిస్తున్నారనీ, భారత స్వతంత్రానంతర చరిత్రలో ఇదే మొదటిసారి అని చెప్పారు.

ఇకపై వడ్డీ లేని డ్వాక్రా రుణాలు

(మొదటిపేజీ తరువాయి)

కోరిన డిమాండ్‌లలో ప్రధానమైన అంశం అంగన్వాడీ, తదితర స్కీమ్ వర్కర్లకు ప్రతినెలా 1వతేదీన జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపడతామని భట్టి హామీ ఇచ్చారు. అలాగే, బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని తెలిపారు. గత పదేండ్లుగా రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందటం లేదని, ఇందిరమ్మ రాజ్యం ఏర్పడ్డాక గతంలో హామీ ఇచ్చిన విధంగా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని,కార్యచరణను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళా సాధికారికతకై మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

గిరిజనంలో వెలుగులు నింపుతాం

- విద్యా, వైద్యం, ఉపాధికి ప్రణాళికలు
- భద్రాద్రి ఐటీడీఏ పాలకవర్గ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కరకట్ట మరమ్మతులకు ప్రణాళికలు : తుమ్మల
- గిరిజన గ్రామాల్లో రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలి : కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లంకి దక్కని ప్రొటోకాల్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గిరిజన కుటుంబాలకు మేలు జరిగే విధంగా విద్యా, వైద్యం, ఉపాధి ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఐటీడీఏ పాలకవర్గ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టితోపాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రెసిడెన్షియల్ ఆశ్రమ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పదిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఉన్నత చదువులకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. గిరిజన గ్రామాల్లో వైద్య సదుపాయాలు మెరుగుపరిచేందుకు 100 పడకల ఆస్పత్రి నుంచి పీహెచ్‌సీ వరకు అంబులెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. పీహెచ్‌సీల్లో సరిపడా సిబ్బంది లేకపోతే స్థానిక యువతను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవాలని సూచించారు. పాలకమండలిలో చేసిన ప్రతి నిర్ణయాన్ని తూచా తప్పకుండా అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు.

మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. భద్రాచలం ఏజెన్సీని గోదారి వరదల నుంచి కాపాడేలా కరకట్ట మరమ్మతులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. భద్రాచలం రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఐటీడీఏ నుంచి వచ్చే ప్రతి రూపాయి గిరిజన అభివృద్ధికి ఖర్చు చేయాలని ఆయన కోరారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన గిరిజన యువతకి ఉపాధి అవకాశాలు చూపించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో రోడ్డు విస్తరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. మూడు నెలలకు ఒకసారి జరగాల్సిన ఐటీడీఏ పాలకమండలి సమావేశాలు ఏండ్ల తరబడి జరగటం లేదని, కొత్త ప్రభుత్వంలోనైనా కచ్చితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన గ్రామాల్లో అనేక సమస్యలు తిష్ట వేశాయని, వాటి పరిష్కారానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

భద్రాచలం ఎమ్మెల్యేకు దక్కని ప్రొటోకాల్

ఆదివారం భద్రాచలంలో జరిగిన ఐటీడీఏ పాలకమండలి సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకటరావుకి ప్రొటోకాల్ దక్కలేదు. ఈ సమావేశానికి స్థానిక శాసనసభ్యుడే అధ్యక్షత వహించాల్సి ఉండగా అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కనీసం వేదిక మీదకే ఆహ్వానించకపోవడం పట్ల బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ అనే కారణంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు అధ్యక్షత వహించే అవకాశాన్ని ప్రభుత్వ పెద్దలు కల్పించలేదని ఆరోపించారు. సమావేశంలో ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, తెల్లం వెంకటరావు, ఎమ్మెల్సీ తాతా మధు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక అలా, ఓఎస్‌డీ కృష్ణ భాస్కర్, భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులు పాల్గొన్నారు.

జార్ఖండ్‌లోనూ కులగణన

(మొదటిపేజీ తరువాయి)

ఓ అధికారి తెలిపారు. 'జనాభా ఎక్కువగా ఉంటే వాటా అధికంగా వస్తుంది. బీహార్ సిద్ధంగా ఉంది' అంటూ సొరేన్ అంతకుముందు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. బీహార్ తరహాలోనే జార్ఖండ్‌లో కూడా కులగణన నిర్వహిస్తారు. బీహార్‌లో గత సంవత్సరం జనవరి 7వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ సమాచార సేకరణ జరిగింది.

సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

స్పందించడం ఇదే మొదటిసారి. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకాన్ని ఉపయోగించుకొని వివిధ రాజకీయ పార్టీలకు విరాళాలు అందించిన దాతల పేర్లు బయటపెట్టాలని ఎస్‌బీఐని న్యాయస్థానం ఆదేశించింది. పథకాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ కానీ, ప్రధాని కార్యాలయం కానీ కోర్టు తీర్పుపై ఇప్పటి వరకూ స్పందించలేదు.

'పారదర్శకంగా వ్యవహరిస్తామని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాము. ఇప్పుడు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ చెప్పారు. కాగా కోర్టు తీర్పును పరిశీలిస్తున్నామని, దానిని సవాలు చేయాలా వద్దా అనే విషయంపై ఓ నిర్ణయం తీసుకుంటామని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ తెలిపారు. అయితే కేంద్రప్రభుత్వం దీన్ని సవాలు చేయాలా..లేదా అని ఆలోచిస్తున్నది. మరోవైపు ఎస్బీఐ, ఆర్థికమంత్రిత్వశాఖ ఇప్పటిదాకా నోరువిప్పలేదు.

21న నల్లజెండాలతో నిరసన

(మొదటిపేజీ తరువాయి)

10 గంటలకు నిరసన ప్రారంభమై ఫిబ్రవరి 22 సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని తెలిపింది. ఎలక్టోరల్ బాండ్లతో అవినీతిని చట్టబద్ధం చేసి వేల కోట్ల రూపాయలను పార్టీ ఫండ్‌గా పోగు చేయడాన్ని మోడీ ప్రభుత్వం తీవ్రంగా ఎస్కేఎం ఖండించింది. దీనిని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎస్కేఎం స్వాగతించింది.

ఔటర్ సమీపంలో పారిశ్రామిక సిటీ

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. ఈ ప్రణాళికలపై తమకు పూర్తి స్పష్టత ఉన్నదన్నారు. మెట్రోరైల్‌ను ప్రజలకు మరింత ఉపయోగపడేలా విస్తరణ చేపడతామని చెప్పారు. ఫార్మా సిటీలు కాకుండా, ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఎలాంటి అపోహలు వద్దనీ, తమకు తామే మేధావులమని భావించబోమనీ, అనుభవజ్ఞులు, నిపుణుల సలహాలతో ముందుకెళతామని అన్నారు. దానికోసం ఆలోచించి భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకుంటామన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తే ఎవర్నీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపకశాఖ సేవల్ని ఆయన కొనియాడారు. ప్రమాదం జరిగినప్పుడు అందరికంటే ముందుండేది ఫైర్ డిపార్ట్ మెంటే అనీ, ప్రజల రక్షణ కోసం ఫైర్ సిబ్బంది ప్రాణాలకు తెగించి పోరాడుతారని ప్రసంసించారు.

ఫోటో జర్నలిస్ట్ కష్ణ పై దాడికి ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫోటో జర్నలిస్ట్ కృష్ణ పై దాడి చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అనుమల్ల గంగాధర్, కే.ఎస్.హరి ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం సిద్ధం బహిరంగ సభలో ఫోటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల దాడి చేశారని తెలిపారు.ఫోటోగ్రాఫర్‌పై దాడి చేయడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ఫొటో జర్నలిస్టులు తమ వృత్తి ధర్మంలో భాగంగా రాజకీయ బహిరంగ సభల్లో పాల్గొంటుంటారని గుర్తుచేశారు. దానిని రాజకీయ కోణంలో చూడడం సరికాదని వారు హితవు పలికారు.

కేసీఆర్ ఇలాకపై నజర్

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన రాజకీయ పార్టీలు పరిభ్రమిస్తున్నాయి. మెదక్ మెర్లమెంట్ నియోజకవర్గం పరిధిలో సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, మెదక్, గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీలు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంపై కేంద్రీకరించాయి. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి 3,16,427 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిపై గెలిచారు. గతంలోనూ కేసీఆర్, విజయశాంతి, ఆలె నరేందర్ సైతం గులాబీ పార్టీ నుంచి మెదక్ ఎంపీగా గెలిచారు. మెదక్ ప్రాంతం గులాబీ పార్టీకి మొదటి నుంచి కంచుకోటగా ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపాలై అధికారం కోల్పోయింది. అయినా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను ఆరు చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలిచారు.

మెదక్‌పై కేంద్రీకరించిన కాంగ్రెస్

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను ఆరు చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలవగా, కాంగ్రెస్ కేవలం మెదక్ అసెంబ్లీ స్థానం దక్కించుకుంది. ఆ చేదు ఫలితాలను సమీక్షించుకున్న కాంగ్రెస్ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తన సత్తా చాటాలని చూస్తుంది. మామా అల్లుళ్ల ఎత్తుల్ని చిత్తు చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి పై ఎత్తులు వేస్తున్నారు. మెదక్ ఎంపీ నియోకజవర్గంలో బలమైన అభ్యర్థిని పోటీ చేయించాలని చూస్తున్నారు. ఇటీవల ఎంపీ టికెట్ల కోసం దరఖాస్తుల్ని స్వీకరించినప్పటికీ పార్టీ మాత్రం బీఆర్ఎస్‌ను ఓడించే శక్తి సామర్థ్యాలున్న నాయకుడ్ని బరిలో దించాలనుకుంటుంది. అందులో భాగంగానే మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును రంగంలోకి దించారు. హనుమంతరావు సిద్దిపేటలో మకాం వేసి భారీ సమావేశం నిర్వహించి కాంగ్రెస్ శ్రేణులకు బూస్టింగ్ ఇచ్చారు. కొడుకు మైనంపల్లి రోహిత్‌రావు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మెదక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. హనుమంతరావు సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్‌లో పట్టు సాధించేలా ఆయన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన పాత వాళ్లందర్ని తిరిగి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ వైపు మొగ్గ చూపుతున్నారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ ఓడిపోయినందున అక్కడ బలపడేందుకు ముదిరాజ్ సామాజిక తరగతిలో పట్టున్న నీలం మధును ఇటీవల కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే 40 వేలకు పైగా ఓట్లు వచ్చాయి. నర్సాపూర్, పటాన్‌చెరు ఎమ్మెల్యే అక్రమ ఆస్తులపై దృష్టి పెట్టి వాళ్ళ సైతం బేరసారాలకు వచ్చేలా చేస్తున్నారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఓడిపోయినా క్రియాశీల రాజకీయాల్లో యాక్టీవ్‌గా ఉంటున్నారు. ఆయన సతీమణి ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేశారు. మైనంపల్లి హనుమంతరావును పోటీ చేయించడం ద్వారా కేసీఆర్, హరీశ్‌రావు ఎత్తుల్ని ఎదుర్కొగలడనే చర్చ నడుస్తుంది.

పట్టు సడలకుండా బీఆర్ఎస్ జాగ్రత్తలు

మెదక్ ఎంపీ సీటును వరుసగా గెలుస్తూ వస్తున్న బీఆర్ఎస్ తన పట్టు సడలకుండా జాగ్రత్త పడుతుంది. ఆరుగురు ఎమ్మెల్యేల్లో కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, దుబ్బాక ఎమ్మెల్యేలు యాక్టీవ్‌గా కదులుతున్నారు. నియోజకవర్గంలో పర్యటిస్తూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీల వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోకజవర్గాల్లో కలిపి బీఆర్ఎస్‌కు 2.16 లక్షల ఓట్లు ఆధిక్యం వచ్చింది. అదే బలాన్ని తిరిగి ప్రదర్శించడం ద్వారా మెదక్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని గులాబీ నేతలు బావిస్తున్నారు. కేసీఆర్ పుట్టిన రోజును మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పండుగ మాదిరి నిర్వహించి క్యాడర్‌లో జోష్ పెంచే ప్రయత్నం చేశారు. కార్యకర్తలు, నాయకులతో కేసీఆర్ ప్రత్యేకంగా మాట్లాడుతూ ధైర్యం నింపారు. ఎంపీ అభ్యర్థులుగా ఉద్యమకారులు ఆర్.సత్యనారాయణ, బీరయ్య యాదవ్ దరఖాస్తు చేశారు. వంటేరు ప్రతాపరెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉంది. కాంగ్రెస్‌ను ఎదుర్కొని గెలిచేందుకు ఆర్థిక పరిపుష్టి ఉన్న ఎమ్మెల్సీ వెంకటరామిరెడ్డి పేరు బలంగా వినిపిస్తుంది. వీళ్ల కంటే నేరుగా గులాబీ బాస్ కేసీఆర్ మెదక్ బరిలో దిగే అవకాశాల్లేకపోలేదనే చర్చా ఉంది. దేశ రాజకీయాల్లో యాక్టీవ్ అయ్యేందుకు వీలుగా మెదక్ ఎంపీగా పోటీ చేస్తారంటున్నారు.

మనోళ్లు బంగారం

• మహిళల జట్టుకు పసిడి పతకం • ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్

షా ఆలమ్ (మలేషియా) : భారత బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర. మన అమ్మాయిలు సరికొత్త చరిత్ర సృష్టించారు. ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం కొల్లగొట్టారు. అగ్రజట్లు చైనా, జపాన్, థాయ్‌లాండ్, మలేషియా పోటీపడే ఈవెంట్‌లో భారత అమ్మాయిలకు ఇప్పటివరకు ఒక్క మెడల్ దక్కలేదు. కానీ తాజా ఈవెంట్‌లో యువ షట్లర్లు చరిత్ర తిరగరాశారు. ఆదివారం జరిగిన ఫైనల్లో థాయ్‌లాండ్‌పై 3-2తో ఉద్విగ్న విజయం సాధించారు. ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు చారిత్రక పసిడి పతకం అందించారు. తొలి సింగిల్స్‌లో పి.వి సింధు 21-12, 21-12తో సుపనిదపై వరుస గేముల్లో గెలుపొంది శుభారంభం చేయగా.. తొలి డబుల్స్‌లో ట్రెసా జాలి, గాయత్రి పుల్లెల సైతం విజయం సాధించారు. 21-16, 18-21, 21-16తో మూడు గేముల మ్యాచ్‌లో పైచేయి సాధించారు. దీంతో భారత్ 2-0తో పసిడికి అడుగు దూరంలో నిలిచింది. కానీ రెండో సింగిల్స్‌లో అష్మిత చాలిహ 11-21, 14-21తో, రెండో డబుల్స్‌లో ప్రియ, శృతి మిశ్రా 11-21, 9-21తో పరాజయం పాలయ్యారు. నిర్ణయాత్మక ఐదో గేమ్ ముంగిట భారత్, థాయ్‌లాండ్ 2-2తో సమవుజ్జీలుగా నిలిచారు.



అన్మోల్ అదుర్స్ : వరల్డ్ నం.472 అన్మోల్ కార్బ్ మళ్లీ అద్భుతం చేసింది. వరల్డ్ నం.45 చోకీవాంగ్‌పై సంచలన విజయం నమోదు చేసింది. ఎటువంటి అంచనాలు లేకుండా ఆసియా చాంపియన్‌షిప్స్‌కు వచ్చిన అన్మోల్.. వరుస విజయాలతో అందరి దృష్టిని తనవైపునకు తిప్పుకుంది. 21-14, 21-9తో థాయ్‌లాండ్ షట్లర్‌ను చిత్తు చేసిన అన్మోల్ వరుస గేముల్లోనే నిర్ణయాత్మక మ్యాచ్‌ను భారత్ వశం చేసింది. అన్మోల్ విజయంతో 3-2తో భారత్ పసిడి పతకం సొంతం చేసుకుంది. భారత్ కంటే మెరుగైన ర్యాంక్ షట్లర్లతో బరిలోకి దిగిన థాయ్‌లాండ్ సిల్వర్ మెడల్‌తో సరిపెట్టుకుంది.

నితీశ్, ప్రజ్ఞయ్ సెంచరీలు

రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ ఫైనల్

హైదరాబాద్ : నితీశ్ రెడ్డి (122, 194 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లు), వికెట్ కీపర్ ప్రజ్ఞయ్ రెడ్డి (102 నాటౌట్, 141 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో మెరువగా.. కెప్టెన్ తిలక్ వర్మ (44, 73 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. దీంతో మేఘాలయతో రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్ ఫైనల్లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 87.5 ఓవర్లలో 350 పరుగులు చేసింది. మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 304 పరుగులే చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 0/1తో ఎదురీదుతోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగుల వెనుకంజలో నిలిచింది.

ఇంగ్లాండ్‌ను మడతపెట్టి..!

రాజ్‘కోట’ మన సొంతమైంది. కీలక మూడో టెస్టులో ఆతిథ్య భారత్ అఖండ విజయం సాధించింది. పరుగుల పరంగా టెస్టుల్లో అత్యుత్తమ విజయాన్ని నమోదు చేసింది. 557 పరుగుల రికార్డు ఛేదనలో ఇంగ్లాండ్ 122 పరుగులకే కుప్పకూలింది. లోకల్ బాయ్ రవీంద్ర జడేజా (5/41) ఐదు వికెట్ల మాయాజాలంతో ఇంగ్లాండ్‌ను తిప్పేశాడు. 434 పరుగుల తేడాతో భారత్ మూడో టెస్టులో అఖండ విజయం అందుకుంది. ఈ విజయంతో ఐదు మ్యాచుల టెస్టు సిరీస్‌లో 2-1తో ముందంజలోకి దూసుకెళ్లింది.

యువ కెరటం యశస్వి జైస్వాల్ (214 నాటౌట్) అజేయ ద్వి శతకంతో చెలరేగాడు. విశాఖలో కెరీర్ తొలి డబుల్ సెంచరీ బాదిన జైస్వాల్.. రాజ్‌కోట్‌లోనూ భారీ ఇన్నింగ్స్ నమోదు చేశాడు. శుభ్‌మన్ గిల్ (91)కు తోడు అరంగ్రేట ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్ (68 నాటౌట్) మెరవటంతో ఇంగ్లాండ్ ముందు భారత్ భారీ లక్ష్యాన్ని ఉంచింది. భారత్, ఇంగ్లాండ్ నాల్గో టెస్టు రాంచిలో శుక్రవారం నుంచి ఆరంభం కానుంది.



• 434 పరుగులతో భారత్ అఖండ విజయం • ఛేదనలో ఇంగ్లాండ్ 122 ఆలౌట్
• యశస్వి జైస్వాల్ అజేయ ద్వి శతకం • రవీంద్ర జడేజా ఐదు వికెట్ల మాయాజాలం

నవతెలంగాణ-రాజ్‌కోట్

రాజ్‌కోట్‌లో ఆతిథ్య భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసింది. తొలి రెండు టెస్టుల్లో భారత్‌కు గట్టి పోటీ ఇచ్చిన ఇంగ్లాండ్‌ను మూడో టెస్టులో చిత్తు చేసింది. రికార్డు 434 పరుగుల తేడాతో రాజ్‌కోట్ టెస్టులో టీమ్ ఇండియా విజయభేరి మోగించింది. 557 పరుగుల ఛేదనలో ఇంగ్లాండ్ 39.4 ఓవర్లలో 122 పరుగులకే కుప్పకూలింది. లోకల్ హీరో రవీంద్ర జడేజా (5/41) ఐదు వికెట్ల మాయాజాలానికి కుల్దీప్ యాదవ్ (2/19), అశ్విన్ (1/19), బుమ్రా (1/18) జత కలిశారు. దీంతో మూడో టెస్టు సైతం నాలుగు రోజుల్లోనే ముగిసింది. ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్ భారత బౌలర్లకు దాసోహం అవగా.. టెయిలెండర్లు మార్క్‌వుడ్ (33, 15 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), టామ్ హర్ట్లీ (16, 36 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఇంగ్లాండ్‌కు గౌరవప్రద మూడంకెల స్కోరు అందించారు. అంతకముందు, భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 430/4 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (214 నాటౌట్, 236 బంతుల్లో 14 ఫోర్లు, 12 సిక్స్‌లు) అజేయ ద్వి శతకం బాదగా.. సర్ఫరాజ్ ఖాన్ (68 నాటౌట్, 72 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్థ సెంచరీతో చెలరేగాడు. శుభ్‌మన్ గిల్ (91, 151 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీతో మెరువగా 98 ఓవర్లలో 430 పరుగుల వద్ద భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ప్రకటించింది. తొలి ఇన్నింగ్స్‌లో శతకం బాదిన రవీంద్ర జడేజా.. బంతితో ఏడు వికెట్లు పడగొట్టి ‘మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు అందుకున్నాడు. రాజ్‌కోట్ టెస్టులో విజయంతో సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యం సాధించింది.

ఇంగ్లాండ్‌ను తిప్పేశారు

ఇంగ్లాండ్ లక్ష్యం రికార్డు 557 పరుగులు. ఎటువంటి బ్యాటింగ్ లైనప్ అయినా.. ఈ లక్ష్యాన్ని ఛేదించటం కష్టసాధ్యమే. కానీ ఇంగ్లాండ్ బజ్‌బాల్ దూకుడుతో కనీసం రేసులో నిలుస్తుందనే అంచనాలు ఉన్నాయి. కానీ భారత బౌలర్లు మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు. టీ విరామానికి ముందు 8.2 ఓవర్లలోనే ఓపెనర్లు ఇద్దరినీ పెవిలియన్‌కు పంపించారు. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో బెన్ డకెట్ (4) రనౌట్‌గా నిష్క్రమించాడు. క్రాలీ సిగ్నల్ ఇవ్వకుండానే సగం దూరం వెళ్లిన డకెట్.. తిరిగి క్రీజులోకి వచ్చేలోగా సిరాజ్ సూపర్ ఫీల్డింగ్‌తో వికెట్లను జురెల్ పడగొట్టాడు. జాక్ క్రాలీ (11)ని ఎల్బీగా బుమ్రా సాగనంపాడు. దీంతో 18/2 పరుగులకే ఇంగ్లాండ్ ఓపెనర్లను కోల్పోయింది. ఇక చివరి సెషన్లో ఇంగ్లాండ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఒలీ పోప్ (3), జో రూట్ (7), జానీ బెయిర్‌స్టో (4), బెన్ ఫోక్స్ (16) సహా మార్క్‌వుడ్ (33)ను రవీంద్ర జడేజా మాయ చేశాడు. జడేజా మాయకు ఇంగ్లాండ్ ఓ దశలో 50/7తో దీన స్థితిలో నిలిచింది. కానీ టెయిలెండర్లు వేగంగా పరుగులు సాధించి ఆ జట్టును 100 పరుగుల మార్క్ దాటించగలిగారు. కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీసుకోగా.. కుటుంబ వైద్య అత్యవసర పరిస్థితితో రెండు రోజుల ఆటకు దూరంగా ఉన్న రవిచంద్రన్ అశ్విన్ నాల్గో రోజు బంతి అందుకున్నాడు. టామ్ హర్ట్లీ (16)ని అవుట్ చేసి కెరీర్ 501వ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. ఐదో రోజుకు వెళ్లొదనుకున్న టెస్టు మ్యాచ్.. భారత బౌలర్ల దూకుడుతో నాలుగు రోజుల్లోనే ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో 71.1 ఓవర్లలో 319 పరుగులు చేసిన ఇంగ్లాండ్.. రెండో ఇన్నింగ్స్‌లో 39.4 ఓవర్లలో 122 పరుగులకే చేతులెత్తేసింది.

12 ద్వి శతక ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ కొట్టిన సిక్సర్లు 12. ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో నవజ్యోత్ సింగ్ సిద్ధూ బాదిన 8 సిక్సర్లే ఓ భారత బ్యాటర్‌కు ఇప్పటివరకు అత్యధికం. రాజ్‌కోట్‌లో జైస్వాల్ ఆ రికార్డును బద్దలుకొట్టాడు.

434 మూడో టెస్టులో భారత్ గెలుపు అంతరం 434 పరుగులు. గతంలో న్యూజిలాండ్‌పై 372 పరుగులే విజయమే అత్యుత్తమం. పరుగుల పరంగా ఇప్పుడు రాజ్‌కోట్‌లో ఇంగ్లాండ్‌పై సాధించిన విజయం అగ్రస్థానంలో నిలిచింది.

‘ద్వి శతక’ జైస్వాల్

యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (214 నాటౌట్) ద్వి శతకంతో చెలరేగాడు. విశాఖ టెస్టులోనూ డబుల్ సెంచరీ బాదిన జైస్వాల్.. రాజ్‌కోట్‌లోనూ జోరు కొనసాగించాడు. వెన్నునొప్పితో మూడో రోజు ఆఖర్లో రిటైర్డ్ హర్ట్‌గా వైదొలిగిన యశస్వి.. నాల్గో రోజు ఉదయం సెషన్లోనే క్రీజులోకి వచ్చాడు. సర్ఫరాజ్ ఖాన్ (68 నాటౌట్) జతగా 184 పరుగులు జోడించాడు. 11 ఫోర్లు, 7 సిక్సర్లతో 150 పరుగుల మార్క్ చేరుకున్న జైస్వాల్.. ద్వి శతకాన్ని 14 ఫోర్లు, 10 సిక్సర్లతో 231 బంతుల్లోనే పూర్తి చేశాడు. మరోవైపు సర్ఫరాజ్ ఖాన్ అరంగ్రేట టెస్టులో వరుసగా రెండో అర్థ సెంచరీ సాధించాడు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 65 బంతుల్లో అర్థ సెంచరీ బాదాడు. టాప్ ఆర్డర్‌లో కీలక ఇన్నింగ్స్ నమోదు చేసిన శుభ్‌మన్ గిల్.. సెంచరీ ముంగిట వికెట్ చేజార్చుకున్నాడు. నైట్‌వాచ్‌మన్ కుల్దీప్ యాదవ్ (27) సైతం ఆకట్టుకున్నాడు. దీంతో 90 ఓవర్లలో 4 వికెట్లకు 430 పరుగులు చేసిన భారత్.. 556 పరుగుల ఆధిక్యంతో ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ఇచ్చింది. ఇంగ్లాండ్ బౌలర్లలో టామ్ హర్ట్లీ, జో రూట్, రెహాన్ అహ్మద్ తలా ఓ వికెట్ పడగొట్టారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : 445/10

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : 319/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ నాటౌట్ 214, రోహిత్ శర్మ (ఎల్బీ) రూట్ 19, శుభ్‌మన్ గిల్ (రనౌట్) 91, రజత్ పటీదార్ (సి) రెహాన్ (బి) హర్ట్లీ 0, కుల్దీప్ యాదవ్ (సి) రూట్ (బి) రెహాన్ 27, సర్ఫరాజ్ ఖాన్ నాటౌట్ 68, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (98 ఓవర్లలో 4 వికెట్లకు) 430 డిక్లేర్డ్.**

వికెట్ల పతనం : 1-30, 2-191, 3-246, 4-258.

బౌలింగ్ : అండర్సన్ 13-1-78-0, జో రూట్ 27-3-111-1, టామ్ హర్ట్లీ 23-2-78-1, మార్క్‌వుడ్ 10-0-46-0, రెహాన్ అహ్మద్ 25-1-108-1.

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ : జాక్ క్రాలీ (ఎల్బీ) బుమ్రా 11, బెన్ డకెట్ (రనౌట్) 4, ఒలీ పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 3, జో రూట్ (ఎల్బీ) జడేజా 7, జానీ బెయిర్‌స్టో (ఎల్బీ) జడేజా 4, బెన్ స్టోక్స్ (ఎల్బీ) కుల్దీప్ 15, బెన్ ఫోక్స్ (సి) ధ్రువ్ (బి) జడేజా 16, రెహాన్ అహ్మద్ (సి) సిరాజ్ (బి) కుల్దీప్ 0, హర్ట్లీ (బి) అశ్విన్ 16, మార్క్‌వుడ్ (సి) జైస్వాల్ (బి) జడేజా 33, అండర్సన్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 12, **మొత్తం : (39.4 ఓవర్లలో ఆలౌట్) 122.**

వికెట్ల పతనం : 1-15, 2-18, 3-20, 4-28, 5-50, 6-50, 7-50, 8-82, 9-91, 10-122.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 8-1-18-1, మహ్మద్ సిరాజ్ 5-2-16-0, రవీంద్ర జడేజా 12.4-4-41-5, కుల్దీప్ యాదవ్ 8-2-19-2, రవిచంద్రన్ అశ్విన్ 6-3-19-1.



రూ.100 కోట్లతో కొత్త స్టేడియం!

హెచ్‌సీఏ ఏజీఎంలో ఏకగ్రీవ తీర్మానం



హైదరాబాద్ : రూ.100 కోట్లతో కొత్త స్టేడియం నిర్మాణానికి హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) వార్షిక సర్వ సభ్య సమావేశం (ఏజీఎం) తీర్మానం ఆమోదించింది. ఉప్పల్ స్టేడియంలో ప్రపంచ శ్రేణి శిక్షణ కేంద్రం, హైదరాబాద్ పరిధిలో నాలుగు శాటిలైట్ అకాడమీలు సహా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మినీ స్టేడియం నిర్మాణాలు చేపట్టనున్నారు. బీసీసీఐ నిధుల్లో కనీసం 30 నిధులను గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి ఖర్చు చేయనున్నారు. అందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. మహిళల క్రికెట్‌కు సైతం ఓ కమిటీని ఏర్పాటు చేసేందుకు ఏజీఎం ఆమోదించింది. హెచ్‌సీఏ తరఫున బీసీసీఐ సమావేశానికి అధ్యక్షుడు జగన్‌మోహన్, కార్యదర్శి దేవరాజ్ రొటేషన్ విధానంలో హాజరుకావాలని సభ్యులు తీర్మానించారు. గతంలో రసాభాసాగా సాగిన హెచ్‌సీఏ సమావేశాలకు భిన్నంగా 86వ ఏజీఎం స్నేహపూర్వక వాతావరణంలో ముగిసింది.



నవచిత్రం

పాన్ ఇండియా సినిమా రికార్డ్ బ్రేక్..

ప్రతి భారతీయుడు కచ్చితంగా చూడాల్సిన చిత్రంగా చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ బ్యానర్ పై చదలవాడ పద్మావతి నిర్మిస్తున్న చిత్రం ‘రికార్డ్ బ్రేక్’. ఈ చిత్ర గ్లింప్స్, టీజర్, ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది.
ఈవెంట్‌కి ముఖ్య అతిథులుగా విచ్చేసిన దర్శకులు అజయ్ కుమార్ గ్లింప్స్‌ని, టీజర్‌ని నిర్మాత రామసత్యనారాయణ, ట్రైలర్‌ని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ టి.ప్రసన్నకుమార్ లాంచ్ చేశారు.
దర్శకుడు చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ‘ఈ సినిమా ఇంత చక్కగా రావడానికి నాలో సగభాగం అయిన నా దర్శకుడు అజయ్‌కే దక్కుతుంది. అలాగే ప్రసన్నకుమార్‌కి కూడా. ఈ సినిమాలో హీరో అంటూ ఎవరు ఉండరు ఈ సినిమాకి మెయిన్ హీరోలు ఆర్ట్ డైరెక్టర్, ఫైట్ మాస్టర్, మ్యూజిక్ డైరెక్టర్. సొసైటీకి ఉపయోగపడే కథతో సినిమా తీయాలని అనుకున్నాను. దాన్ని తెరపై చూపించేందుకు నాకున్న అనుభవాన్ని అంతా వాడాను. అలాగే ఈ సినిమా చూసి చలపతిరావు చాలా బాగా వచ్చిందని ప్రశంసించారు. ఆయన ఆఖరి ప్రశంసలు నాకు దక్కాయి. రీసెంట్‌గా కొంతమంది దర్శకులు ఈ సినిమా చూసి, రికార్డ్ బ్రేక్ కరెక్ట్ టైటిల్ అని చెప్పారు. ఈ సినిమా ఖచ్చితంగా అన్ని భాషల్లోనూ వండర్స్ క్రియేట్ చేస్తుంది. లాస్ట్ 45 నిమిషాలు ఈ సినిమా మంచి ఎమోషనల్‌గా ఉంటుంది. అందరికీ నచ్చే సినిమా అవుతుంది’ అని తెలిపారు.

విజువల్ వండర్‌గా ఇంద్రాణి



యానీయా భరద్వాజ్, కబీర్ దుహాన్ సింగ్ ప్రధాన పాత్రలలో నటిస్తోన్న చిత్రం ‘ఇంద్రాణి’. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో ఈ మూవీ రూపొందుతోంది. ఈ మూవీ ద్వారా స్టెఫన్ పల్లం దర్శకుడిగా పరిచయమవుతుండగా వెరోనికా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై స్టాన్లీ సుమన్ బాబు నిర్మాణ సారథ్యంలో సుధీర్ వేల్పుల, కెకెరెడ్డి, జైసన్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను పార్క్ హయాత్ హెూటల్‌లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి మణిశర్మ, నిర్మాత అనీల్ సుంకర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు స్టాన్లీ పల్లం మాట్లాడుతూ, ‘ఈ సినిమా క్లైమాక్స్‌లో ఏం జరగబోతుంది అనేది ఊహించడం చాలా కష్టం. అంత అద్భుతమైన కథ. ట్రైలర్ అందరికీ నచ్చింది. ఈ సినిమా ఇంత బాగా వచ్చిందంటే ఆ క్రెడిట్ అంతా మా బ్రదర్ స్టీఫెన్‌కే చెల్లుతుంది. సాయి కార్తిక్ సింగిల్ సిట్టింగ్స్‌లోనే మంచి సాంగ్స్ ఇచ్చాడు’ అని తెలిపారు. ‘అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఉన్న మంచి సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్. ఒక విజువల్ వండర్‌గా ఉంటుంది. టైమ్ మెషిన్, రోబో ఇలా ప్రతీది సినిమాలో కీలకంగా ఉంటుంది. ఈ సినిమా తప్పకుండా ఆడియన్స్‌ని ఎంటర్టైన్ చేస్తుంది. రాబోయో 50 సంవత్సరాల్లో ఇండియా ఎంత అడ్వాన్స్‌గా ఉండనుంది అనేది ఈ సినిమాలో చూపించాం. ఈ మూవీ యువతరానికి చాలా స్ఫూర్తి దాయకంగా ఉంటుంది. ఇది అందర్నీ అలరించే సినిమా అవుతుంది’ అని స్టీఫెన్ పల్లం చెప్పారు.

యూనిక్ క్రైమ్ థ్రిల్లర్



శివ కందుకూరి హీరోగా రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ ‘భూతద్దం భాస్కర్ నారాయణ’. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించిన ఈ సినిమాకి పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. మార్చి 1న ఈ చిత్రం విడుదల కానుంది.
ఈ నేపథ్యంలో ఈ చిత్రం నుంచి ‘శివ ట్రాప్ ట్రాన్స్’ పాటని ఎంఎం కీరవాణీ లాంచ్ చేశారు. హీరో సుహాస్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సాంగ్ లాంచింగ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. దర్శకుడు విజయ్ కనకమేడల, హీరోయిన్ వర్ష బొల్లమ్మ ఈ వేడుకలో పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.
హీరో శివ కందుకూరి మాట్లాడుతూ, ‘శివ ట్రాప్ ట్రాన్స్’ ఈ సినిమా ఆల్బంలో నా ఫేవరేట్. సినిమాలో చాలా కీలక సమయంలో ఈ పాట వస్తుంది. విజువల్‌తో ట్రాక్ వినప్పుడు అన్ బిలివబుల్ అనిపించింది. ఇలాంటి ట్రాక్ దొరకడం ఆనందంగా ఉంది. శ్రీచరణ్ అద్భుతమైన ట్యూన్ ఇచ్చారు. చైతన్య ప్రసాద్ లిరిక్స్, కాలభైరవ పాడిన తీరు పాటని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్ళింది. మా ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ పాట కూడా నచ్చుతుంది. ఈ రెండు నచ్చాయంటే మా సినిమా కూడా తప్పకుండా నచ్చుతుంది’ అని అన్నారు. ‘ఈ పాట కోసం శ్రీ చరణ్ ఇచ్చిన ట్యూన్, చైతన్య ప్రసాద్ అల్లిన పదాలు గూస్ బంప్స్ తెప్పించాయి. రావణాసురుడు శివుడుని ఎంత తీవ్రతతో పూజించారో ఇందులో మా విలన్ పాత్ర కూడా ఆ స్థాయిలో ఉంటుంది. ఖచ్చితంగా సినిమా మీ అందరికీ నచ్చుతుంది’ అని దర్శకుడు పురుషోత్తం రాజ్ చెప్పారు. నిర్మాతలు స్నేహాల్, శశిధర్, కార్తీక్ మాట్లాడుతూ, ‘ట్రైలర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేసింది. తప్పకుండా థియేటర్స్‌లో చూడండి. అందరికీ అద్భుతంగా నచ్చుతుంది’ అని అన్నారు.

కానిస్టేబుల్ పరీక్షకు సన్నీ లియోనా..?

రిక్రూట్‌మెంట్ పరీక్ష అడ్మిట్ కార్డులో సినీ నటి సన్నీ లియోన్ పేరు, ఫొటో కనిపించింది. అడ్మిట్ కార్డు ఫోటో సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. అడ్మిట్ కార్డులో శ్రీమతి సోనేశ్రీ మెమోరియల్ గర్ల్స్ కాలేజ్, తిర్వా, కనౌజ్ పరీక్షా కేంద్రంగా పేర్కొనబడింది. ఈ చిరునామా ముంబయిలో ఉంది. మహోబాకు చెందిన ఓ వ్యక్తి పేరిట ఉన్న మొబైల్ నెంబర్‌ను ఉపయోగించి దరఖాస్తు పంపినట్టు జాతీయ మీడియా పేర్కొంది. కనౌజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



60 వేల కానిస్టేబుల్ పోస్టులకు 50 లక్షల మంది దరఖాస్తు

యూపీలో తాండవిస్తున్న నిరుద్యోగం
సన్నీలియోన్‌కు అడ్మిట్ కార్డు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో నిరుద్యోగం తాండవిస్తోంది. 60,244 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు ఏకంగా 50,14,924 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 35 లక్షల మంది పురుషులు, 15 లక్షల మంది మహిళలు ఉన్నారు.రిజర్వేషన్ విధానం ప్రకారం మహిళా అభ్యర్థులకు 20 శాతం పోస్టులు ఉన్నాయి. 12,049 మంది మహిళలు ఉద్యోగాలు పొందనున్నారు. అంటే ఒక ఉద్యోగానికి 124 మంది పోటీ పడుతున్నారు. 49,195 మంది పురుషులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక ఉద్యోగానికి 73 మంది పోటీ పడుతున్నారు.
సంబంధిత అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... యూపీపీఆర్‌పీబీ ఆధ్వర్యాన యూపీ పోలీస్ కానిస్టేబుల్ - 2024 పరీక్షలను 75 జిల్లాల్లోని 2,385 కేంద్రాల్లో శని, ఆదివారాల్లో నాలుగు షిఫ్టుల్లో నిర్వహించారు. దరఖాస్తుదారుల్లో ఆరు లక్షల మందికిపైగా ఇతర రాష్ట్రాల వారు ఉన్నారు. బీహార్ 2,67,305, హర్యానా 74,769, జార్ఖండ్ 17,112, మధ్యప్రదేశ్ 98,400, ఢిల్లీ 42,259, రాజస్థాన్ 97,277, ఉత్తరాఖండ్ 14,627, పశ్చిమ బెంగాల్ 5,512, పంజాబ్ 3404, మహారాష్ట్ర 3,151 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో 22 జిల్లాలకు చెందిన 120 మందిని పరీక్ష రాసేటప్పుడు అక్రమాలకు పాల్పడినందుకు అరెస్టు చేశారు.

షార్జిల్ ఇమామ్‌కు బెయిల్ నిరాకరణ

రాజద్రోహం, ఉపా కింద కేసులపై...



న్యూఢిల్లీ : రాజద్రోహం, చట్ట వ్యతిరేక కార్యక్రమాల నిరోధక చట్టం (ఉపా) కింద నమోదైన కేసులో షార్జిల్ ఇమామ్‌కు బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీలోని కర్కర్దూమా కోర్టు నిరాకరించింది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా ఢిల్లీ, అలీగఢ్ ముస్లిం యూనివర్శిటీల్లో షార్జిల్ ఇమామ్ చేసిన ప్రసంగాలు అల్లర్లకు, హత్యలకు ప్రత్యక్షంగా ప్రేరణ కాకపోయినా.. గణనీయమైన జన సమీకరణ, 2020 ఫిబ్రవరిలో హింసాకాండ పెరుగుదలలో కీలక పాత్ర పోషించిందని కర్కర్దూమా కోర్టు అదనపు సెషన్స్ జడ్జి సమీర్ బాజ్‌పాయ్ శనివారం తన ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇమామ్‌ను 2020 జనవరిలో అరెస్టు చేశారని, నాలుగేండ్లకు పైగా జైలులో ఉన్నందున బెయిల్ ఇవ్వాలని ఆయన తరుపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. రాజద్రోహం నేరారోపణలను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, ఉపా కేసుల్లో గరిష్ఠంగా ఏడేండ్ల వరకూ మాత్రమే శిక్ష విధిస్తారని న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వాదనలను ఢిల్లీ పోలీసులు వ్యతిరేకించారు. తనపై నమోదు చేసిన అభియోగాలను సవాల్ చేస్తూ ఇమామ్ దాఖలు చేసిన పిటీషన్‌ను మార్చి 8న ఢిల్లీ హైకోర్టు విచారించనుంది. ఇమామ్ బెయిల్ పిటీషన్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టును హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలోనే కర్కర్దూమా కోర్టు బెయిల్ నిరాకరిస్తున్నట్లు తాజాగా పేర్కొంది.

పాలస్తీనా విదేశాంగ మంత్రితో జైశంకర్ భేటీ

మ్యూనిచ్ : పాలస్తీనా విదేశాంగ మంత్రి రియాద్ అల్ మాలికితో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆదివారం సమావేశమయ్యారు. ఈ విషయాన్ని జైశంకర్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో గాజాలో ప్రస్తుత పరిస్థితిపై తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపారు. ‘పాలస్తీనా విదేశాంగ మంత్రి రియాద్ అల్ మాలికితో సమావేశం కావడం చాలా సంతోషంగా ఉంది. గాజాలో ప్రస్తుత పరిస్థితిపై అభిప్రాయాలు పంచుకున్నాం’ అని మంత్రి తెలిపారు. సమావేశానికి సంబంధించిన ఫోటోను కూడా షేర్ చేశారు. మ్యూనిచ్ భద్రతా సదస్సు నేపథ్యంలో జైశంకర్ ప్రస్తుతం జర్మనీలోని మ్యూనిచ్ పట్టణంలో ఉన్న సంగతి తెలిసిందే. శనివారం ఈ సదస్సులో జైశంకర్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ - పాలస్తీనా సమస్య పరిష్కారానికి రెండు దేశాల ఏర్పాటే పరిష్కారమని భారత్ ఎన్నో ఏళ్ల నుంచి చెబుతున్న విషయాన్ని మరోసారి స్పష్టం చేశారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886